సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 79

సోమవారం 10-6-2024

'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 79

సోమవారం 10-6-2024



'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి. దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'



న్యూయార్క్‌లో నమో భారత్...

పాకిస్తాన్‌తో జరిగిన టి20 ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌లో 6 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్.

వివరాలు 7లో ▸

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సీఎంగా సురేశ్ పూజారి?

ఒడిశా ముఖ్యమంత్రి పదవి బీజేపీ సీనియర్ నేత సురేశ్ పూజారికి దక్కవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

వివరాలు 6లో ▸



ఈ బాండ్ బంగారం

దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే వారు బంగారానికి తప్పక చోటు ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు.

ప్రాఫిట్ ప్లస్‌లో ▸



'ఫ్రెంచ్ కింగ్' అల్‌కరాజ్

అంచనాలకు అనుగుణంగా ఆడిన స్పెయిన్ టెన్నిస్ స్టార్ అల్‌కరాజ్ కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకున్నాడు.

వివరాలు 7లో ▸



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అభివాదం చేస్తున్న మోదీ

మోదీ అనే నేను..

ప్రధానిగా నరేంద్రుని ప్రమాణస్వీకారం వరుసగా మూడోసారి, నెహ్రూ రికార్డు సమం

- 72 మందితో కొలువుదీరిన కేంద్ర మంత్రివర్గం
- షా, రాజ్‌నాథ్, నిర్మల, గడ్కరీ, జైశంకర్ కొనసాగింపు
- ఆంధ్రప్రదేశ్‌కు 3, తెలంగాణకు 2 పదవులు
- కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌లకు కేబినెట్ పదవులు
- బండి, పెమ్మసాని, వర్మలకు సహాయ బెర్తులు
- యూపీకి 9, బిహార్‌కు 8, మహారాష్ట్రకు 6 బెర్తులు
- గుజరాత్, మధ్రప్రదేశ్, రాజస్తాన్‌లకు ఐదేసి స్థానాలు
- 30 కేబినెట్, 5 స్వతంత్ర, 36 మంది సహాయ మంత్రులు
- 11 బెర్తులతో ఎన్డీఏ భాగస్వాములకు సముచిత ప్రాధాన్యం

న్యూఢిల్లీ: స్వతంత్ర భారత రాజకీయాల్లో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. దేశ ప్రధానిగా నరేంద్ర దామోదర్ దాస్ మోదీ వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత ఈ ఘనత సాధించిన నాయకునిగా రికార్డులకెక్కారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 73 ఏళ్ల మోదీతో ప్రధానిగా ప్రమాణంచేయించారు. ఆయన దైవసాక్షిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆదివారం రాత్రి ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అన్ని రంగాలకూ చెందిన అతిరథ మహారథుల సమక్షంలో కార్యక్రమం 155 నిమిషాల పాటు అత్యంత వేడుకగా జరిగింది. మోదీ సహా 72 మందితో పూర్తిస్థాయి నూతన కేంద్ర మంత్రివర్గం కూడా ఈ సందర్భంగా కొలువుదీరింది. 30 మందితో కేబినెట్ మంత్రులుగా, ఐదుగురితో స్వతంత్ర, 36 మందితో సహాయ మంత్రులుగా రాష్ట్రపతి ప్రమాణస్వీకారం చేయించారు. బీజేపీకి

మిగతా 2వ పేజీలో ▶



ప్రమాణ స్వీకారం చేస్తున్న కిషన్‌రెడ్డి

విధేయతకు పెద్దపీట

మోదీ కేబినెట్‌లో రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు చాన్స్

- వరుసగా రెండోసారి కేబినెట్ మంత్రిగా కిషన్‌రెడ్డి
- నాలుగుసార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా కలసివచ్చిన అనుభవం
- దూకుడుతో పార్టీని బలోపేతం చేసిన బండి సంజయ్‌కి సహాయ మంత్రి పదవి

2 లో



ప్రమాణ స్వీకారం చేస్తున్న బండి సంజయ్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మనోళ్ల మెరుపులు

టాప్-10లో నాలుగు ర్యాంకులు తెలుగు విద్యార్థులకే..

- వందలోపు ర్యాంకుల్లో 20 మంది మనవారే..
- భోగలపల్లి సందేశ్‌కు జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు
- జాతీయ టాపర్‌గా ఢిల్లీ విద్యార్థి వేద్ లహోటి..
- రెండు రాష్ట్రాల్లో కలిపి 12 వేల మందికి అర్హత.. పెరిగిన కటాఫ్ పర్సంటైల్.. నేటి నుంచి జోసా కౌన్సెలింగ్ మొదలు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో తెలుగు విద్యార్థులు ఈసారి కూడా సత్తా చాటారు. తొలి పది ర్యాంకుల్లో నాలుగింటిని తెలుగు విద్యార్థులే కైవసం చేసుకున్నారు. టాప్ వంద ర్యాంకుల్లో 20 మంది తెలుగు రాష్ట్రాల వారేకావడం గమనార్హం. మొత్తంగా అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన వారిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు 12 వేల మంది వరకు ఉన్నారు. దేశంలోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లలో ప్రవేశాల కోసం గత నెల 26న దేశవ్యాప్తంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలను నిర్వహించిన మద్రాస్ ఐఐటీ ఆదివారం ఫలితాలను వెల్లడించింది.

48,248 మందికి అర్హత: జేఈఈ మెయిన్స్‌లో సాధించిన ర్యాంకుల ఆధారంగా అడ్వాన్స్‌డ్‌కు దేశవ్యాప్తంగా 2.5 లక్షల మందిని

మిగతా 5వ పేజీలో ▶



వేద్ లహోటి (ఒకటో ర్యాంక్)



సందేశ్ (3వ ర్యాంక్)



తేజేశ్వర్ (8వ ర్యాంక్)

'నీట్'పై టెన్షన్

వెల్లడించిన ఫలితాలు ఉంచుతారా? రద్దు చేస్తారా?

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై విమర్శల వెల్లువ

- దేశవ్యాప్తంగా కోర్టులను ఆశ్రయిస్తున్న విద్యార్థులు
- చెప్పిన తేదీకి పది రోజుల ముందే ఫలితాల వెల్లడిపై సందేహాలు
- ఎన్నికల ఫలితాల రోజు విడుదల చేయడంపైనా అనుమానాలు
- కొందరికి గ్రేస్ మార్కులిచ్చారు సరే... మరి హైదరాబాద్ విద్యార్థులకు ఇవ్వరా?

సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్య ప్రవేశాలకు నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్ష ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. ప్రవేశ పరీక్ష సందర్భంగా లోపాలు తలెత్తడం... ఫలితాల వెల్లడి సమయంలో మార్కుల్లో అవకతవకలు జరిగినట్లుగా ఆరోపణలు రావడంతో ఏం జరుగుతుందా అన్న చర్చ జరుగుతోంది. అవకతవకలు జరిగినట్లు భావిస్తున్న అనేకమంది విద్యార్థులు, తల్లిదండ్రులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా వందలాది మంది కోర్టుల్లో పిటిషన్లు వేశారు. దీంతో అసలు నీట్ ఫలితాలు ఇవే ఉంటాయా? వాటిని రద్దు చేస్తారా? మళ్లీ నీట్ పరీక్ష ఏమైనా పెడతారా? అన్న ఆందోళనలు


మిగతా 5వ పేజీలో ▶



పార్లమెంట్‌లో గొంతుకనై ప్రశ్నిస్తా

- నీట్ లీకేజీపై బాధిత విద్యార్థులకు రాహుల్ భరోసా

- వివరాలు 6లో



కనుల పండువగా...

- మోదీ ప్రమాణోత్సవం సందర్భంగా కళకళలాడిన రాష్ట్రపతి భవన్
- రాజకీయ, పారిశ్రామిక దిగ్గజాలు, సినీ తారల సందడి

వినయంగా ఉండండి.. కష్టపడి పని చేయండి

- రుజువర్తన, పారదర్శకత విషయంలో రాజీ వద్దు
- నూతన మంత్రులకు మోదీ సూచన

'మామ'కు తొలిసారి కేంద్ర మంత్రి పదవి

-వివరాలు 6లో

తీర్థయాత్రికుల బస్సుపై కాల్పులు

లోయలో పడిన బస్సు

9 మంది మృతి

కశ్మీర్‌లో ఉగ్రమూకల దుశ్చర్య

- వివరాలు 6లో



జమ్మూకశ్మీర్‌లోని రేసాయ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో అదుపుతప్పి లోయలో పడిపోయిన బస్సు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈటల రాజేందర్?

- సోమవారం అమిత్ షాతో భేటీ తర్వాత అధికారికంగా ప్రకటించే చాన్స్
- కిషన్‌రెడ్డికి మళ్లీ కేంద్ర మంత్రి పదవి రావడంతో.. రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడి నియామకం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంపై ఫోకస్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకోవాలనే దీర్ఘకాలిక వ్యూహం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నియామకం కానున్నట్టు ఆ పార్టీలోని విశ్వసనీయ వర్గాల సమాచారం. సోమవా రం ఢిల్లీలో కేంద్ర మంత్రి అమిత్ షాతో ఈటల సమావేశం కానున్నారు. అనంతరం ఈటలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్టు తెలిసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న జి.కిషన్‌రెడ్డికి మళ్లీ కేంద్ర కేబినెట్ మంత్రిగా అవకాశం దక్కిన

మిగతా 3వ పేజీలో ▶

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు 74% హాజరు

- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 4.03లక్షలు..రాసింది 3.02లక్షలు
- ప్రాథమిక సమాచారం ప్రకారం హాజరుశాతం ప్రకటించిన టీజీపీఎస్సీ
- ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి మెయిన్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 4.03 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు 3.02లక్షల మంది మాత్రమే హాజరైనట్టు టీజీపీఎస్సీ ప్రాథమికంగా వెల్లడించింది. క్షేత్రస్థాయి నుంచి వచ్చే లెక్కల తర్వాత హాజరుశాతంపై స్పష్టత వస్తుందని కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష కి అతి

మిగతా 5వ పేజీలో ▶

హైదరాబాద్‌లోని ఓ పరీక్షకేంద్రం వద్ద అభ్యర్థులు





సమీప భవిష్యత్తులో అంటే 2029లోనే కదా మేడం!

రామోజీకి అశ్రు నివాళి

- ఫిలింసిటీలోని నివాసం నుంచి స్మృతివనం వరకు అంతిమయాత్ర
- పాడె మోసిన చంద్రబాబు
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- రామోజీ చితికి నిప్పంటించిన ఆయన కుమారుడు కిరణ్
- రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు హాజరు



5 లో

ఇదేనా ప్రజాస్వామ్యం!?

ఏపీలో రోజురోజుకూ పెరుగుతున్న దాడులు.. పేట్రేగిపోతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు చోద్యం చూస్తున్న పోలీసులు

ఏపీలో టీడీపీ నేతలు, కార్యకర్తల దౌర్జన్యాలు రోజురోజుకూ మితిమీరి పోతు న్నాయి. చంద్రబాబు, లోకేశ్ కనుసన్నల్లో ఇష్టానుసారం దాడులు చేస్తూ పేట్రేగిపోతున్నారు. అధికారంలోకి వచ్చింది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను చితకబాదడానికే అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఊరూరా ఆస్తుల ధ్వంసం, ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల తొలగింపు, శిలాఫలకాల విధ్వంసం కొనసాగుతూనే ఉంది. ఎప్పుడో చరిత్ర పుస్తకాల్లో చదువుకున్న ఆటవిక రాజ్యాన్ని తలపిస్తూ పోటీపడి మరీ దాడులు చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దుస్తులు విప్పి కొట్టడమే కాకుండా, లోకేశ్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై కూర్చోబెట్టి బూతులు తిట్టారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెలో 50 ఇళ్లకు మంచి నీరు బంద్ చేశారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలంలో అర్చకత్వ బాధ్యతలు తమ వర్గీయులకు అప్పగించాలంటూ ఓ పూజారి

మిగతా 3వ పేజీలో ▶



మంగళగిరి నియోజకవర్గంలోని పెదవడ్లపూడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజ్‌కుమార్‌ను చితకబాది మోకాళ్లపై కూర్చోబెట్టిన టీడీపీ నాయకులు

'పోలీస్' హ్యాకర్.. 20 ఏళ్ల విద్యార్థి


- ఢిల్లీలో అరెస్ట్.. హైదరాబాద్‌కు తెచ్చిన పోలీసులు.. గతంలోనూ అతడిపై సైబర్ నేరాల కేసులు నమోదు
- తెలంగాణ పోలీస్ యాప్‌ల నుంచి ఏ పౌరుడి సమాచారం పోలేదు
- ఏ వినియోగదారుడి డేటా లీక్ కాలేదు
- సహ నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది : డీజీపీ

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ పోలీస్‌యాప్‌లు హాక్‌ఐ, టీఎస్‌కాప్‌లను హ్యాక్ చేసిన నిందితుడిని ఢిల్లీలో శనివారం అరెస్టు చేశారు. నిందితుడు యూపీలోని ఝాన్సీకి చెందిన విద్యార్థి జతిన్‌కుమార్(20) అని డీజీపీ రవిగుప్తా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ యాప్‌ల హ్యాకింగ్‌తో ఏ వినియోగదారుడికి సంబంధించిన సున్నితమైన, ఆర్థిక పరమైన సమాచారం లీక్ కాలేదని డీజీపీ స్పష్టం చేశారు. నిందితుడిని ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించినట్టు తెలిపారు. హాక్‌ఐ యాప్ హ్యాక్ అయినట్టు గుర్తించిన వెంటనే తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రంగంలోకి దిగిందన్నారు. కేసు నమోదు చేసి

మిగతా 5వ పేజీలో ▶

ఆదిలాబాద్ మినహా అంతటా అత్యల్పమే

- రాష్ట్రవ్యాప్తంగా తగ్గుతున్న గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు
- నిజామాబాద్ వరకు విస్తరించిన నైరుతి రుతుపవనాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో విస్తరిస్తుండటం.. పలుచోట్ల వానలు కురుస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మినహా దాదాపు అన్నిచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌లో 39.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత, మెదక్‌లో 22.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా నమోదు కాగా, హనుమకొండ, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయింది. మిగతా ప్రాంతాల్లో కూడా 3 డిగ్రీలు తక్కువగా నమోదు అయింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు నిజామాబాద్ వరకు విస్తరించాయి. మరో రెండ్రోజుల్లో రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని వాతావరణ శాఖ వివరించింది. రానున్న రెండు రోజులు రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

విధేయతకు పెద్దపీట!

మోదీ కేబినెట్‌లో రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు చాన్స్

- వరుసగా రెండోసారి కేబినెట్ మంత్రిగా కిషన్‌రెడ్డి
- నాలుగుసార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా కలసివచ్చిన అనుభవం
- దూకుడుతో పార్టీని బలోపేతం చేసిన బండి సంజయ్‌కు సహాయ మంత్రి పదవి

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: పార్టీ పట్ల విశ్వాసం, విధేయతే గీటురాయిగా తెలంగాణ నుంచి ఇద్దరు బీజేపీ ఎంపీలకు కేంద్ర మంత్రులుగా చాన్స్ దక్కింది. జి.కిషన్‌రెడ్డి కేబినెట్ మంత్రిగా, బండి సంజయ్ సహాయ మంత్రిగా నియమితుల య్యారు. ఇందులో కిషన్‌రెడ్డి రాష్ట్ర రాజధానిలోని సికింద్రాబాద్ నుంచి గెలవగా.. సంజయ్ ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ నుంచి విజయం సాధించారు. ఇద్దరూ కూడా తమ నియోజకవర్గాల్లో వరుసగా రెండోసారి ఎంపీగా గెలిచినవారే. మోదీ మూడో కేబినెట్‌లో రాష్ట్రం నుంచి ఇద్దరికి అవకాశం లభించడం పట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో పట్టుసాధించడంతో..

2019లో బీజేపీ తెలంగాణలో 4 ఎంపీ సీట్లను గెలుచుకున్న విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డికి తొలుత కేంద్ర సహాయ మంత్రిగా పదవి వరించింది. తర్వాత కేంద్ర కేబినెట్ మంత్రిగా ప్రమోషన్ అందింది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారు. వీరిలో కిషన్‌రెడ్డి, సంజయ్, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వ ర్‌రెడ్డి, గోడెం నగేశ్ రెండోసారి ఎంపీలుగా గెలవగా.. డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావు తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. కేంద్ర కేబినెట్‌లో చోటు కోసం కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్. డీకే అరుణ మధ్య పోటీ నెలకొంది. మిగతా వారు కూడా పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ జాతీయ నాయకత్వం గట్టి కసరత్తే చేసింది. పార్టీకి ముందు నుంచీ విధేయులుగా ఉండటం, రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడంలో కిషన్‌రెడ్డి, సంజయ్‌ల కృషి దోహదపడటాన్ని పరిగణనలోకి తీసుకుంది.

అనుభవం, సీనియారిటీతో..

కిషన్‌రెడ్డి నాలుగు సార్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు అందించారు. గత కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. కరోనా టైంలో కేంద్రమంత్రిగా ఢిల్లీ కేంద్రంగా కంట్రోల్ రూంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అధిష్టానానికి నమ్మిన బంటుగా ఉన్నారు. కేంద్రమంత్రిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ.. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి సీట్లు పెరగడానికి కృషి చేశారు. ఈ అంశాలన్నీ కలసివచ్చి కిషన్‌రెడ్డిని మరోసారి కేంద్ర కేబినెట్ మంత్రి పదవి వరించింది.

దూకుడుగా పార్టీ బలోపేతంతో..

2019లో కరీంనగర్ ఎంపీగా సంచలన విజయం సాధించిన బండి సంజయ్.. పార్టీ రాష్ట్ర అధ్యక్షు డిగా నియామకమైన తర్వాత దూకుడుగా వ్యవహ రించారు. అప్పట్లో అధికార బీఆర్ఎస్‌ను, కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పెట్టేలా పోరాటాలు చేశారు. పార్టీపై తనదైన ముద్ర వేశారు. పలుమార్లు మోదీ, అమిత్ షాలతో శభాష్ అనిపించుకున్నారు. రాష్ట్రంలో బీజేపీ ఇంత బలోపేతం కావడానికి బండి సంజయ్ కూడా కారణమని ఆ పార్టీ శ్రేణులు చెప్తుంటాయి. దీనికితోడు తొలి నుంచీ ఆర్ఎస్ఎస్‌లో కొనసాగడం, పార్టీ పట్ల విధేయత వంటివి కూడా బండి సంజయ్‌కు కలసివచ్చాయి. కేంద్ర మంత్రిగా అవకాశం దక్కింది.

ఏపీ నుంచి ముగ్గురికి..

ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ఎంపీలకు కేంద్ర మంత్రి పదవులు దక్కాయి. ఎన్డీయే కూటమిలోని పొత్తు మేరకు ఇద్దరు టీడీపీ ఎంపీలకు అవకాశం వచ్చింది. ఇందులో మూడు సార్లు ఎంపీగా గెలిచిన రామ్మోహన్‌నాయుడు, తొలిసారి గెలిచిన పెమ్మ సాని ఉన్నారు. ఇక బీజేపీ ఎంపీ శ్రీనివాసవర్మకు కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కింది. 1991 నుంచీ పార్టీలో పనిచేస్తున్న ఆయన సీనియారిటీ, విధేయతను దృష్టిలో పెట్టుకొని అవకాశం ఇచ్చారు. మొత్తంగా ఈసారి తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురికి కేంద్ర మంత్రి పదవులు లభించడం గమనార్హం.



నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బాణసంచా కాలుస్తున్న పార్టీ శ్రేణులు

ఉదయం ఫోన్‌లు.. మధ్యాహ్నం తేనీటి విందు..

ఆదివారం ఉదయం పది గంటల నుంచే మంత్రులుగా ఎంపికైన ఎంపీలకు ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్లు వెళ్లాయి. మధ్యాహ్నం నుంచే అందుబాటులో ఉండాలని ఆ ఎంపీలకు సమాచారం ఇచ్చారు. లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో భేటీకి రావాలని సూచించారు. దీంతో కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఇతర ఎంపీలు అక్కడికి చేరుకున్నారు. కేంద్ర మంత్రులుగా ఎంపికైన అందరినీ ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా అభినందించారు. మధ్యాహ్నం పన్నెండున్నర గంటల సమయంలో ప్రధాని తేనీటి విందు ఇచ్చారు. తర్వాత పలు అంశాలపై మార్గనిర్దేశం చేశారు. 'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయాలని, 100 రోజుల ఎజెండాను అమలు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. తర్వాత అంతా రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లారు.

హిందీలో ప్రమాణ స్వీకారం

కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ హిందీలో ఈశ్వరుని సాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరు ప్రమాణం చేస్తున్న సమయంలో కార్యక్రమానికి హాజ రైన కార్యకర్తలు 'జై శ్రీరామ్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి ఎంపీలు డీకే అరుణ, గోడెం నగేశ్, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావుతో పాటు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.

క్లుప్తంగా...

ప్రధాని మోదీకి వైఎస్ జగన్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: దేశ ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించిన సంద ర్భంగా నరేంద్ర మోదీకి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

పురందేశ్వరికి లోక్‌సభ స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్?

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్‌గా ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై బీజేపీ దృష్టి సారించింది. ఈసారి మహిళలకు స్పీకర్ పదవి ఇవ్వనున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేరు తెరపైకి వచ్చింది. మోదీ ప్రభుత్వం నారీ శక్తికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో పురందేశ్వరి పేరును లోక్‌సభ స్పీకర్ పదవి కోసం బీజేపీ జాతీయ నాయకత్వం పరిశీలిస్తోందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా పురందేశ్వరిని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటారన్న ప్రచారం జరిగినప్పటికీ, నర్సాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్ వర్మ వైపే బీజేపీ అధిష్టానం మొగ్గు చూపింది. ఒకవేళ లోక్‌సభ స్పీకర్ పదవి దక్కని పక్షంలో ఆమెకు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కుతుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జనసేనను కేంద్ర కేబినెట్‌లో చేర్చుకోలేదు.

కేంద్ర మంత్రులకు పొన్నం శుభాకాంక్షలు

నిధుల విషయంలో రాష్ట్రానికి సహకరించాలని సూచన



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. 'గత రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రంతో సఖ్యత లేకపోవడం వలన రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదు. మా ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తితో ఉంది. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులుగా రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల అభివృద్ధికి సంబంధించి నిధులు తెచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి మీ సహకారం అందించాలి. విభజన చట్టంలోని అన్ని హామీలను నెరవేర్చి అభివృద్ధి కోసం పాటు పడతారని ఆకాంక్షిస్తున్నా' అని పొన్నం ఆ ప్రకటనలో తెలిపారు.

మోదీ అను నేను...

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి మెజారిటీ రాని నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారిన ఎన్డీఏ మిత్రపక్షాలకు మంత్రివర్గంలో 11 బెర్తులతో సముచిత ప్రాధాన్యం దక్కింది. బీజేపీ నుంచి రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, ఎస్.జైశంకర్ వంటి అతిరథులతో పాటు మిత్రపక్షాల నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ), లలన్‌సింగ్ (జేడీయూ), చిరాగ్ పాస్వాన్ (ఎల్జేపీ), హెచ్.డి.కుమారస్వామి (జేడీఎస్) తదితరులు ప్రమాణస్వీకారం చేసిన ప్రముఖుల్లో ఉన్నారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జేడీ(యూ) చీఫ్, బిహార్ సీఎం నితీశ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యక్రమంలో పాల్గొనగా తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీతో పాటు పలు విపక్షాలు గైర్హాజరవడం విశేషం. 140 కోట్ల మంది భారతీయులకు మరోసారి సేవ చేయబోతున్నందుకు చాలా ఆనందంగా ఉందని కార్యక్రమం అనంతరం మోదీ పేర్కొన్నారు. ''నూతన మంత్రివర్గ సహచరులతో కలిసి ప్రగతి పథంలో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తా. అనుభవం, యువత కలబోతగా కొత్త మంత్రివర్గం అలరారుతోంది. ప్రజల జీవితాలను మెరుగు పరిచేందుకు నిరంతరం శ్రమిస్తాం'' అంటూ ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. నూతన మంత్రులకు శాఖల కేటాయింపు సోమవారం జరిగే అవకాశముంది.



మోదీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఆరుగురు మాజీ సీఎంలు

మోదీ 3.0 మంత్రివర్గం పలు విశేషాల సమాహారంగా రూపుదిద్దుకుంది. బీజేపీ అధ్యక్షుడు నడ్డా ఐదేళ్ల విరామం తర్వాత కేంద్ర మంత్రివర్గంలోకి అడుగు పెట్టారు. మాజీ సీఎంలు శివరాజ్‌సింగ్ చౌహాన్, కుమారస్వామిలకు తొలిసారి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. వారితో పాటు నూతన మంత్రివర్గంలో 33 మంది కొత్త ముఖాలున్నాయి. శివరాజ్, కుమారస్వామి, రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్ లాల్ ఖట్టర్, సర్బానంద సోనోవాల్, జితిన్‌రాం మాంఝీ రూపంలో నూతన మంత్రివర్గంలో ఆరుగురు మాజీ సీఎంలుండటం విశేషం! 43 మందికి మూడుసార్ల కంటే ఎక్కువగా కేంద్ర మంత్రులుగా చేసిన అనుభవముంది.

37 మందికి ఉద్వాసన

మోదీ 2.0 మంత్రివర్గంలో పని చేసిన వారిలో స్మృతీ ఇరానీ, అనురాగ్ ఠాకూర్, నారాయణ్ రాణే సహా ఏకంగా 37 మందికి ఈసారి కేబినెట్లో చాన్స్ దొరకలేదు. వీరిలో పలువురు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. 2.0 మంత్రివర్గంలోని 19 మంది కేబినెట్ మంత్రులతో సహా మొత్తం 34 మంది తిరిగి చోటు దక్కించుకున్నారు. వీరిలో తమిళనాడుకు చెందిన ఎల్ మురుగన్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఓడినా చాన్స్ దక్కడం విశేషం. ఆయన రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. కొత్త మంత్రుల్లో ప్రతి ఆరుగురిలో ఒకరు చొప్పున 12 మంది రాజ్యసభ సభ్యులున్నారు. 58 మంది లోక్‌సభ సభ్యులు కాగా రవ్‌నీత్‌సింగ్ బిట్టూ, జార్జి కురియన్ ఏ సభలోనూ సభ్యులు కారు. వారు ఆర్నెల్లలోగా పార్లమెంటు సభ్యులుగా ఎన్నికవాల్సి ఉంటుంది.

కొత్త మంత్రులు 33 మంది

మోదీ 3.0 మంత్రివర్గంలో 33 కొత్త ముఖాలకు చోటు దక్కింది. మాజీ సీఎంలు శివరాజ్‌సింగ్, కుమారస్వామి, మనోహర్‌లాల్ ఖట్టర్ తదితర దిగ్గజాలతో పాటు తొలిసారి ఎంపీలుగా నెగ్గిన సురేశ్ గోపి తదితరుల దాకా వీరిలో ఉన్నారు.

24 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం

కేంద్ర మంత్రివర్గంలో 24 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం దక్కింది. గోవా, అరుణాచల్ వంటి చిన్న రాష్ట్రాలను మినహాయిస్తే నలుగురు, అంతకంటే ఎక్కువ మంది లోక్‌సభ సభ్యులున్న ప్రతి రాష్ట్రం నుంచీ కనీసం ఒక్కరికి మంత్రివర్గంలో స్థానం లభించింది.

యూపీకి అత్యధికంగా 9 బెర్తులు

కేంద్ర మంత్రివర్గంలో ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా 9 స్థానాలు దక్కాయి. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలున్న కీలకమైన బిహార్‌కు ఏకంగా 8 బెర్తులు దక్కాయి! ఈ ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రకు కూడా ఆరు బెర్తులు లభించాయి. గుజరాత్‌కు ఐదు; మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లకు ఐదేసి; హరియాణా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులకు మూడేసి; ఒడిశా, అసోం, జార్ఖండ్, తెలంగాణ, పంజాబ్, పశ్చిమబెంగాల్‌కు రెండేసి చొప్పున స్థానాలు దక్కాయి. అయితే యూపీకి ఒకే కేబినెట్ హోదా బెర్తు దక్కగా బిహార్‌కు ఏకంగా నాలుగు లభించడం విశేషం! గుజరాత్‌కు కూడా మోదీ, అమిత్ షా, మాండవీ, సీఆర్ పాటిల్ రూపంలో ఏకంగా నాలుగు కేబినెట్ హోదా బెర్తులు దక్కాయి! మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లకు మూడేసి; మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఒడిశాలకు రెండేసి కేబినెట్ మంత్రి పదవులు దక్కాయి. తెలంగాణ, ఏపీలతో పాటు హరియాణా, పంజాబ్‌లకు ఒక్కో కేబినెట్ హోదా బెర్తు దక్కాయి. దక్షిణాది రాష్ట్రాల నుంచి 13 మందికి మంత్రివర్గంలో చోటు దక్కింది.

నేడు కేబినెట్ తొలి భేటీ

మోదీ 3.0 మంత్రివర్గ తొలి సమావేశం సోమవారం జరగనుంది. లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని మోదీ నివాసంలో సాయంత్రం భేటీ ఉంటుందని సమాచారం. నూతన మంత్రివర్గ సభ్యులందరికీ బీజేపీ అధ్యక్షుడు నడ్డా ఆదివారం రాత్రి విందు ఇచ్చారు.

భాగస్వాములకు పెద్దపీట

ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు నూతన మంత్రివర్గంలో సముచిత స్థానం దక్కింది. తాజా మాజీ మంత్రివర్గంలో వాటికి ఒక్క కేబినెట్ హోదా, స్వతంత్ర హోదా మంత్రి పదవి కూడా లేదు. ఈసారి మాత్రం కుమారస్వామి (జేడీఎస్), మాంఝీ (హెచ్ఏఎల్), లలన్‌సింగ్ (జేడీయూ), రామ్మోహన్ నాయుడు (టీడీపీ), చిరాగ్ పాస్వాన్ (ఎల్జేపీ-ఆర్‌వీ) రూపంలో ఏకంగా ఐదు కేబినెట్ హోదా బెర్తులు దక్కాయి! ప్రతాప్‌రావ్ జాదవ్ (శివసేన), జయంత్ చౌదరి (ఆరెల్డీ)లకు స్వతంత్ర హోదా కూడిన పదవులు లభించాయి. 2.0 మంత్రివర్గంలో సహాయ మంత్రులైన అనుప్రియా పటేల్ (అప్నా దళ్-యూపీ), రామ్‌దాస్ అథవాలె (ఆర్‌పీఐఏ-మహారాష్ట్ర)లకు మళ్లీ చాన్సిచ్చారు. వారితో పాటు రామ్‌నాథ్ ఠాకూర్ (జేడీయూ), పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ)లకు సహాయ మంత్రి పదవులు దక్కాయి.

ఏడుగురు మహిళలు

నూతన మంత్రివర్గంలో మహిళలు 10 శాతం కంటే తక్కువే ఉన్నారు. మొత్తం ఏడుగురికి స్థానం దక్కింది.

ఇదీ కులాల కూర్పు

మోదీ 3.0 మంత్రివర్గంలో 27 మంది ఓబీసీ, 10 మంది ఎస్సీ, ఐదుగురు ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారు. కాగా ఐదుగురు మైనారిటీలున్నారు. అయితే ముస్లింలు ఒక్కరు కూడా లేకపోవడం విశేషం.

ఇంకో 9 మందికి అవకాశం

కేంద్ర మంత్రివర్గ గరిష్ట పరిమాణం 81 (543 మంది లోక్‌సభ సభ్యుల్లో 15 శాతం). దాంతో మరో 9 మందికి మంత్రులుగా అవకాశముంది. అయితే 2019–24 మధ్య మోదీ 2.0 మంత్రివర్గంలో 78 మంది సభ్యులే ఉన్నారు.

అత్యంత పిన్న వయస్కులు రామ్మోహన్, ఖడ్సే

నూతన కేంద్ర మంత్రివర్గంలో ఏపీకి చెందిన కింజరాపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ), మహారాష్ట్రకు చెందిన రక్షా ఖడ్సే (బీజేపీ) అత్యంత పిన్న వయస్కులు. వారికి 37 ఏళ్లు. అత్యంత పెద్ద వయస్కునిగా 79 ఏళ్ల హెచ్ఏఎల్ అధినేత జితిన్‌రాం మాంఝీ నిలిచారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ

మోదీ 3.0 టీమ్

1. నరేంద్ర మోదీ ప్రధానమంత్రి

కేబినెట్ హోదా

2. రాజ్‌నాథ్‌సింగ్, 3. అమిత్ షా, 4. నితిన్ గడ్కరీ, 5. జేపీ నడ్డా, 6. శివరాజ్‌సింగ్ చౌహాన్, 7. నిర్మలా సీతారామన్, 8. ఎస్.జైశంకర్, 9. మనోహర్‌లాల్ ఖట్టర్, 10. హెచ్.డి.కుమారస్వామి (జేడీఎస్), 11. పీయూష్ గోయల్, 12. ధర్మేంద్ర ప్రధాన్, 13. జితిన్ రాం మాంఝీ (హెచ్ఏఎల్), 14. రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) (జేడీయూ), 15. సర్బానంద సోనోవాల్, 16. వీరేంద్ర కుమార్, 17. కింజరాపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ), 18. ప్రహ్లాద్ జోషీ, 19. జ్యుయల్ ఓరం, 20. గిరిరాజ్‌సింగ్, 21. అశ్వినీ వైష్ణవ్, 22. జ్యోతిరాదిత్య సింధియా, 23. భూపేందర్ యాదవ్, 24. గజేంద్రసింగ్ షెకావత్, 25. అన్నపూర్ణాదేవి, 26. కిరెణ్ రిజిజు, 27. హర్దీప్‌సింగ్ పురి, 28. మన్‌సుఖ్ మాండవీయ, 29. జి.కిషన్‌రెడ్డి, 30. చిరాగ్ పాస్వాన్ (ఎల్జేపీ), 31. సి.ఆర్.పాటిల్.

స్వతంత్ర హోదా

32. రావ్ ఇందర్‌జీత్ సింగ్, 33. జితేంద్ర సింగ్, 34. అర్జున్‌రాం మేఘ్వాల్, 35. ప్రతాప్ రావ్ జాదవ్ (శివసేన), 36. జయంత్ చౌదరి (ఆరెల్డీ).

సహాయ మంత్రులు

37. జితిన్ ప్రసాద్, 38. శ్రీపాద నాయక్, 39. పంకజ్ చౌదరి, 40. కృషన్‌పాల్ గుర్జర్, 41. రామ్‌దాస్ అథవాలె (ఆర్‌పీఐ), 42. రామ్‌నాథ్ ఠాకూర్ (జేడీయూ), 43. నిత్యానంద్ రాయ్, 44. అనుప్రియా పటేల్ (అప్నాదళ్), 45. వి.సోమన్న, 46. చంద్రశేఖర్ పెమ్మసాని (టీడీపీ), 47. ఎస్పీ సింగ్ భగెల్, 48. శోభా కరంద్లాజె, 49. కీర్తివర్ధన్ సింగ్, 50. బి.ఎల్.వర్మ, 51. శాంతను ఠాకూర్, 52. సురేశ్ గోపీ, 53. ఎల్.మురుగన్, 54. అజయ్ టంటా, 55. బండి సంజయ్ కుమార్, 56. కమలేశ్ పాస్వాన్, 57. భగీరథ్ చౌదరి, 58. సతీశ్‌చంద్ర దూబె, 59. సంజయ్ సేథ్, 60. రవ్‌నీత్‌సింగ్ బిట్టూ, 61. దుర్గాదాస్ ఉయికే, 62. రక్షా ఖడ్సే, 63. సుకాంత మజుందార్, 64. సావిత్రీ ఠాకూర్, 65. తోఖన్ సాహు, 66. రాజ్‌భూషణ్ చౌధరి, 67. భూపతిరాజు శ్రీనివాస వర్మ, 68. హర్ష్ మల్హోత్రా, 69. నిమూబెన్ బంభానియా, 70. మురళీధర్ మొహోల్, 71. జార్జి కురియన్, 72. పబిత్రా మార్గరీటా.

ఆర్ఎస్ఎస్ నుంచి అంచలంచెలుగా..

బీజేపీ స్థాపన నుంచీ పార్టీ వెంట నడిచిన కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వరుసగా రెండోసారి కేంద్ర మంత్రిగా అవకాశం దక్కించుకున్న సికింద్రాబాద్ ఎంపీ గంగాపురం కిషన్‌రెడ్డి.. సామాన్య కార్యకర్త నుంచి ఈ స్థాయికి ఎదిగారు. విద్యార్థి దశలోనే ఆర్ఎస్ఎస్‌లో పనిచేశారు. తర్వాత భారతీయ జన సంఘ్‌లో, జనతా పార్టీలో చేరారు. 1977లో యువ మోర్చా నాయకుడిగా పనిచేశారు. 1980లో బీజేపీ ఏర్పాటయ్యాక అందులో చేరారు. భారతీయ యువమోర్చా (బీజేవైఎం) రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా నియమితులయ్యారు. అంచెలంచెలుగా బీజేవైఎం జాతీయ అధ్యక్షుడిగా ఎదిగారు. ఆ సమయంలో ఉగ్రవాద నిర్మూలన కోసం రాజకీయేతర సంస్థ 'వరల్డ్ యూత్ కౌన్సిల్ అగైనెస్ట్ టెర్రరిజం'ను స్థాపించారు. తర్వాత రాష్ట్ర బీజేపీలో కార్యదర్శిగా, కోశాధికారిగా, ప్రధాన కార్యదర్శిగా, నాలుగు సార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా (రెండుసార్లు ఉమ్మడి ఏపీలో, రెండుసార్లు తెలంగాణలో) పనిచేశారు.

▶2004లో హిమాయత్‌నగర్ సెగ్మెంట్ నుంచి, 2009, 2014లలో అంబర్‌పేట నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. బీజేపీ శాసన సభాపక్ష నేతగా పనిచేశారు. ▶2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2019 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీగా గెలిచారు. మోదీ ప్రభుత్వంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా చాన్స్ దక్కించుకున్నారు. ▶రెండేళ్ల తర్వాత కేబినెట్ మంత్రిగా ప్రమోషన్ లభించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలతోపాటు ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల బాధ్యతలను నిర్వహించారు. సుదీర్ఘకాలం పార్టీలో కొనసాగడం, జాతీయ నాయకత్వంతో సన్నిహిత సంబంధాలు ఉండటం ఆయనకు కలసివచ్చింది.

పేరు	:	గంగాపురం కిషన్‌రెడ్డి
పుట్టినతేదీ	:	15-06-1960
తల్లిదండ్రులు	:	స్వామిరెడ్డి, ఆండాళమ్మ (రైతు కుటుంబం)
భార్య	:	కావ్యారెడ్డి
పిల్లలు	:	వైష్ణవి, తన్మయ్
కులం	:	రెడ్డి
పార్టీలో హోదా	:	బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ఆ ఘనత బీజేపీదే

సాక్షి, న్యూఢిల్లీ : సాధారణ కార్యకర్తలకు కేంద్ర మంతివర్గంలో చోటు కల్పించిన ఘనత భారతీయ జనతా పార్టీదే అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇలాంటి సంస్కృతి ఒక్క బీజేపీలో మినహా దేశంలోని ఏ పార్టీలోనూ లేదన్నారు. కేంద్ర మంత్రిగా ప్రమాణం చేసిన అనంతరం ఆయన సాక్షితో మాట్లాడారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రి, సహాయమంత్రి పదవులు ఇచ్చిన ప్రధాని మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. 'రెండోసారి కేంద్ర మంత్రి పదవి దక్కడంతో నా బాధ్యత మరింత పెరిగింది. ప్రధాని నాకు ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తా' అని చెప్పారు.

కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రిగా..

విద్యార్థి దశ నుంచే ఆర్ఎస్ఎస్‌తో బండి సంజయ్‌కు అనుబంధం

- 2019లో తొలిసారి ఎంపీగా గెలుపు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆకట్టుకునేలా పనితీరు
- తాజాగా కేంద్ర కేబినెట్‌లో అవకాశం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కేంద్ర మంత్రి అవకాశం వచ్చిన బండి సంజయ్ కూడా ఒక సాధారణ కార్యకర్త నుంచి అంచెలంచెలుగా ఎదిగినవారే. విద్యార్థి దశ నుంచే ఆర్ఎస్ఎస్‌లో పనిచేశారు. తర్వాత ఏబీవీపీలో పలు పదవుల్లో కొనసాగారు. కరీంనగర్ అర్బన్ సహకార బ్యాంక్ డైరెక్టర్‌గా పని చేశారు. బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ సురాజ్ రథ యాత్రలో వెహికల్ ఇన్‌చార్జిగా పనిచేశారు. కరీంనగర్‌లో 2005 నుంచి వరుసగా మూడుసార్లు కార్పొరేటర్‌గా గెలిచారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు సార్లు కరీంనగర్ ఎమ్మెల్యేగా పోటీ చేసినా.. ఓటమితో రెండోస్థానంలో నిలిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా సంచలన విజయం సాధించారు.

- 2020లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ నియమితులయ్యారు. ఈ సమయంలో పార్టీని పరుగులు పెట్టించారు. దుబ్బాక ఉప ఎన్నిక, జీహెచ్ఎంసీ ఎన్నికలు, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీని విజయపథాన నడిపించారు.
- ప్రజా సమస్యలపై పలుమార్లు సంజయ్ ఆందోళనలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఇంటర్ ఫలితాల వివాదం, 317 జీవో, టెన్త్ పేపర్ లీకేజీ వంటి అంశాలపై ఆందోళనలు చేశారు.
- పలు పరిణామాల నేపథ్యంలో 2023లో రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పుకొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, తర్వా త జాతీయ కిసాన్‌మోర్చా ఇన్‌చార్జిగా నియమితులయ్యారు.
- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ ఎమ్మెల్యేగా పోటీ చేసినా ఓటమి చవిచూశారు.
- తాజా లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా రెండోసారి విజయం సాధించారు. కేంద్ర మంత్రి పదవికి ఎంపికయ్యారు. దీంతో కరీంనగర్ బీజేపీ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి.

పేరు	: బండి సంజయ్‌కుమార్
పుట్టిన తేదీ	: 11-07-1971
తల్లిదండ్రులు	: కీ.శే.నర్సయ్య-శకుంతల
భార్య	: బండి అపర్ణ (బ్యాంకు ఉద్యోగి)
పిల్లలు	: సాయి భగీరథ్, సాయి సుముఖ్
కులం	: మున్నూరు కాపు (బీసీ-డి)
పార్టీలో హోదా	: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి



బండి సంజయ్ నివాసంలో ఆయన తల్లికి మిఠాయి తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

రాష్ట్ర ప్రగతి కోసం కృషి చేస్తా..

ఈరోజు చాలా ఆనందంగా ఉంది. నాపై నమ్మకముంచి కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించిన ప్రధాని మోదీకి, జాతీయ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈరోజు నాకు లభించిన పదవి కార్యకర్తల కృషి ఫలితమే. నాపై నమ్మకం ఉంచి కరీంనగర్ ప్రజలు రెండోసారి భారీ మెజారిటీతో గెలిపించడం వల్లే కేంద్రమంత్రిగా అవకాశం లభించింది. కేంద్ర మంత్రిగా వచ్చిన అవకాశాన్ని రాష్ట్ర ప్రగతి కోసం, కరీంనగర్ లోక్‌సభ స్థానం అభివృద్ధి కోసం వినియోగిస్తా. రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నా.

- బండి సంజయ్, కేంద్ర మంత్రి

నేటి భవితలో..

- టీఎస్ సెట్ 2024:
  ఆచార్యులు కావడానికి అర్హత పరీక్ష!
  తెలంగాణ యూనివర్సిటీలు, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, లెక్చరర్లుగా నియమితులయ్యే అభ్యర్థులకు అకడమిక్ నైపుణ్యాలతోపాటు, సంబంధిత సబ్జెక్టులపైనా లోతైన అవగాహన ఉండాలి. ఇలాంటి ప్రతిభ, నైపుణ్యాలను అంచనా వేయడానికి నిర్వహించే అర్హత పరీక్ష.. టీఎస్ సెట్ (తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష). ఇందులో సాధించిన స్కోరు ఆధారంగానే లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు చేపడతారు. ప్రస్తుతం 2024 సంవత్సరానికి టీఎస్ సెట్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ సెట్‌కు దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు..
- దీంతోపాటు గ్రూప్1, గ్రూప్ 2 ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ స్టడీ మెటీరియల్, విద్య, ఉద్యోగ సమాచారం.

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

క్లుప్తంగా...

రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పి లేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్‌గా నియమితులైన జస్టిస్ ఎ.రాజశే ఖరరెడ్డి (రిటైర్డ్) ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యులుగా పల్లె ప్రదీప్‌కుమార్‌రెడ్డి (అడ్వకేట్, జ్యుడీషియల్ మెంబర్), రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిత్రా రామ చంద్రన్ (టెక్నికల్/ అడ్మినిస్ట్రేటివ్ మెంబర్) బాధ్యతలు స్వీకరించారు. వీరిని ఆయా పదవుల్లో నియ మిస్తూ ఈనెల 7న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా 'రెరా' చైర్మన్ ఎన్. సత్యనారాయణ, సభ్యులు కె.శ్రీనివాసరావు, జె.లక్ష్మీనారాయణ, అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్, సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్, సభ్యులతో పాటు 'రెరా' అథారిటీ చైర్మన్, సభ్యులు సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో 'రెరా' అజ్యుడికేటింగ్ ఆఫీసర్ లతీఫ్-ఉర్-రెహమాన్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పరిపాలనాధికారి గంగాధర్ పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇచ్చేలా ప్రణాళికలు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్ (సూర్యాపేట): రాష్ట్రంలో రేషన్ షాపుల్లో పూర్తిస్థాయిలో సన్న బియ్యం ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులతో ఆది వారం హుజూర్‌నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతితో కలిసి సమీక్ష నిర్వ హించారు. అనంతరం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ... ఉమ్మడి ఏపీలో ఏర్పాటైన లిఫ్టుల్లో పని చేయని వాటిని పూర్తి సామర్థ్యంతో నడిచే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో కోట్ల రూపాయలతో లిఫ్టులు మంజూరు చేశారు కానీ వాటిని సరిగ్గా నిర్వహించలేదని ఆరోపించారు. అటువంటి వాటిని సరిగ్గా నిర్వహించేందుకు, మరమ్మతులు చేపట్టేందుకు ప్రతి మూడు నాలుగు లిఫ్టులకు కలిపి ఫిట్టర్ ఆపరే టర్‌తో పాటు ఎలక్ట్రీషియన్‌ను కూడా నియమించే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో నీటి సౌకర్యం ఉండి లిఫ్టులు లేని ప్రాంతాల్లో లిఫ్టులు మంజూరు చేయిస్తామని, అలాగే నూతన ఆయకట్టు సామర్థ్యాన్ని పెంచే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

బోనస్ అంతా బోగస్

పంట పెట్టుబడి ఇవ్వకుంటే బీఆర్ఎస్ పక్షాన పోరాటం: హరీశ్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

నంగునూరు (సిద్దిపేట): 'వానాకాలం ప్రారంభమైనా ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం అందించడం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్నచూపు చూస్తోంది. పంటకు బోనస్ అన్న మాటను బోగస్‌గా మార్చారు' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి లో రైతు నాగేంద్ర పొలంలో ఆయిల్‌పామ్ మొదటి పంటను కోసి క్రాప్ కటింగ్‌ను ప్రారంభించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ విత్తనాల కోసం రైతులు ఆందోళన చేసినా పట్టించుకోవడంలేదని, ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వరి పంట బోనస్ విషయంలో మంత్రులు తలో మాట మాట్లాడుతు న్నారని విమర్శించారు. పంట పెట్టుబడితోపాటు రైతు సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఆయిల్‌పామ్ దిగుబడిపై కేంద్ర ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీ తొలగించడంతో దిగుమతులు పెరిగి విదేశీ మారకం నష్టపోతున్నా మని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్‌పామ్ పంట సాగును ప్రోత్సహించడంతో ఖమ్మం తరువాత స్థానంలో నిలిచి ఆదర్శంగా నిలిచిందన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈటల?

▶ మొదటి పేజీ తరువాయి

సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించి, పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టాలని జాతీయ నాయకత్వం నిర్ణయానికి వచ్చినట్లు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. ఆదివారం తనకు సన్నిహితులైన అస్సాం సీఎం, అధిష్టానం దూత హిమంత బిశ్వతో ఈటల భేటీ అయిన సందర్భంగా జాతీయ నాయకత్వం ఆలోచనలు, ఇతర అంశాలపై స్పష్టత వచ్చినట్టు సమాచారం. అంతకుముందు అమిత్ షా కూడా ఈటలతో ఫోన్‌లో మాట్లాడి ఈ అంశాలను వివరించినట్టు తెలిసింది. తెలంగాణ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పుంజుకుందని.. పార్టీ శ్రేణులను పూర్తిస్థాయిలో సమాయత్తం చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని వారిద్దరు సూచించినట్టు సమాచారం.

కేంద్ర మంత్రి పదవి ఆశించినా..: ఈటల రాజేందర్ తొలుత కేంద్ర మంత్రి పదవి ఆశించారు. కానీ పార్టీ అగ్ర నాయకత్వం ఒప్పించడంతో రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టేందుకు ఆయన సిద్ధమైనట్టు పార్టీ నాయకులు చెప్తున్నారు. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయడంపై జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అంటున్నారు. దాదాపు ఇరవై ఏళ్లపాటు టీఆర్ఎస్‌లో, తెలంగాణ ఉద్యమ సమయంలో గుర్తింపుతోపాటు కేసీఆర్ కేబినెట్‌లో నంబర్ టూగా కొనసాగిన నేపథ్యంలో.. ఈటలకు ఉన్న విస్తృత పరిచయాలు, మంత్రిగా పనిచేసిన అనుభవం, సమర్థవంతమైన నాయకుడిగా ఉన్న ఇమేజీ పార్టీ పురోగతికి దోహదపడతాయని భావిస్తున్నట్టు చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈటలకున్న గుర్తింపు, వివిధ సామాజిక వర్గాలతో ముఖ్యంగా బీసీ వర్గాలు, సంఘాలతో మంచి సంబంధాలు ఉండటం కూడా బీజేపీ బలోపేతానికి ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు.

మూడో సారి ప్రధానిగా ఎంపికైన మోదీకి అభినందనలు

బీసీ బిల్లు పెట్టాలి: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): మూడోసారి ప్రధా నిగా ఎంపికైన బీసీ నేత నరేంద్రమోదీకి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రధాని నరేంద్రమోదీకి ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. ఇప్పటికైనా బీసీల ఆగ్రహాన్ని గుర్తించి బీసీ బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు.

యాసంగిలో 47.07 ఎల్ఎంటీ ధాన్యం సేకరణ

- 8.35 లక్షల మంది రైతులకు రూ.10,355 కోట్ల చెల్లింపులు
- దాదాపుగా ముగిసిన యాసంగి కొనుగోళ్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ దాదాపుగా ముగిసింది. మార్చి 25 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాగా ఏప్రిల్, మే నెలల్లో పెద్ద ఎత్తున కొనుగోళ్లు సాగాయి. ఇప్పటి వరకు 6,345 కొనుగోలు కేంద్రాల ద్వారా 47.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. 8.35 లక్షల మంది రైతులు ధాన్యాన్ని విక్రయించగా, ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రూ.10,355.18 కోట్లు జమచేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం కొత్త రికార్డు నెలకొల్పిందని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించిందని పౌరసరఫరాల శాఖ తెలిపింది. చాలా జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసివేయగా, ఆలస్యంగా కోతలు జరిగిన కొన్ని జిల్లాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాలను ఈ నెలాఖరు వరకు కొనసాగించాలని అధికారులు ఆదేశించారు.

75.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ అంచనా..

యాసంగిలో వరి పంట సాగు విస్తీర్ణాన్ని బట్టి ఈసారి 75.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించే అవకాశం ఉందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. కానీ మార్కెట్లో సన్న ధాన్యానికి మద్దతు ధర కంటే ఎక్కువ రేటు రావటం, మిల్లర్లు, వ్యాపారులు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయటంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తగ్గింది. చాలా జిల్లాల్లో కోతలకు వచ్చే సమయంలో అకాల వర్షాలు కురవడంతో రైతులు పంటను పొలాల నుంచే నేరుగా మిల్లర్లకు తక్కువ ధరకే అమ్ముకున్నారు. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తగ్గిందని చెపుతున్నారు. ఈ సారి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, సిరిసిల్ల, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, నిర్మల్, మంచిర్యాల, జనగామ జిల్లాలు ముందంజలో ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ తెలిపింది.

ఇదేనా ప్రజాస్వామ్యం!?

▶ మొదటి పేజీ తరువాయి

ఇంటిపై దాడి చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే టీడీపీ వర్గీయుల దాష్టీకాలు ఊరూరా కనిపిస్తున్నాయి. సభ్య సమాజం ఏమనుకుంటుందనే విచక్షణ మరచి బరితెగింపుతో వ్యవహరిస్తున్నారు. మహిళలని కూడా చూడకుండా ఇళ్లలోకి చొరబడి కొడుతున్నారు. ఎక్కడో సినిమాల్లో కనిపించే ఇలాంటి దృశ్యాలు ఐదు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో నిజ జీవితంలోనూ చోటుచేసుకోవడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం చోద్యం చూస్తుండటం దారుణం, దుర్మార్గం. పైగా కొన్ని చోట్ల వారే టీడీపీ కార్యకర్తలుగా మారి పూనకం వచ్చినట్లు ఊగిపోతుండటం గమనార్హం. ఏ తప్పూ చేయకపోయినా పల్నాడు జిల్లాలో ఊరు విడిచి వెళ్లాలని ఒక ఉప సర్పంచ్‌ను ఓ సీఐ తీవ్రంగా హెచ్చరించడం, బాధితుడు ఒత్తిడి తాళలేక ఆత్మహత్య చేసుకోవడం అరాచకానికి పరాకాష్ట. పరిస్థితి చూస్తుంటే రాష్ట్రం రావణ కాష్టం అవ్వాలన్నదే బాబు, లోకేశ్‌ల అభిమతం అనిపిస్తోంది.

చితకబాది.. కాళ్లు పట్టించి..

- వైఎస్సార్‌సీపీ కార్యకర్త పట్ల అమానుషం
- లోకేశ్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై కూర్చోబెట్టి సారీ చెప్పించిన వైనం
- మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ నేత దాష్టీకం
- వీడియో వైరల్.. స్పందించని పోలీసులు

సాక్షి, అమరావతి : మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పెదవడ్లపూడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పట్ల టీడీపీ నాయకులు దాడి చేసి అమానవీయంగా ప్రవర్తించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణవేణి భర్త రాజ్‌కుమార్‌ను గ్రామానికి టీడీపీ నాయకుడు జవ్వాది కిరణ్‌చంద్ ఆదివారం తన అనుచరుల ద్వారా ఊరి మధ్యకు రప్పించాడు. అందరూ చూస్తుండగా దారుణంగా దాడి చేశారు. ఒంటిపై దుస్తులు విప్పి మరీ చితకబాదారు. అనంతరం టీడీపీ కార్యకర్తలు లోకేశ్ ఫొటో ఉన్న ఫ్లెక్సీ చేత్తో పట్టుకోగా, విలపిస్తున్న రాజ్‌కుమార్‌ను దాని ఎదురుగా మోకాళ్లపై కూర్చోబెట్టారు. 'నన్ను క్షమించండి.. చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్, ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు చేశాను. ఇక ఎప్పుడూ అలా చేయను' అని చెప్పించారు. అనంతరం రాజ్‌కుమార్.. తనను మన్నించమని టీడీపీ నేత కిరణ్‌చంద్ కాళ్లు పట్టుకున్నాడు. ఫ్లెక్సీలో లోకేశ్ కాళ్లు కూడా పట్టుకోమని టీడీపీ నేత ఆదేశించాడు. బాధితుడు వారు చెప్పినట్లే చేశాడు. తన కుటుంబాన్ని క్షమించాలని పదే పదే విజ్ఞప్తి చేశాడు. ఈ వీడియో పెద్ద ఎత్తున వైరల్ అయినప్పటికీ పోలీసుల నుంచి ఎలాంటి చర్యలూ లేకపోవడం గమనార్హం.

ఏపీలో టీడీపీ దమనకాండ
వివరాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కౌశిక్‌రెడ్డికి ప్రజలే గుణపాఠం చెప్తారు

పొన్నంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు: జాజుల లింగంగౌడ్



సాక్షి, హైదరాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన హుజూరాబాద్ ఎమ్మె ల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ప్రజలే తగిన గుణపాఠం చెబు తారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు. పొన్నం రూ.వంద కోట్ల అవినీతి చేశారంటూ కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆదివారం లింగంగౌడ్ అంబర్‌పేటలోని బీసీ సంక్షేమ సంఘం కార్యా లయంలో కౌశిక్‌రెడ్డి ఫోటోను చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ఎలాంటి రుజువులు లేకుండా ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. గత మూడు దశాబ్దాలుగా విద్యార్థి దశ నుంచి మచ్చ లేకుండా ఎదిగిన బీసీ బిడ్డపై అసత్య ఆరోపణలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆరోపణలు చేస్తే కౌశిక్‌రెడ్డిపై రాళ్ల దాడి తప్పదని హెచ్చరించారు.


ఆదివారం ఢిల్లీలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసిన ఎంపీలు రఘునందన్‌రావు, గోడం నగేశ్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వరరెడ్డి, డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్, ధనపాల్ సత్యనారాయణ గుప్తా, పాటిల్ నారాయణరావు.



మొదటి సూత్రం ఏమిటంటే, మిమ్మల్ని మీరు అసలు మోసం చేసుకోవద్దు; మిమ్మల్ని మీరు మోసం చేసుకోవడం అత్యంత సులువు.

– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 10 జూన్ 2024

అత్యున్నత ఐదువేలు

దాదాపు నూట నలభై కోట్ల మంది భారతీయుల్లో ఒక పదకొండు వేల మంది తలా వంద రూపాయలు ఇస్తే ఎంతవుతుంది? పోనీ నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల నుంచి, ఐదు కోట్ల మంది ఆంధ్ర ప్రజల నుంచి కలిపి వేయిమంది తలా వంద రూపాయలు ఇస్తే ఎంతవుతుంది? లెక్క తరువాత మాట్లాడుదాం.

'సినిమా రంగంలో రచయితకు అత్యంత తక్కువగా డబ్బు ఇవ్వాలని నిర్మాతకు ఎందుకనిపిస్తుందంటే అతను ఖాళీ చేతులతో వస్తాడు కనుక' అని రచయిత సోదా అంటాడు. నిజమే. మేకప్ వేసేవాడు పెద్ద కిట్ తెస్తాడు. విగ్గులకు డబ్బు అడుగుతాడు. కాస్ట్యూమ్ డిజైనర్ బోలెడన్ని బట్టలు కొనాలి కనుక బిల్లు ఎక్కువ. సినిమాటోగ్రాఫర్ కెమెరాలు, లెన్సులు, క్రేన్లు, భారీ పరికరాలు... ఇన్ని వాడుతున్నాడంటే అతనికి ఎంతిచ్చినా తక్కువే. కళా దర్శకుడు వేసే సెట్ కనిపిస్తుంది. మ్యూజిక్ డైరెక్టర్ దగ్గర వాద్యాల బృందం కనిపిస్తుంది. మరి రచయిత దగ్గరో? ఒక తెల్లకాగితం, పెన్ను. ఐదు రూపాయల పెన్ను జేబులో పెట్టుకుని వచ్చేవాడికి, కాగితం మీద అప్పటికప్పుడు రాసిచ్చి వెళ్లేవాడికి డబ్బు ఇవ్వడం అవసరమా అని నిర్మాతకేం ఖర్మ, ఎవరికైనా అనిపిస్తుంది. చిత్రమేమిటంటే సినిమా 'సీన్ పేపర్' నుంచే మొదలవుతుంది. దానిని రచయితే రాయాలి.

తన దగ్గరకు వచ్చిన ఆసామీకి టీ ఇచ్చి, అతను తాగి కప్పు దించే లోపలే పాట రాసి ఇచ్చాడట ఆత్రేయ. 'ఐదు నిమిషాల్లో రాశారు. దీనికింత డబ్బు ఇవ్వడం అవసరమా' అన్నాడట ఆసామీ లాల్చీ జేబులో చేయి పెట్టి నసుగుతూ. ఆత్రేయ మొహమాటపడక డబ్బు అందుకుని 'ఈ ఐదు నిమిషాల వెనుక ముప్పై ఏళ్ల తపస్సు ఉంది నాయనా' అన్నాడట. రచయిత చేతికి పని చెప్పే మెదడు ఉందే, అది రాతకు తయారుగా ఉందే, ఆ మెదడు అలా తయారు కావడానికి రచయిత ఏమేమి చేసి ఉంటాడు? ఎన్ని రాత్రులను పుస్తకాలు చదువుతూ తగలెట్టి ఉంటాడు? ఎన్ని తావుల్లో తిరుగుతూ మనుషుల్లో పాత్రలను వెతుకుతూ వారి చెమట, కన్నీరు, రక్తపు చారికలు పూసుకుని ఉంటాడు? వారి సద్బుద్ధుల చందనంలో, దుర్బుద్ధుల దుర్గంధంలో వారే తానై బతికి ఉంటాడు? ఆ రాత్రి ఉదయించిన సంపూర్ణ చంద్రుడి రంగును సరైన మాటల్లో వర్ణించడానికి ఎన్ని గుప్పుల పొగను తాగి ఊపిరిని నలుపు చేసుకుని ఉంటాడు? ఒక గొప్ప వాక్యం కోసం ఎన్ని వందల కాగితాలను చించి ఉంటాడు? ఒక కావ్యజన్మ కోసం ఎన్ని ఊహా పరిష్వంగాలలో పదేపదే సొమ్మసిల్లి ఉంటాడు?

లాల్చీ, పైజామా, జేబులో పెన్నుతో అతడు ఎదురు పడినప్పుడు– అవశ్యం– అతని మేధాశ్రమ ఏదీ కనిపించదు. కనుక కలం పట్టి అతను రాసే రాతకు అత్యల్ప రుసుము ఇవ్వవచ్చనే ఆనవాయితీ ఎవరైనా పాటించవచ్చు. కథకు, కవితకు 500 రూపాయల పారితోషికం ఇవ్వొచ్చు. ఇవ్వక ఎగ్గొట్ట వచ్చు. పదుగురిని అడిగో, పి.ఎఫ్ బద్దలు కొట్టో పుస్తకం వేస్తే అమ్మిన ప్రతుల సొమ్ము అమ్మకందారు ఇవ్వొచ్చు. ఇవ్వక పోవచ్చు. పబ్లిషర్లు ఎవరైనా ఉంటే వారు రాయల్టీ ఇవ్వొచ్చు. ఇవ్వకపోనూవచ్చు. ఒకసారి రచయిత పుస్తకం వేశాక వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ తదితరాలలో ఉండే సాహితీ సూక్ష్మక్రిములు అది తమ సొంతంగా భావించి వందలాది పి.డి.ఎఫ్‌లు పంచొచ్చు... పుస్తకం కొనకనే చదువుకోవచ్చు.

ఇవన్నీ ఇలాగుంటే తెలుగునాట సాహితీకారులను ప్రోత్సహించడానికి 'ఐదు వేలు' అనే అచ్చొచ్చిన నంబర్ ఒకటి ఉంది. పాతిక, ముప్పై ఏళ్ల క్రితం మొదలైన 'ఐదు వేల రూపాయల' అవార్డు/బహుమతి తెలుగు సాహితీజాతికి లక్ష్మణరేఖ. నేటికీ, 2024లో కూడా, 'చార్జీలతో కలిపి 5000 రూపాయల' అవార్డు ప్రకటిస్తే అదే పదివేలనుకుని భార్యాపిల్లలను వెంటబెట్టుకువెళ్లే దుస్థితి తెలుగు రచయితది. తెలుగు నేలన ఎక్కడ పట్టినా నేటికీ 'మొదటి బహుమతి 5 వేలు, రెండవ బహుమతి 3 వేలు, మూడవ బహుమతి వేయి రూపాయల' దిక్కుమాలిన కథాపోటీలు. వాటికి రాసే సీనియర్ రచయితలు! సాహితీ అకాడెమీ పురస్కార గ్రహీతలు! వెయ్యి రూపాయల లిస్టులో వీరి పేర్లు! రూపాయి ఊసెత్తక తలపాగా, ముఖం తుడవను పనికిరాని శాలువాతో ఇచ్చే అవార్డులు కొల్ల. వీటికి తోడు 116 డాలర్లు మొహానకొట్టే ఎన్.ఆర్.ఐ వితరణశీలత ఏమని చెప్పుట?

ఇంటికి చెద పట్టిందని ఫోన్ చేస్తే ఐదు వేలకు తక్కువగా ఎవరూ రావడం లేదు. గంట కార్పెంటర్ పని చేస్తే రెండు వేలు నిలబెట్టి వసూలు చేస్తాడు. ప్లంబర్ వచ్చి వాష్‌బేసిన్ వైపు చూడాలంటే కనీస వెల వెయ్యి. కాని తెలుగు రచయిత మాత్రం తన దశాబ్దాల తపస్సుకు 'బాబూ... ఒక్క ఐదు వేలు' అంటున్నాడు. తెలుగు సాహితీవరణంలో నిషేధించాల్సిన ఒకే ఒక నంబర్– ఐదు వేలు!

140 కోట్ల భారతీయులలో పదకొండు వేల మంది వంద రూపాయలు ఇస్తే పదకొండు లక్షలు అవుతాయి. అది మన జ్ఞానపీఠ్ అవార్డు నగదు బహుమతి! 9 కోట్ల తెలుగువారిలో వెయ్యి మంది వంద రూపాయలు ఇస్తే లక్ష అవుతుంది. అది సాహిత్య అకాడెమీ నగదు బహుమతి. జీవితంలో ఒకసారి పొందే వీటి నగదులే ఇలా ఉంటే ఐదు వేల అవార్డుకు వంకలేల అంటారా? ఆ అత్యున్నత అంకెతో అత్యల్పంగా బతికేద్దాం!

పాత మోదీపై 'కొత్త మోదీ' నెగ్గగలరా?

కామెంట్



కరణ్ థాపర్

నరేంద్ర మోదీ నిస్సందేహంగా తిరిగి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆయన ఊహించిన దానికి భిన్నమైన నాటకీయ పరిస్థితుల్లో ఆ రావటం అన్నది జరిగింది. కీలకమైన ప్రశ్న ఏమిటంటే – ప్రధాన మంత్రిగా ఇప్పుడు ఎదుర్కొంటున్న పూర్తి భిన్నమైన పరిస్థితులను మోదీ స్వాభావికంగా, మానసికంగా ఎలా సర్దుబాటు చేసుకోగలరన్నదే! సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపేందుకు మిత్రపక్షాలను దగ్గర చేసుకోవటం, తరచూ వారికి లోబడి ఉండటం, నిరంతరం వారిని సంతుష్టులుగా ఉంచటం వంటి వాటికి ఆయన సంసిద్ధతను కలిగి ఉంటారా? గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, భారత ప్రధానిగా 10 సంవత్సరాలు ఆయనకు ఇలా చేసే అవసరం లేకపోయింది. అందుకు భిన్నంగా పాత మోదీ ఇప్పుడు కొత్త మోదీ కాగలరా?

మునుపు మీరీ నానుడిని నిస్సందేహంగా విని ఉంటారు. ఎంచేతనంటే ఇదొక కాదన లేని సత్యం. కొరుకుడు పడనివిగా కనిపించే పరిస్థితులను ఓటర్ల సమష్టి విజ్ఞత చక్కబెట్టగలగటమే ప్రజాస్వామ్యంలోని అద్భుతమైన విషయం. 1977లో ఇలా జరిగింది. మళ్లీ ఈ జూన్ 4న ఇది సంభవించింది. ఫలితాల్లో పై విధమైన అద్భుతాన్ని చాలామందే ఆశించినప్పటికీ, నిజానికి కొద్దిమందే అది కార్యరూపం దాల్చుతుందని భావించారు.

నరేంద్ర మోదీ నిస్సందేహంగా తిరిగి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆయన ఊహించిన దానికి భిన్నమైన నాటకీయ పరిస్థితుల్లో ఆ రావటం అన్నది జరిగింది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత దారుణమైన ఫలితాలను ఈ ఎన్నికల్లో బీజేపీ చవి చూసింది. మెజారిటీకి 30కి పైగా తక్కువ సీట్లు వచ్చాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి, విశ్వసనీయత ఎల్లప్పుడూ ప్రశ్నార్థకమైన మిత్ర పక్షాల మద్దతు అవసరం. గతంలో వారు బీజేపీని విడిచి పెట్టిన సందర్భాలు ఉన్నాయి. వారు మళ్లీ అలా చేస్తారనటాన్ని తోసిపుచ్చలేము.

ఇది ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి పాలనపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇప్పటికైతే వాటికి మన దగ్గర సమాధానాలు లేవు. బహుశా మోదీకి కూడా అవి తెలియక పోవటానికే అవకాశం ఎక్కువ. కానీ ఆ ప్రశ్నలు ఆయన ఎదుర్కొనే సవాలును సూచిస్తాయి. ఆ ప్రశ్నల సమాధానాలు ఆయన గురించి ఎన్నో విషయాలు వెల్లడిస్తాయి. భారతదేశానికి ఎదురవనున్న ప్రమాదాలను, లేదంటే కనీసం సమస్యలను అవి బయటపెడతాయి.

బీజేపీ 370 సీట్లు గెలుచుకుంటుందని మోదీ మొదటి నుంచి జోస్యం చెబుతూ వచ్చారు. ఐదో విడత పోలింగ్ అయ్యాక 'ఎకనమిక్ టైమ్స్'తో మాట్లాడుతూ తమ పార్టీ అప్పటికే 272 మార్కును దాటేసిందని అన్నారు. కానీ, చివరికి అది 240 సీట్లతోనే ముగిసింది. మెజారిటీకి చాలా తక్కువ. కనుక, ఇవాళ ఆయన... కలవరపడే మనిషా లేక దులిపేసుకుని వెళ్లగలిగినంత మొద్దు చర్మం ఉన్నవారా?

వారణాసిలో ఆయనకు వచ్చిన ఓట్ల మాటేమిటి? 2019లో ఆయనకు 4 లక్షల 80 వేల మెజారిటీ వచ్చింది. అదిప్పుడు కేవలం లక్షా ఐదు వేలకు పరిమితం అయింది. ''గంగా మేరీ మా హై, ముఝే గంగా నే గోద్ లియా హై'' (గంగానది నా మాతృమూర్తి. గంగమ్మ తల్లి నన్ను దత్తత తీసుకుంది) అని గత నెలలో చెప్పుకున్న ఒక మనిషి.. పూర్తి వ్యక్తిగతమైన ఈ తిరోగమనాన్ని ఎలా తీసుకుంటారు?



2019 నాటి ఒక బహిరంగ ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ

ఏదేమైనా కీలకమైన ప్రశ్న ఏమిటంటే – ప్రధాన మంత్రిగా ఇప్పుడు ఎదుర్కొంటున్న పూర్తి భిన్నమైన పరిస్థితులను మోదీ స్వాభావికంగా, మానసికంగా ఎలా సర్దుబాటు చేసుకోగలరు? లేదా, సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపేందుకు మిత్రపక్షాలను దగ్గర చేసుకోవటం, తరచూ వారికి లోబడి ఉండటం, నిరంతరం వారిని సంతుష్టులుగా ఉంచటం వంటి వాటికి ఆయన సంసిద్ధంగా కలిగి ఉన్నారా?

గుర్తు చేసుకోండి. గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, భారత ప్రధానిగా 10 సంవత్సరాలు ఆయనకు ఇలా చేసే అవసరం లేకపోయింది. బదులుగా ఆయన అభీష్టం ప్రతి ఒక్కరికీ ఆదేశం అయింది. ఆయన కేంద్రీకృత ప్రభుత్వాన్ని నడిపారు. ప్రధాని కార్యాలయం కోరినట్లే మంత్రులు నడుచుకున్నారు. ఒక్కరు కూడా ఇదేమిటి అని అడిగే సాహసం చేయలేదు.

పార్లమెంటు, జ్యుడీషియరీ, మీడియా వంటి స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థల పట్ల ఆయన వైఖరి గురించి ఏమిటి? శ్రీ 'పాత మోదీ' పార్లమెంటును పలుమార్లు విస్మరించారు. న్యాయశాఖలోని నియామకాలను నిలిపివేశారు. మీడియాను తీసిపడేశారు. కానీ ఇప్పుడు శ్రీ 'బలహీన మోదీ' మరింతగా ఏకాభిప్రాయ విధానాన్ని అవలంబించవలసిన అవసరం ఉంటుంది. లేదంటే తన మిత్రపక్షాలకు ఆయన కోపం తెప్పించవచ్చు. తన సంకీర్ణాన్ని ప్రమాదంలోకి నెట్టేసుకోవచ్చు. అలా చేయటానికి ఆయన సిద్ధంగా ఉంటారా?

ఇక విమర్శలకు, అసమ్మతికి ఆయన స్పందించే ధోరణి ఒకటి ఉంటుంది. శ్రీ పాత మోదీకి ఆ రెండూ నచ్చవన్నది రహస్యమేం కాదు. కనుక శ్రీ కొత్త మోదీ సహించటాన్ని, సమ్మతించటాన్ని మాత్రమే కాదు... రెండింటితో కలిసి ముందుకు సాగటాన్ని కూడా నేర్చుకోవాలి. అది అంత సులభమేనా?

మరికొన్ని ప్రశ్నలు కూడా ఉన్నాయి. వాటిలో కొన్ని ఇటీవల ఆయన చేసిన ప్రకటనలకు సంబంధించినవి. వాటిని ప్రజలు మరిచిపోయి ఉంటారని ఆయన అనుకోవచ్చు. ప్రస్తుతం నెలకొని ఉన్న రాజకీయ వాతావరణంలో కాకపోవచ్చు కానీ, మొత్తానికైతే నేననుకోవటం అవి గుర్తుండే ఉంటాయని!

మొదటిగా, ఎన్నికల ప్రచారంలో ఆయన చెప్పిన కొన్ని విషయాలు ఉన్నాయి. ఆయన కనుక నవ్వటాన్ని, తేలిగ్గా తీసుకోవటాన్ని అలవరచుకోకపోతే అవి ఆయన్ని వెంటాడగలిగినవి. కానీ ఆయన అలా చేయగలరా? తనది దైవాంశ జననం అని ఆయన చెప్పుకోవడంపై అవహేళనలు ఎదురైతే ఆయన నవ్వుతూ, వాటిని పట్టించుకోకుండా ఉండగలరా? నా మాట గుర్తుపెట్టుకోండి. అవహేళనలు ఉంటాయి. అది జరిగినప్పుడు ఆయన కోపం తెచ్చుకుంటారా?

మరీ ముఖ్యంగా, ముస్లింలను దయ్యాలుగా చూపించకుండా ఉండలేకపోవటాన్ని నిలువరించుకోగలరా? ముస్లింలను చొరబాటుదారులుగా; ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నుంచి రిజర్వేషన్‌లను లాక్కుని లబ్ధి పొందేవారిగా చూపే తదుపరి సందర్భాలలో మిత్రపక్షాలు అందుకు అంగీకరించే అవకాశం లేదు. కానీ అలాంటి భాష తన నుంచి స్వభావసిద్ధంగా బయటికి రాకుండా తనను తాను సంబాళించుకోగలరా? ఇది 2001 నుండి ఆయన వాక్చాతుర్యంలోని ఒక భాగమని గుర్తుంచుకోండి.

నిజానికి నేను లేవనెత్తిన ప్రతిదాన్నీ ఒకే ఒక సాధారణ ప్రశ్నగా కుదించవచ్చు: శ్రీ పాత మోదీ ఇప్పుడు శ్రీ కొత్త మోదీ కాగలరా? ఆయన ప్రభుత్వం దాని పైనే ఆధారపడి ఉంటుంది. మన పాలన దానిపైనే ఆధారపడి ఉంటుంది. ఆయన రాజకీయ భవిష్యత్తు కూడా! కానీ ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటి?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సమస్య అదేనా?



దాదాపుగా అన్ని ఎగ్జిట్ పోల్స్ (బీజేపీకి) ఒకే సంఖ్యలో స్థానాల్నీ, ఓటు శాతాన్నీ ఎందుకు అంచనా వేశాయి? అన్నీ ఆమడ దూరంలో తప్పిపోయాయి. అవన్నీ ఒకే ఉమ్మడి మూలం నుంచి ఉచితంగా ముడి సమాచారాన్ని పొందాయా?

– ప్రభు చావ్లా, జర్నలిస్ట్

జాగ్రత్త



జిల్లా కోర్టు నుంచి సమన్లు వచ్చాయి. వివరాల కోసం 9 నొక్కమని గనక ఫోన్ వస్తే దాన్ని పట్టించుకోవద్దు. ఒకవేళ మీరు 9 నొక్కితే, సమన్లు డౌన్‌లోడ్ చేసుకొమ్మని వాళ్లొక లింక్ పంపుతారు. దాన్ని క్లిక్ చేయొద్దు. అది మాల్‌వేర్ (వైరస్) ఫైల్.

– అన్షుల్ సక్సేనా, న్యూస్ జంకీ

పేద అమెరికన్లు



ఇంటి అద్దె చెల్లించడం కోసం భోజనాలు మానేస్తుంటామని 39 శాతం మంది అమెరికన్లు నివేదించారు. అద్దె చెల్లించడం కోసం లక్షలాది మంది తమ 'బ్లడ్ ప్లాస్మా'(రక్తంలోని జీవ ద్రవ్యం) అమ్ముతుంటారు. చాలామందికి నెలజీతం పడితే తప్ప పొద్దు గడవడం లేదు. ఆరోగ్య సంరక్షణ లేక ఏటా 68,000 మంది అమెరికన్లు చనిపోతున్నారు. దీనిమీద మాట్లాడాలి. చర్యలు తీసుకోవాలి.

– మేరియాన్ విలియమ్‌సన్, అమెరికా నేత


ఆడాల్సిన ఆట



కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని చైనా గుర్తించదు. 38 వేల చదరపు కిలోమీటర్ల మేర కశ్మీర్‌ను చైనా లాక్కొంది. పైగా కశ్మీర్ మీద పాకిస్తాన్‌కు మద్దతిస్తుంది. అయినా చైనాతో బంధం పెట్టుకున్న మనం తైవాన్‌తో దౌత్య సంబంధాలు పెట్టుకోవడం లేదు. తైవాన్‌ను ఒక దేశంగానైనా ఇండియా గుర్తించడం లేదు. సరిచేసుకోవడానికి ఇదే సమయం.

– ఆనంద్ రంగనాథన్, రచయిత

అందరం సమానం



ఒక ఎంపీగా నేను ఎప్పుడూ క్యూలో నిల్చుని, సాధారణ సెక్యూరిటీ చెక్‌కు వెళ్తాను. ఇతర పౌరుల కంటే తాము అధికులమని ఎంపీలు ఎందుకు భావిస్తారు? మన భారతీయులం ఈ భూస్వామ్య వలసవాద ధోరణి నుంచి బయటపడాలి. ఎన్నిక కాగానే వాళ్లు ప్రత్యేక మర్యాదలు కోరుకుంటారు. ప్రజాసేవకులుగా వినయంగా ఉండటం నేర్చుకోవాలి.

– షాహిద్ సిద్దిఖీ, మాజీ రాజ్యసభ ఎంపీ

ఆగని లయ



మీలో ఆరోగ్యకరమైన జీవ గడియారపు లయ కొనసాగుతోందని చెప్పడానికి ఒక సంకేతం – వారాంతాల్లో కూడా త్వరగా మేలుకోవడం!

– జాన్ కాన్‌స్టాస్, హెల్త్ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

ఆ విజయానికి అయిదు శతాబ్దాలు

దక్షిణ భారత చరిత్రలో స్వర్ణయుగం విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయల కాలం. అప్పట్లో కళింగరాజ్యం అత్యంత బలమైనది. దీన్ని గజపతులు పాలిస్తూ ఉండేవారు. వారి రాజ్యం ఒరిస్సా నుంచి ప్రస్తుత నెల్లూరు జిల్లా ఉదయగిరి వరకూ విస్తరించి ఉండేది. ఉదయగిరి విజయనగర రాజ్య సరిహద్దుల్లో ఉండి రాజ్య ముఖద్వారంగా ఉండేది. ప్రతాపరుద్ర గజపతి కళింగాధిపతి. అతడు రాహుత్త రాయలను ఉదయగిరి కోట రక్షకునిగా నియమించాడు. ఉదయగిరిపై కొండవీటి రెడ్డిరాజులు, మహమ్మదీయ రాజులూ ఒక కన్నేసి ఉంచారు. కానీ బలమైన గజపతులతో తలపడలేక అదను కోసం ఎదురు చూశారు. ఇదే సమయంలో విజయనగర పాలకుడు శ్రీకృష్ణ దేవరాయలు ఉదయగిరిని ఎలాగైనా జయించాలని క్రీ. శ. 1513లో బయలుదేరాడు. గుత్తి, గండికోట మీదుగా తన సేనతో ఉదయగిరి రాజ్యంలో ప్రవేశించాడు. ఉదయగిరిలో ఘోర యుద్ధం జరిగింది.

దుర్గ రక్షకుడు రాహుత్త రాయలకు అండగా ప్రతాపరుద్ర గజపతి తన సైనికులను పంపి కృష్ణరాయలను ఎదుర్కొన్నాడు. రాయలు తన చతురంగ బలగాలను ఎంతో చాకచక్యంగా నడిపినా దుర్గం వశం కాకపోవడంతో అసహనంతో ఊగిపోయాడు. చివరికి ఒక రోజు సైనికులకు ఉత్తేజాన్ని కలిగిస్తూ... దుర్గాధిపతి తలను రేపటి కల్లా కాలితో తంతానని శపథం చేశాడు.

యుద్ధాన్ని ఉధృతపర్చి సైనికులను ఉత్సాహపరిచాడు. తాను స్వయంగా యుద్ధరంగంలో దూకి సైనికులను కోట గోడల మీదికి ఎగబాకించాడు. దీనితో గజపతి సైనికులు హాహాకారాలు చేస్తూ శరణు వేడారు. అలా అతి కష్టం మీద దుర్గాన్ని రాయలు చేజిక్కించుకొన్నాడు. శరణు కోరిన అందరినీ రక్షించాడు.

దుర్గాధిపతి రాహుత్త రాయలు తన స్వర్ణ కిరీటాన్ని బంగారు పళ్లెరంలో పెట్టి శ్రీకృష్ణదేవరాయలకు సమర్పించాడు. అన్నట్లుగానే రాయలు దాన్ని కాలితో తన్ని తన పంతం నెగ్గించుకున్నాడు. రాహుత్త రాయలను బంధించాడు. 1514 జూన్ 9న సాధించిన ఈ విజయాన్ని రాయలు తన 'ఆముక్తమాల్యద'లో చెప్పుకున్నాడు. చారిత్రక దృష్టి గల నంది తిమ్మన తన 'పారిజాతాపహరణం' లోనూ, అల్లసాని పెద్దన 'మనుచరిత్ర'లోనూ ఉదయగిరి ముట్టడిని అభివర్ణించారు. పాశ్చాత్య చరిత్రకారులు కృష్ణరాయల ఉదయగిరి ముట్టడి 18 నెలలు సాగిందని పేర్కొన్నారు.

ఉదయగిరి విజయంతో రాయలు పూర్వ విజయనగర సామ్రాజ్యాన్ని పునరుద్ధరించినట్లయింది. ఉదయగిరి విజయం శ్రీ వెంకటేశ్వస్వామి దయ వల్లనే లభించిందని నమ్మిన రాయలు ఇక్కడి నుండి నేరుగా తిరుమలకు బయలుదేరాడు. క్రీ.శ. 1514 జూలై 6న స్వామి వారిని దర్శించుకున్నాడు. 30 వేల వరహాలతో స్వామి వారికి కనకాభిషేకం చేయించాడు. విలువైన ఆభరణాలు సమర్పించాడు. తాళ్ళపాక గ్రామాన్ని రాయలు స్వామి వారి పేరిట ధర్మంగా ఇచ్చాడు. విజయనగర సామ్రాజ్య చరిత్రలో ఉదయగిరి దుర్గాన్ని సాధించటం అత్యంత ప్రతిష్ఠాత్మక విజయంగా భావిస్తారు.

– ఈతకోట సుబ్బారావు । 94405 29785

(శ్రీకృష్ణ దేవరాయలు ఉదయగిరి రాజ్యాన్ని జయించి 510 ఏళ్లు)

పారిభాషిక పదాలు సృష్టించుకోవాలి!

అభిప్రాయం



వాగుమూడి లక్ష్మీ రాఘవరావు

ఖగోళ శాస్త్రం వంటివాటిల్లో పరిశోధనలు చేస్తూనే బ్రహ్మ గుప్తుడు లాంటి భారతీయ గణిత మేధావులు ప్రపంచానికి సున్నా (0) ను అందించారు. సున్నా (0) విలువ కూడా భారతీయ గణిత వేదవేదాంగ సాహిత్యవేత్తే కనిపెట్టాడు. అయితే అది ఇంకా వెలుగులోకి రాలేదు. దీనికి కారణం గణితం, భౌతిక, రసాయనిక జీవ శాస్త్రాదులను బాగా కప్పివేసిన ఆధ్యాత్మిక, జ్యోతిష్య సంబంధ భావజాలం. ఆ ముసుగును తీసి భారతీయ గణిత, భౌతిక, రసాయనిక, జీవ శాస్త్రాదుల తేజాన్ని ప్రయోగశాలలో చూపించాలన్న ఆసక్తితో ముందుకు వెళ్ళేవారికి ఇక్కడ సరైన ఆదరణ లభించడం లేదు.

సమస్త విజ్ఞానం మన వేదాలలోనే ఉందని మన ఆధ్యాత్మిక, ఖగోళ, జ్యోతిష శాస్త్రవేత్తలు ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా... ప్రయోగ శాలలో నిలవని విజ్ఞానం తుదకు అజ్ఞానంగానే మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో ప్రయోగశాలలో నిలవాలని తపించే భారతీయ వేదవేదాంగ శాస్త్రాలలో నిపుణులైనవారికి ఆర్థిక శక్తి లేమి అడ్డు వస్తోంది. కాస్త సైన్స్ చదువుకున్నవారు ఆధ్యాత్మిక జ్యోతిష్యాదులను అడ్డు పెట్టుకొని మాట్లాడే మాయగాళ్ళను సూడో సైన్స్‌గాళ్ళు అంటే, వీరు వారిని మరో విధంగా వెక్కిరిస్తారు. ఈ చర్చోపచర్చలు కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికిరావు. భారతీయ వేదవేదాంగ పురాణేతిహాసాలలో ఏ శాస్త్రం ఎంత ఉంది అనే విషయాన్ని పక్కన పెడితే ఆ యా విషయాల గురించి మాట్లాడటానికి తగినంత పారిభాషిక (టెర్మినాలజీ) పదజాలం లేదన్నది అక్షర సత్యం.



వేదవేదాంగ పురాణేతిహాసాల విజ్ఞానం కథా రూపంలో ఉంటుంది. కథా భాష, ప్రయోగ శాల భాష ఒక రీతిన ఉండదు. ఉదాహరణకు రాజకుమారి ఉద్యానవనంలో చెలికత్తెలతో ఆడుకుంటోంది. ఆకాశంలోని పక్షుల వరుసలను చూసింది. మొదటి వరుసలో ఒకటి, రెండవ వరుసలో రెండు ఇలా... పదవ వరుసలో పది! మొత్తం పక్షులు ఎన్ని అంటే అందరి పప్పులు ఉడికాక రాజకుమారి 55 అని సమాధానం చెబుతుంది.

$n(n+1/2)$ అనే ఆధునిక గణిత సూత్రం రాజకుమారికి తెలియకపోవచ్చును. అయితే వేగంగా $10+(9+1=10)+(8+2=10)+(7+3=10)+(6+4=10)+5=55$ అని నోటితో గణించే మేధ రాజకుమారికి ఉండి ఉండవచ్చు. పదికి దగ్గరకు వచ్చి కూడికలు, తీసివేతలు వంటివి చేస్తే లెక్క సులభం అవుతుంది అని ఆమెకు తెలిసి ఉండవచ్చు. ఏదేమైనప్పటికీ రాజకుమారి మేధను సూత్ర బద్ధం చేస్తే, భారతీయ గణితం అందరికీ అర్థమవుతుంది. అయితే సూత్ర బద్ధం చేయడానికి కావలిసినంత టెర్మినాలజీని మనవారు మనకు అందించలేదన్నది నిజం. టెర్మినాలజీ లేకుండా ఆధ్యాత్మికతతో, జ్యోతిష్యాది గణింపుతో ఎన్ని చెప్పినా ప్రయోజనం ఉండదు.

మన వేదవేదాంగ పురాణేతిహాసాల శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియచేయడానికి కావల్సినంత టెర్మినాలజీని మనం పెంచుకోవాలంటే... మన పండితులు ఛాందస భావాలకు అతీతంగా, అసూయాద్వేషాలకు అతీతంగా మెలగాలి. రేపటి తరానికన్నా మన శాస్త్రవిజ్ఞానాన్ని తెలిపే టెర్మినాలజీని పెంచే దిశగా పోయేటందుకు ఇంగ్లిష్ మీడియం వైపునకు వెళ్ళాలంటే కొందరు తెలుగు భాషాభిమానులకు కోపం వస్తుంది. మన సంప్రదాయం, మన పద్యం, మన ఛందస్సు అంటూ ఆవేశ పడిపోతారు.

నిజమే... కొన్ని వందల ఏళ్ళ నుండి మన ఛందస్సులో కొందరు మహాకవులు, కవులు పద్యాలు రాస్తున్నారు. సంతోషమే. కానీ అదే ఛందస్సులో కంప్యూటర్‌కు చెందిన ద్విసంఖ్యా మానాది గణితాంశాలు ఉన్నాయని ఎందరికి తెలుసు? పోనీ కొందరికి తెలుసు అనుకుందాం. తెలిసినవారు ఆ యా అంశాలను ప్రయోగశాల వద్ద ఎంత మేర సక్సెస్ చేశారు? వారికి తెలిసినదానిని ఎంత మంది గణిత సూత్రాలుగా మలచారు?

రేపటి తరమన్నా ఇంగ్లిష్ మీడియం వైపునకు వెళ్ళి మన వేదాంగాదులలో ఉన్న విజ్ఞాన ఛాయలకు చక్కని టెర్మినాలజీ తయారుచేస్తే, మనం పశ్చిమ దేశాల కంటే ముందే ఉంటాము. మాతృభాష లోనే ఈ పని చెయ్యవచ్చు కదా అని కొందరు అనవచ్చు. అది సాధ్యం కాని పని. ఎందుకంటే మన మాతృభాషా పదజాలం కొంచెం ముందుకు వెళితే అది ఆధ్యాత్మికతలో కూరుకుపోతుంది. లేదా ఖగోళం, జ్యోతిషం అంటూ కాలక్షేపం చేస్తుంది.


ఇంగ్లిష్ మీడియం విషయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డేరింగ్ స్టెప్ వేశారు. దానిని అలాగే కొనసాగించాలి. ఛందస్సు కేవలం పద్యాలు రాసుకోవడానికి పుట్టింది కాదనీ, అందులో ద్విసంఖ్యా మాన గణితం, ఇంకా ఆధునిక గణితంలోకి ప్రవేశించని ఉదాత్తానుదాత్తాదుల గణితం ఉందనీ రేపటి తరమన్నా గమనించాలి.

రెండు రెళ్ళు ఆరు అన్నది సాహిత్యంలో చెప్పుకోవడానికి ఆహ్లాదంగా ఉండవచ్చు. కానీ రెండు రెళ్ళు నాలుగు అన్నది నిజం. ఆ నిజం మాటున ఉన్న సైన్స్, మాథ్స్ వైపు వెళ్ళాలంటే ఆ యా భారతీయ సబ్జెక్టులకు సరిపడ టెర్మినాలజీ తప్పక ఉండాలి.

వ్యాసకర్త విశ్రాంత ఉపాధ్యాయులు । 9849448947

సరైన చోటు

మనం బస్సులో ఎక్కినప్పుడు కూర్చోవటానికి చోటు ఉందా లేదా అని వెతుక్కుంటాం. అది కూడా వెనక్కి అయితే కుదుపులు ఉంటాయని ముందు వరసల్లోనే కూర్చోవటానికి పోటీ పడతాం. రైల్లో ఎక్కినప్పుడు కూడా సౌకర్యంగా కిటికీ దగ్గర చోటుకు ఇష్టపడతాం. అంతేకాదు... సభలకు, సమావేశాలకు వెళ్ళినప్పుడు బాగా వినటానికి, చూడటానికి బాగుంటుందని ముందు వరుసల్లో చోటు చూసుకుంటాం. చదువుకునే రోజుల్లో విద్యార్థులు ముందు బెంచీల్లో చోటు కోసం ప్రతిరోజూ పోటీ పడుతుంటారు.



జ్యోతిర్మయం

కొన్ని గంటల సేపు ప్రయాణం చేయటానికే సౌకర్యవంతమైన చోటును చూసుకుంటున్నాం. ఆ కాసేపు అదేదో మన సొంత చోటులా భావిస్తూ అందులోకి ఎవరూ రాకుండా జాగ్రత్త పడుతున్నాం. మరి, శాశ్వతమైన చోటు సంపాదించుకోవాలంటే ఎంత ప్రయత్నించాలి? ఆ శాశ్వతమైన చోటు ఎక్కడుంది? దాని నెలా పొందాలి?

శాశ్వతుడు, నిత్య సత్యుడు అయిన భగవంతుని హృదయంలో చోటు సంపాదించుకోవాలి. తరతరాలుగా వచ్చే ధన ధాన్యాలు, బంగారం వంటి సంపదలు వదలలేక మానవుడు పూర్తిగా సంసారంలో పడిపోతాడు. కష్టాలు కోరకుండానే వచ్చినట్లు, సుఖాలు ఆ సమయానికి అవే వస్తాయి. అందుకోసం ఎంతో విలువైన జీవితాన్ని వృథా చేసుకోకూడదంటాడు భాగవతంలో ప్రహ్లాదుడు. ధర్మాన్ని ఆచరించటానికి తగిన మానవ జన్మను పొందటం చాలా కష్టం. ఈ అవకాశాన్ని మనుషులు సార్థకం చేసుకోవాలి.

ధర్మాన్ని, సత్యాన్ని శ్రద్ధగా పాటించే వ్యక్తులకు దైవం హృదయంలో చోటు లభిస్తుంది. ఆ పరమ పురుషుని పాద పద్మాలను మన హృదయాలలో నిలుపుకోవాలి. మంచితనం, సత్ప్రవర్తన, సత్సాంగత్యం, భక్తి, పరిపూర్ణ విశ్వాసం వంటి వానితో దైవం హృదయంలో చోటు పొందాలి. అదే నిజమైన పొందవలసిన చోటు. భగవంతుడు మెచ్చుకుంటే మనకు లభించనిది ఏదీ లేదు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.చవితి సా.4.48 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: పుష్యమి రా.10.35 వరకు, తదుపరి ఆశ్రేష, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ప.12.25 నుండి 1.17 వరకు, తదుపరి ప.3.02 నుండి 3.54 వరకు, అమృతఘడియలు: ప.3.55 నుండి 5.36 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 5.28, సూర్యాస్తమయం: 6.29.

క్లుప్తంగా...

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్య విజయకేతనం

మాదాపూర్ (హైదరాబాద్): జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల అనంతరం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరులు సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆలిండియా 1వ ర్యాంక్‌తో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 4,5,6,9,10,12,14 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు ఆమె తెలిపారు. ఆలిండియా 1వ ర్యాంకు రాఘవశర్మ, 4వ ర్యాంకు రిథమ్ కేడియా, పుట్టి కుశాల్‌కుమార్ 5వ ర్యాంకు, రాజదీప్‌మిశ్రా 6వ ర్యాంకు, ధృవిన్ హేమంత్ దోషి 9వ ర్యాంకు, అల్లడబోయిన సిద్విక్ సుహాస్ 10వ ర్యాంకును కైవసం చేసుకున్నట్లు తెలిపారు. తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో టాప్ 10లోపు 5ర్యాంకులు 100లోపు 27 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, శ్రీచైతన్య విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

నారాయణ జయభేరి

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు జయభేరి మోగించారు. అఖిల భారత ఓపెన్ కేటగిరీలో టాప్ 20 లోపు 7 ర్యాంకులు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల గ్రూప్ డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, శరణి నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో సందేశ్ భోగాలపల్లి 3 వర్యాంకు, రాజ్‌దీప్ మిశ్రా 6వ ర్యాంకు, ఎం.బాలాదిత్య 11 వ ర్యాంకు, రాఘవ్ శర్మ 12 వ ర్యాంకు, బిస్మిత్ సాహు 16 వ ర్యాంకు, ఆర్యన్ ప్రకాష్ 17వ ర్యాంకు, అమోఘ్ అగర్వాల్ 20వ ర్యాంకులను సాధించినట్లు వారు తెలిపారు. వీటితోపాటు తమ సంస్థకు చెందిన విద్యార్థులు 27,28,31, 33, 40,45,49,51,54,63,66,70,74,76,77,82,85,87,89,90,91,94,99 ర్యాంకుల్ని కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సంస్థ యాజమాన్యం అభినందనలు తెలియజేసింది.

ప్రతిభచాటిన ఎస్ఆర్

విద్యారణ్యపురి: జేఈఈ-2024 అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి అన్ని కేటగిరీల్లో కలిపి జి.నవీన్ 8వ ర్యాంకు, పి.రాకేష్‌కుమార్ 36వ ర్యాంకు, స్నేహిత్‌సందేశ్ 123 ర్యాంకు, వి.రాంబాబు 125వ ర్యాంకు, వి.వేదవంచన్‌రెడ్డి 127వ ర్యాంకు, జె.శ్రేతన్‌రెడ్డి 133వ ర్యాంకు, బోడ దినేష్ 157వ ర్యాంకు, మాలోతు వెంకటేశ్వర్లు 185వ ర్యాంకు, దాసరి కార్తీక్ 299వ ర్యాంకు, తిలావత్ అఖిల్‌నాయక్ 323వ ర్యాంకు, కె.శ్రీరామ్‌రెడ్డి 324వ ర్యాంకు సాధించారని తెలిపారు. అలాగే ఓపెన్‌లో అన్ని కేటగిరీలు కలిపి 450, 598, 621, 654, 689, 737, 737, 751, 901, 966తో పాటు మరిన్ని ర్యాంకులు వచ్చాయని వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

డాక్టర్ కేకేఆర్ గౌతమ్ జయకేతనం

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ మేరకు సంస్థ యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో తమ విద్యా సంస్థకు చెందిన పూర్వ విద్యార్థులు పుట్టి కుశాల్ కుమార్ అఖిల భారత ఓపెన్ కేటగిరీలో 5వ ర్యాంకు, నతివాడ జ్యోతిరాదిత్య 55వ ర్యాంకు సాధించినట్లు పేర్కొంది. అదేవిధంగా 100 లోపు వివిధ కేటగిరీల్లో 3,5,9,12,17,26, 28, 45,55,64,88 ర్యాంకుల్ని తమ విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు వెల్లడించింది. విజయం సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, సిబ్బందిని యాజమాన్యం అభినందించింది.

గ్రూప్-4 పోస్టులకు ప్రాథమిక ఎంపిక జాబితా..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-4 ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు తెలిపింది. ఎంపికైన అభ్యర్థులు చెక్ లిస్టు, రెండు కాపీల అప్లికేషన్, రెండు కాపీలు అటెస్టేషన్ పత్రం వెబ్‌సైట్ నుంచి డైన్‌లోడ్ చేసుకుని తీసుకురావాలని సూచించింది. ధ్రువపత్రాల పరిశీలన రెండు చోట్ల నిర్వహిస్తున్నామని, టీజీపీఎస్సీ కార్యాలయంలో, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వెబ్ ఆప్షన్లు, లోకల్ ఏరియా, అన్ రిజర్వ్‌డ్ బ్రేకప్ తదితర సమాచారమంతా కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. వెబ్ ఆప్షన్ల లింకు ఈనెల 13వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

పాలనపై ఫోకస్

ఎన్నికల కోడ్ ముగియడంతో నేటినుంచి ఉరుకులు పరుగులే

వరుస సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలకు రంగం సిద్ధం



సాక్షి, హైదరాబాద్: వరుస ఎన్నికల కోడ్‌లతో స్తంభించిన పాలనను ఉరుకులు పరుగులు పెట్టించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం నుంచి అన్ని ప్రభుత్వశాఖలు పాలనపై పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరించనున్నాయి. ఆరు గ్యారంటీల అమలు, రైతు రుణమాఫీ లాంటి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలతోపాటు సాధారణపాలనకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను ఇక నుంచి చురుగ్గా సాగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయనుంది. ఇప్పటికే పూర్తిస్థాయి బడ్జెట్ రూపకల్పన, ఆదాయవనరుల పెంపుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షలు ప్రారంభించగా, నేటి నుంచి మంత్రులందరూ అన్నిశాఖలపై వరుస సమీక్షలు నిర్వహించనున్నారు. ఈ సమీక్షల అనంతరం కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఆయా శాఖల పనితీరు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనలకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. మంత్రులందరూ తమతమ నియోజకవర్గాలు, తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలతోపాటు ఇన్‌చార్జ్‌లుగా ఉన్న జిల్లాలకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును పరిశీలించనున్నారు.

బదిలీలపై నిషేధం త్వరలోనే ఎత్తివేత!

అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో ఉత్తేజితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై దృష్టి పెట్టింది. ఈ నెలాఖరు లేదంటే వచ్చే నెల మొదటివారంలోపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల బదిలీలు చేపట్టనుంది. ఇందుకుగాను త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధం ఎత్తివేయనుంది. శాఖల వారీగా బదిలీలపై నిషేధం ఎత్తివేయడం, బదిలీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి మళ్లీ బదిలీలపై నిషేధం విధించే షెడ్యూల్‌ను వచ్చే నెల మొదటివారంకల్లా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు నిర్ణయించారు. ఈ మేరకు ప్రతి ప్రభుత్వశాఖలో మూడేళ్లు పూర్తయిన ప్రతి ఉద్యోగికి స్థానచలనం కల్పించనున్నారు. జోన్‌లు, మల్టీజోన్‌ల వారీగా ఉద్యోగుల బదిలీలు చేపట్టడంతోపాటు ఆయాశాఖల పరిధిలో కీలక అధికారుల బాధ్యతల్లో కూడా మార్పులు చేయనున్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వ్యవహారాలను ఆయా శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు పర్యవేక్షించనున్నారు. కొందరు ప్రభుత్వ అధికారులు సహకరించడం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున లబ్ధి పొందినవారు ఇప్పటికీ ఆ పార్టీ నేతలకు సహకరిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలే ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న అంతరాయాలకు సంబంధించి ఈ ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విధుల పట్ల అశ్రద్ధగా ఉన్న అధికారులపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. ప్రజాపాలన అందించడంలో ప్రభుత్వ అధికారుల పాత్ర కీలకమైనదని, ఈ క్రమంలో అశ్రద్ధ వహించే అధికారులను పక్కనపెట్టాలని యోచిస్తోంది. ఇందుకోసం అన్ని ప్రభుత్వ శాఖల్లోని అధికారులు, సిబ్బంది పనితీరుపై ప్రతి నెలా నివేదికలు తెప్పించుకోవాలని, వాటిపై సమీక్షించిన అనంతరం పనితీరు బాగాలేని వారి విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం భావిస్తోంది. మొత్తం మీద అభివృద్ధి, సంక్షేమం ప్రాతిపదికన పూర్తిస్థాయిలో పాలనపై దృష్టి పెట్టి అటు ప్రభుత్వ యంత్రాంగాన్ని, ఇటు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ముందుకు నడిపించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మనోళ్ల మెరుపులు

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపిక చేశారు. వారిలో 1,86,584 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు రిజిస్టర్ చేసుకున్నారు. అందులో 1,80,200 మంది పరీక్ష రాశారు. వీరిలో దేశవ్యాప్తంగా 48,248 మంది అర్హత సాధించారు. ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోటి 360 మార్కులకుగాను 355 మార్కులతో జాతీయ టాపర్‌గా నిలిచారు. అదే జోన్‌కు చెందిన ఆదిత్య రెండో ప్లేస్‌లో నిలిచారు. ఇక తెలుగు రాష్ట్రాలకు చెందిన భోగాలపల్లి సందేశ్ 338 మార్కులతో మూడో ర్యాంకు, పుట్టి కౌశల్‌కుమార్ 334 మార్కులతో 5వ ర్యాంకు, కోడూరు తేజేశ్వర్ 331 మార్కులతో 8వ ర్యాంకు, అల్లాడబోయిన ఎస్ఎస్‌డిబి సిద్విక్ సుహాస్ 329 మార్కులతో పదో ర్యాంకు సాధించారు.

పెరిగిన కటాఫ్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత కోసం పరిగణనలోకి తీసుకునే కటాఫ్ పర్సంటైల్ ఈసారి పెరిగింది. జనరల్ కేటగిరీలో 2022లో 88.4 పర్సంటైల్ కటాఫ్ అయితే, 2023లో ఇది 90.7గా ఉంది. తాజాగా కటాఫ్ 93.2 పర్సంటైల్‌కు చేరింది. ఓపెన్ కేటగిరీలో కటాఫ్ మార్కులు 109గా, రిజర్వేషన్ కేటగిరీలో 54 మార్కులుగా నిర్ధారించారు. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు ప్రతీ సబ్జెక్టులో కనీసం 8.68 శాతం, మొత్తంగా 30.34 శాతం మార్కులతో ర్యాంకుల జాబితాలోకి వెళ్లారు. ఇక ఈసారి అర్హుల సంఖ్య కూడా పెరిగింది. గత ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో 43,773 అర్హత సాధించగా.. ఈసారి 48,248 మంది అర్హత సాధించారు.

జోసా కౌన్సెలింగ్ షురూ

ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, జీఎఫ్ఐటీలో ప్రవేశాలకు సంబంధించి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించనుంది. విద్యార్థులకు అవగాహన నిమిత్తం 17వ తేదీ వరకు మాక్ కౌన్సెలింగ్ నిర్వహించనుంది. మొత్తం ఐదు దశల్లో కౌన్సెలింగ్‌ను పూర్తి చేసేందుకు ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించింది. 18వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు, ఆప్షన్ల ఎంపిక మొదలవుతాయి. 20న తొలి దశ, 27న రెండో దశ, జూలై 4న మూడో దశ, జూలై 10న నాలుగో దశ, జూలై 17న తుది విడత సీట్లను కేటాయించనుంది. మిగిలిన సీట్లు ఏవైనా ఉంటే వాటికి జూలై 23న కౌన్సెలింగ్ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించింది. అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ఆధారంగా ఐఐటీల్లో, జేఈఈ ర్యాంకు ఆధారంగా ఇతర కేంద్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు. దేశంలోని 121 విద్యా సంస్థలు ఈసారి జోసా కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నాయి. గత ఏడాది వీటి సంఖ్య 114 మాత్రమే. 2023-24 విద్యా సంవత్సరంలో దేశంలోని 23 ఐఐటీల్లో 17,385 సీట్లున్నాయి. ఈ సంవత్సరం వీటి సంఖ్య పెరగవచ్చని ఆశిస్తున్నారు.

నా లక్ష్యం ఐఏఎస్

మాది నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నెహ్రూనగర్ గ్రామం. అమ్మ వి.రాజేశ్వరి, నాన్న బి.రామ సుబ్బారెడ్డి.. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. పదో తరగతిలో 10/10 పాయింట్లు వచ్చాయి. ఇంటర్‌లో 987 మార్కులు సాధించాను. జేఈఈ మెయిన్స్‌లో 99.99 పర్సెంటైల్‌తో ఆల్ ఇండియా లెవెల్‌లో 252వ ర్యాంకు వచ్చింది. జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో 368 మార్కులకు 338 వచ్చాయి. ఓపెన్ క్యాటగిరీలో ఆలిండియాలో 3వ ర్యాంక్, సౌత్ ఇండియాలో మొదటి ర్యాంక్ రావడం పట్ల చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి. ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదివి, సివిల్స్ పరీక్ష రాసి ఐఏఎస్ కావాలనేది నా లక్ష్యం.

– భోగాలపల్లి సందేశ్, 3వ ర్యాంకు

ముందస్తు ప్రణాళికతో చదివా..

మాది కర్నూలు జిల్లా కృష్ణగిరి గ్రామం. అమ్మానాన్నలు కృష్ణవేణి, శేఖర్.. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. పదో తరగతిలో 570, ఇంటర్‌లో 981 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా లెవెల్‌లో 83వ ర్యాంకు వచ్చింది. అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా లెవెల్‌లో 8వ ర్యాంకు రావడం పట్ల చాలా సంతోషంగా ఉంది. ఐఐటీ ముంబైలో సీఎస్ఈ చదవాలని ఉంది. ముందస్తు ప్రణాళికతో చదవడం వల్లే ఉత్తమ ర్యాంకు సాధించాను.

– కె.తేజేశ్వర్, ఆల్ 8వ ర్యాంకు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కేటగిరీ వారీగా అర్హుల సంఖ్య ఇదీ..

కేటగిరీ	దరఖాస్తులు	పరీక్ష రాసింది	అర్హుల సంఖ్య
జనరల్	38,701	37,578	14,083
జనరల్ (పీడబ్ల్యూడీ)	857	798	236
ఓబీసీ-ఎన్‌సీఎల్	68,507	66,213	9,281
ఓబీసీ-ఎన్‌సీఎల్(పీడబ్ల్యూడీ)	1,139	1,070	218
ఈడబ్ల్యూఎస్	31,363	30,643	5,423
ఈడబ్ల్యూఎస్ (పీడబ్ల్యూడీ)	340	324	85
ఎస్సీ	30,370	29,432	13,794
ఎస్సీ (పీడబ్ల్యూడీ)	227	207	41
ఎస్టీ	14,651	13,869	5,073
ఎస్టీ (పీడబ్ల్యూడీ)	69	66	14

బాలురు, బాలికల వారీగా అర్హత

జెండర్	దరఖాస్తులు	పరీక్ష రాసింది	అర్హులు
పురుషులు	1,43,637	1,39,180	40,284
స్త్రీలు	42,947	41,020	7,964
మొత్తం	1,86,584	1,80,200	48,248

టాప్ టెన్ ర్యాంకర్లు వీరే..

పేరు	మార్కులు	ఐఐటీ జోన్
వేద్ లోహిత్	355	ఢిల్లీ
ఆదిత్య	346	ఢిల్లీ
భోగాలపల్లి సందేశ్	338	మద్రాస్
రైతమ్ కేడియా	337	రూర్కీ
పుట్టి కౌశల్‌కుమార్	334	మద్రాస్
రాజ్‌దీప్ మిశ్రా	333	బాంబే
ద్విజ ధర్మేశ్‌కుమార్ పాటిల్	332	బాంబే
కోడూరు తేజేశ్వర్	331	మద్రాస్
ధ్రువి హేమంత్ జోషి	329	బాంబే
అల్లాడబోయిన సిద్విక్ సుహాస్	329	మద్రాస్

(తెలుగు రాష్ట్రాలు మద్రాస్ జోన్‌లో ఉంటాయి)

అడ్వాన్స్‌డ్‌లో కేటగిరీ వారీగా కనీస అర్హత మార్కులివీ..

కేటగిరీ	ప్రతీ సబ్జెక్టులో..	మొత్తం మార్కులు
ఓపెన్ కేటగిరీ	10	109
ఓబీసీ-ఎన్‌సీఎల్	9	98
ఈడబ్ల్యూఎస్	9	98
ఎస్సీ	5	54
ఎస్టీ	5	54

(మిగతా అన్ని రిజర్వేషన్ కేటగిరీల్లో ప్రతీ కేటగిరీలో కనీసం 5, మొత్తంగా 54 మార్కులు వస్తే అర్హత సాధించినట్టు లెక్క)

'పోలీస్' హ్యాకర్.. 20 ఏళ్ల విద్యార్థి

▶ మొదటి పేజీ తరువాయి

దర్యాప్తు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. హ్యాకర్ పోలీస్ యాప్‌లలోని సమాచారాన్ని పబ్లిక్ ప్లాట్‌పారంలలో అమ్మకానికి పెట్టినట్టు ఉంచిన పోస్టులను ఆధారంగా చేసుకొని దర్యాప్తులో ముందుకు వెళ్లారని, పక్కా సమాచారంతో టీజీసీఎస్‌బీ అధికారులు ఢిల్లీకి వెళ్లి, అక్కడ హ్యాకర్ జతిన్‌కుమార్‌ను గుర్తించి అరెస్టు చేశారని డీజీపీ తెలిపారు. నిందితుడికి సైబర్ నేరచరిత్ర ఉందని, గతంలో ఇలాంటి హ్యాకింగ్ కేసులో ప్రమేయం ఉందన్నారు. న్యూఢిల్లీలోని స్పెషల్ సెల్ ద్వారక పోలీస్ స్టేషన్‌లో క్రైం. నంబర్ 291/2023లో ఇంతకుముందు అక్కడి పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. నిందితుడు ఆధార్ కార్డులకు సంబంధించిన డేటా, ఇతర ఏజెన్సీలకు సంబంధించిన క్లిష్టమైన సమాచారాన్ని కూడా లీక్ చేశారని డీజీపీ వెల్లడించారు. తెలంగాణ పోలీస్‌యాప్‌ల డేటా చోరీ కేసులో ప్రమేయమున్న ఇతర నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని డీజీపీ తెలిపారు.

అత్యాధునిక టెక్నాలజీతో గుర్తింపు

హ్యాకింగ్ సమాచారం అందిన వెంటనే టీజీసీఎస్‌బీ అధికారులు రంగంలోకి దిగారని, అధునాతన సాధనాలను ఉపయోగించి, హ్యాకర్ జాడను విజయవంతంగా తెలుసుకోగలిగారని డీజీపీ రవిగుప్తా తెలిపారు. హ్యాకర్ పోలీస్ యాప్‌ల నుంచి చోరీ చేసిన వివరాలను databreachforum.stలో పోస్ట్ చేశాడని, చోరీ చేసిన డేటాను $150 డాలర్లకు అమ్మకానికి పెట్టాడని పేర్కొన్నారు. ఆసక్తి గల కొనుగోలుదారులు హాక్ ఐ ,టీఎస్‌కాప్ డేటాను కొనేందుకు తనను సంప్రదించవచ్చని



టెలిగ్రామ్ ఐడీలు Adm1nfr1end , Adm1nfr1 ends ఇచ్చాడని తెలిపారు. సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులను ఉపయోగించి నిందితుడి వివరాలు తెలుసుకున్నామన్నారు.

పౌరుల సమాచారం సురక్షితం

హాక్ఐ, టీఎస్‌కాప్ యాప్‌లు హ్యాకింగ్ గురైనా పౌరులందరి సమాచారం సురక్షితంగానే ఉందని, ఎలాంటి ఆందోళన వద్దని డీజీపీ రవిగుప్తా స్పష్టం చేశారు. డేటా లీక్ అయినట్టు మీడియాలో వచ్చిన వార్తలు వాస్తవం కాదని పేర్కొన్నారు. హాక్ఐ యాప్‌లో డేటా రిపోజిటరీలో భాగంగా మొబైల్ నంబర్లు, చిరునామాలు, ఈమెయిల్ ఐడీల వంటి వినియోగదారు సమాచారాన్ని మాత్రమే కలిగి ఉంటుందని డీజీపీ తెలిపారు. అయితే బలహీనమైన పాస్‌వర్డ్‌ల కారణంగా హ్యాకర్ హాక్ఐ డేటాలోకి యాక్సెస్ పొంది ఉండొచ్చని అనుమానిస్తున్నట్టు తెలిపారు. టీఎస్‌కాప్ యాప్ అనేది పూర్తిగా పోలీస్ విధుల్లో అంతర్గత పనుల కోసం వాడతామని తెలిపారు. ఇందులో సందర్శకులు, హోటళ్ల డేటా సేకరిస్తారన్నది అవాస్తవం అని డీజీపీ తెలిపారు. టీఎస్‌కాప్ ద్వారా థర్డ్‌పార్టీలకు డేటా వెళ్లే ఆస్కారమే లేదన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ ఎస్ఎంఎస్ సర్వర్ యూఆర్ఎల్ విషయంలో, చొరబాటుదారుడి క్లెయిమ్‌లు పూర్తిగా అబద్ధమని, ఈ యూఆర్ఎల్ ఏప్రిల్ 2022 నుంచి పనిచేయలేదని స్పష్టం చేశారు. హ్యాక్ అయినట్టు చెబుతున్న యూఆర్ఎల్‌ను హైదరాబాద్ సిటీ పోలీసులు చాలా కాలం ముందు నిలిపివేశారని పేర్కొన్నారు.

భవిష్యత్‌లో ఇలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు

అన్ని పోలీసు అంతర్గత, బాహ్య నెట్‌వర్క్‌లు, వెబ్, మొబైల్ అప్లికేషన్లు, క్లౌడ్ , ఎండ్ పాయింట్‌లలో ఏవైనా సైబర్ సెక్యూరిటీ లోపాలు ఉంటే గుర్తించి పరిష్కరిస్తామని డీజీపీ రవిగుప్తా వెల్లడించారు. భవిష్యత్‌లో ఇలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ విషయంలో ఎవరైనా తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే వారిపై పోలీస్‌శాఖ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని డీజీపీ హెచ్చరించారు. పోలీస్‌యాప్‌ల హ్యాకింగ్ కేసును టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ పర్యవేక్షణలో రికార్డు సమయంలోనే అధికారులు ఛేదించారన్నారు. దర్యాప్తులో కీలకంగా పనిచేసిన ఎస్పీలు భాస్కరన్, విశ్వజిత్ కంపాటి, డీఎస్పీలు, కేవీఎం ప్రసాద్, ఏ.సంపత్, ఇన్‌స్పెక్టర్ ఆశిష్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సురేష్‌లను డీజీపీ రవిగుప్తా ప్రత్యేకంగా అభినందించారు.

రామోజీకి అశ్రు నివాళి

ఫిలింసిటీలోని నివాసం నుంచి స్మృతివనం వరకు అంతిమయాత్ర



రామోజీ పాడె మోస్తున్న చంద్రబాబు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రముఖ వ్యాపారవేత్త చెరుకూరి రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. ఉదయం ఫిలింసిటీలోని ఆయన నివాసం నుంచి స్మృతివనం వరకు అంతిమ యాత్ర నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి. రామోజీ చితికి ఆయన కుమారుడు కిరణ్ నిప్పంటించారు.

ప్రముఖుల నివాళి

రామోజీరావు (88) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆ రోజు ఉదయం నుంచి ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం రామోజీ మృతదేహాన్ని ఫిలింసిటీలోని నివాసంలో ఉంచారు. ఆదివారం ఉదయం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, బీజేపీ ఎంపీలు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్, దేవినేని ఉమా, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ నేత నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, సినీ దర్శకుడు బోయపాటి శ్రీను, నటుడు మురళీ మోహన్ తదితరులు రామోజీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. రామోజీతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

పాడె మోసిన చంద్రబాబు

ఆదివారం ఉదయం 9.30 గంటలకు రామోజీ నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమైంది. అంతిమ యాత్ర వాహనంపై కుమారుడు కిరణ్, కోడళ్లు శైలజ, విజయేశ్వరి, మనవరాళ్లు సహరి, బృహతి, దివిజ, కీర్తి, సోహన, మనవడు సుజయ్‌తోపాటు జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి తదితరులు కూర్చున్నారు. ఉదయం 11 గంటలకు అంతిమయాత్ర స్మృతివనానికి చేరుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అంతిమ యాత్రలో పాల్గొని రామోజీ పాడె మోశారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. 11.30 గంటల సమయంలో రామోజీ భౌతికకాయాన్ని చితిపై ఉంచారు. పోలీసులు గౌరవ వందనం చేసి, గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపిన తర్వాత.. రామోజీ కుమారుడు కిరణ్ చితికి నిప్పంటించారు.



రామోజీ రావు అంత్యక్రియలకు హాజరైన మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి, మండవ, మోత్కుపల్లి, అరికెపూడి గాంధీ, నామా నాగేశ్వరరావు తదితరులు

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 74% హాజరు

▶ మొదటి పేజీ తరువాయి

త్వరలో కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని, అభ్యర్థులు వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా చూడాలని సూచించారు. ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 ప్రధాన పరీక్షలు నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి వెల్లడించారు.

సులభతరంగా ప్రశ్నలు...

ప్రిలిమినరీ పరీక్షలో వచ్చిన ప్రశ్నలు సులభతరంగా ఉన్నట్టు అభ్యర్థులు చెబుతున్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ మొదటిసారిగా చేపడుతోంది. రెండేళ్ల క్రితం నోటిఫికేషన్ జారీ చేసి, రెండుసార్లు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. వివిధ కారణాల వల్ల వాటిని కమిషన్ రద్దు చేసింది. గత ప్రశ్నపత్రంతో పోలిస్తే తాజాగా వచ్చిన ప్రశ్నలు సులభంగా, కొన్ని అత్యంత సులభంగా ఉన్నాయని పలువురు అభ్యర్థులు చెప్పారు. ఈ క్రమంలో గతంతో పోలిస్తే కటాఫ్ మార్కులు పెరిగే అవకాశం లేకపోలేదు.

మధ్యలో బయోమెట్రిక్ హాజరు స్వీకరణ

పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగింది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కనీసం గంట ముందు రావాలని, బయోమెట్రిక్ హాజరు స్వీకరణ ఉంటుందని కమిషన్ తెలిపింది. పరీక్షకు ముందు లేదా పరీక్ష తర్వాత హాజరు స్వీకరణ చేపట్టాల్సి ఉండగా, చాలాచోట్ల అధికారులు పరీక్షకు మధ్యలో బయోమెట్రిక్ హాజరు స్వీకరించారు. సరిగ్గా ప్రశ్నలు చదివి జవాబులు ఇచ్చే సమయంలో బయోమెట్రిక్ హాజరు స్వీకరణ ప్రక్రియ చిరాకు తెప్పించిందని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల పరీక్షకేంద్రాలకు రవాణా సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడినట్టు చెప్పారు. నగర శివారు ప్రాంతాల్లోని చాలా పరీక్ష కేంద్రాలు ప్రధానరహదారికి లోపలికి ఉండడం..ఆదివారం కావడంతో ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలు సైతం దొరక్క అవస్థలు పడినట్టు వాపోయారు.

సీసీ కెమెరాల ద్వారా పరిశీలన

టీజీపీఎస్సీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ యూనిట్(సీసీకెమెరా) ద్వారా పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించినట్టు నవీన్ నికోలస్ తెలిపారు. పరీక్ష పక్కాగా నిర్వహించామని, నిర్వహణలో కీలకపాత్ర పోషించిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందికి కమిషన్ తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

మద్యంమత్తులో గ్రూప్-1 విధులకు..

కరీంనగర్ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగి నిర్వాకం



తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించే అన్వర్ మీర్జా పర్వేజ్‌బేగ్‌కు తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల బీ-వింగ్‌లో గ్రూప్-1 పరీక్ష విధులు కేటాయించారు. మద్యం తాగి విధులకు హాజరయ్యాడు. విధి నిర్వహణలో అనుచితంగా ప్రవర్తించడంతో తోటి సిబ్బంది ఎల్ఎండీ ఎస్సైకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై చేరాలు పరీక్షకేంద్రం వద్దకు వెళ్లి అన్వర్ మీర్జాను అదుపులోకి తీసుకున్నారు. బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా.. రీడింగ్ 173 వచ్చింది. దీంతో అతడిని విధుల నుంచి తప్పించారు.

'నీట్'పై టెన్షన్

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల్లో నెలకొన్నాయి. మరోవైపు నీట్ ఫలితాలపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఒక కమిటీని ఏర్పాటు చేయడంతో సందిగ్ధ పరిస్థితి నెలకొంది. రద్దు ఉండకపోవచ్చని... దానివల్ల విద్యార్థులు మరింత నష్టపోతారని అధికారులు అంటున్నారు.

ఎన్‌టీఏపై విమర్శల వెల్లువ

మే 5న నీట్ పరీక్ష జరగ్గా, ఫలితాలను జూన్ 14న ప్రకటిస్తామని ఎన్‌టీఏ ముందుగానే ప్రకటించింది. కానీ జూన్ 4న దేశవ్యాప్తంగా ప్రజలు ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠగా ఎదురుచూస్తుంటే... అదే రోజు చడీచప్పుడు కాకుండా నీట్ ఫలితాలను ఎన్‌టీఏ ప్రకటించడం అనుమానాలకు తావిస్తోంది. అంత హడావుడిగా ప్రకటించాల్సిన అవసరం ఏమొచ్చిందనే విమర్శలు వస్తున్నాయి. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, పక్కదారి పట్టించేందుకు ఆరోజు విడుదల చేశారన్న చర్చ జరుగుతోంది. అలాగే ఫలితాలను చూసుకునేందుకు విద్యార్థులకు ముందే అవకాశం కల్పించారు. అయితే, ఆలిండియా ర్యాంకులు.. మార్కులు.. ఫలితాల సమగ్ర సమాచారాన్ని మాత్రం ఆరోజు మరింత ఆలస్యం చేసి ఇచ్చారు. ఇలా అనుమానాలకు తావిచ్చేలా ఎన్‌టీఏ వ్యవహరించిందన్న చర్చ జరుగుతోంది.

హైదరాబాద్‌లోనూ ఆలస్యం

ఇక పలువురు విద్యార్థులకు ఎన్‌టీఏ గ్రేస్ మార్కులు ఇచ్చిన అంశంపైనా పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. నీట్ పరీక్ష సమయం 3 గంటల 20 నిమిషాలు. కొన్ని కేంద్రాల్లో ప్రశ్నాపత్రాల అందజేతలో ఆలస్యం, చిరిగిన ఓఎంఆర్ పత్రాలు తదితర కారణాల నేపథ్యంలో సమయం వృథా అయ్యిందంటూ కొందరు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పంజాబ్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, హరియాణ న్యాయస్థానాల్లో రిట్ పిటిషన్లు కూడా దాఖలు చేశారు. దీంతో సీసీటీవీ ఫుటేజీ, ఇతర ఆధారాలను ఎన్‌టీఏ సమీక్షించి వారికి గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు తెలిపింది. అలాగైతే దేశంలో అనేకచోట్ల విద్యార్థులకు ఆలస్యంగా పరీక్ష పేపర్ ఇచ్చారు. వారిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదన్న ప్రశ్నలూ వినిపిస్తున్నాయి. హైదరాబాద్ మాదాపూర్‌లోని మెరీడియన్ స్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలోని ఒక రూంలో ప్రశ్నపత్రాన్ని 20 నిమిషాలు ఆలస్యంగా ఇచ్చారు. ఆ గదిలో గడియారం ఆగిపోవడం... తప్పుగా చూపించడకపోవడంతో ఆలస్యం చేశారు. తప్పు సిబ్బందిదే అయినా కానీ విద్యార్థులకు అదనపు సమయం ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు అనేకమంది ప్రశ్నలు రాయలేకపోయారు. అంత సమయం పోవడం వల్ల తమకు మార్కులు తగ్గుతాయని, రావాల్సిన సీటు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మరి వారికెందుకు గ్రేస్ మార్కులు కలపలేదని ప్రశ్నిస్తున్నారు.



ఆదివారం రాష్ట్రపతి భవన్ వద్ద జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఆహూతులు



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నేపాల్ ప్రధాని ప్రచండ, బంగ్లాదేశ్ ప్రధాని హసీనా, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, శ్రీలంక అధ్యక్షుడు విక్రమ సింఘే తదితరులు



కార్యక్రమానికి హాజరైన ఎన్డీఏ పక్ష నేతలు పవన్‌కల్యాణ్, నితీశ్ కుమార్, చంద్రబాబు తదితరులు

కన్నులపండువగా...

మోదీ ప్రమాణోత్సవం సందర్భంగా కళకళలాడిన రాష్ట్రపతి భవన్

రాజకీయ, పారిశ్రామిక దిగ్గజాలు, సినీ తారల సందడి

వేడుకలో పాల్గొన్న 8,000 మందికి పైగా వీఐపీలు

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. దేశాధినేతల నుంచి రాజకీయ దిగ్గజాల దాకా వేడుకలో పాల్గొన్నారు. పారిశ్రామిక ప్రముఖులు మొదలుకుని సినీ తారల దాకా తళుక్కుమన్నారు. 8,000 మందికిపైగా వీవీఐపీలు, వీఐపీలతో రాష్ట్రపతి భవన్ ఆవరణ కళకళలాడింది. వరుసగా మూడోసారి ప్రధానిగా మోదీతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణస్వీకారం చేయిస్తుండగా ప్రాంగణమంతా కరతాళ ధ్వనులు, హర్షధ్వానాలతో మారుమోగింది. మాజీ రాష్ట్రపతులు ప్రతిభా పాటిల్, రామ్‌నాథ్ కోవింద్ తదితరులు పాల్గొన్నారు. షారుఖ్ ఖాన్ నుంచి రజనీకాంత్ దాకా పలువురు సినీ ప్రముఖులు కుటుంబ సమేతంగా హాజరై అలరించారు. పారిశ్రామికవేత్తలు గౌతం అదానీ దంపతులు, ముకేశ్ అంబానీ దంపతులు వేడుకకు హాజరయ్యారు. భిన్న మతాలకు చెందిన పెద్దలు పాల్గొనడం అందరినీ ఆకర్షించింది. బీజేపీ నుంచి తొలిసారి ఎంపీగా నెగ్గిన ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ప్రధానాకర్షణగా నిలిచారు. కేరళలోని త్రిసూర్ ఎంపీ, మలయాళ సినీ స్టార్ సురేశ్ గోపీ కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం అందరి దృష్టినీ ఆకర్షించింది. లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో బీజేపీకి ఇదే తొలి విజయమన్నది తెలిసిందే. మోదీకి పలు రంగాల ప్రముఖుల అభినందనలు, శుభాకాంక్షల సందేశాలతో ఎక్స్ తదితర సోషల్ సైట్లు హోరెత్తిపోయాయి.

ఏడుగురు దేశాధినేతలు: మోదీ ప్రమాణ స్వీకారానికి 7 దేశాల అధినేతలు హాజరయ్యారు. బంగ్లాదేశ్ అధ్యక్షురాలు షేక్ హసీనా, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, మారిషస్ ప్రధాని ప్రవింద్ కు మార్ జగన్నాథ్, మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు, నేపాల్ ప్రధానమంత్రి పుష్ప కమల్ దహల్ ప్రచండ, భూటాన్ ప్ర ధాన మంత్రి త్సెరింగ్ టాగ్‌బే, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ అఫిఫ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్, మాల్దీవుల మధ్య సంబంధాలు బలహీనపడ్డ నేపథ్యంలో ముయిజ్జు హాజరు ప్రాధాన్యం సంతరించుకుంది. 2023 నవంబర్‌లో అధ్యక్షుడయ్యాక ఆయన భారత్ రావడం ఇదే తొలిసారి.

మోదీ తీన్‌మార్...



తెలుపు కుర్తా-చుడీదార్, నీలి రంగు జాకెట్‌లో... మెరిసిపోయిన మోదీ

విశేష సందర్భాల్లో తన వస్త్రధారణతో ఆకట్టుకునే మోదీ ఈసారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తెలుపు కుర్తా, చుడీదార్, దానిపై నీలి రంగు జాకెట్ ఎంచుకున్నారు. 2014లో తొలిసారి ప్రధానిగా ప్రమాణ చేసిన సందర్భంగా ఆయన క్రీం కలర్ కుర్తా, తెల్ల పైజామా, బంగారు రంగు జాకెట్ ధరించారు. 2019లో రెండోసారి ప్రధాని అయినప్పుడు తెలుపు రంగు కుర్తా, పైజామా, వాటిపై బంగారు రంగు జాకెట్ ధరించి ప్రమాణస్వీకారం చేశారు. పంద్రాగస్టు, గణతంత్ర వేడుకలకు మోదీ రంగురంగుల తలపాగాలు ధరించి అలరిస్తుంటారు.



ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీ, రాజ్‌నాథ్, షాలకు అభివాదం చేస్తున్న నిర్మల

వినయంగా ఉండండి.. కష్టపడి పని చేయండి

- రుజువర్తన, పారదర్శకత విషయంలో రాజీ వద్దు
- నూతన మంత్రులకు ప్రధాని మోదీ ఉద్బోధ

న్యూఢిల్లీ: అధికార దర్పం ప్రదర్శించకుండా వినయంగా ఉన్న నాయకులనే ప్రజలు అభిమానిస్తారని నరేంద్ర మోదీ చెప్పారు. అందుకే వినయంగా ఉండాలని నూతన మంత్రులకు సూచించారు. రుజువర్తన, పారదర్శకత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని చెప్పారు. ఆదివారం ప్రమాణ స్వీకారం చేయబోతున్న మంత్రులు, గత ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన నేతలకు మోదీ తన నివాసంలో తేనీటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనపై ప్రజలకు ఎన్నో ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయని, వాటిని నెరవేర్చడమే లక్ష్యంగా కష్టపడి పని చేయాలని అన్నారు. మీకు అప్పగించిన పనిని నిజాయతీగా పూర్తి చేయండి అని సూచించారు. పార్టీలకు అతీతంగా పార్లమెంట్ సభ్యులందరికీ తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని పేర్కొన్నారు. మంత్రులు అందరితో మర్యాదగా ప్రవర్తించాలని, ప్రభుత్వ ఉద్యోగులను, అధికారులను గౌరవించాలని చెప్పారు. అందరిని కలుపుకొనిపోవాలని, బృంద స్ఫూర్తితో పని చేయాలని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నారు.

తొలిసారి కేంద్రమంత్రి పదవి చేపట్టిన వారిలో పలువురి విశేషాలు...

'మామ'కు తొలిసారి కేంద్ర మంత్రి పదవి



నాలుగు సార్లు మధ్యప్రదేశ్ సీఎంగా చేసిన బీజేపీ సీనియర్ నేత 'మామ' శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు తొలిసారి కేంద్ర మంత్రి పదవి దక్కింది. 1977లో ఆర్‌ఎస్‌ఎస్‌లో వాలంటీర్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగారు. ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. సీఎంగా రైతులు, మహిళలు, గ్రామీణ ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేశారు. మృదు స్వభావి. నిరాడంబర నాయకుడు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో బీజేపీకి బంపర్ మెజారిటీ సాధించినా సీఎంగా కొనసాగింపు దక్కలేదు. ఆయనను పూర్తిగా పక్కన పెడతారన్న ప్రచారానికి భిన్నంగా కేంద్ర మంత్రి పదవి దక్కడం విశేషం.

నడ్డా.. వివాదాలకు దూరం



బీజేపీ జాతీయ అధ్యక్షుడు 63 ఏళ్ల జగత్ ప్రకాశ్ నడ్డా హిమాచల్ ప్రదేశ్ నుంచి కేబినెట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక నాయకుడు. ఏబీవీపీలో చురుగ్గా పనిచేశారు. బీజేపీలో పలు హోదాల్లో పలు రాష్ట్రాల్లో పనిచేశారు. 2012లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. మోదీ తొలి కేబినెట్లో 2014 నుంచి 2019 దాకా ఆరోగ్య మంత్రిగా ఉన్నారు. 2020లో బీజేపీ అధ్యక్షుడయ్యారు. వివాదరహితుడు.

మోదీ సన్నిహితుడిగా పదవీ యోగం

గుజరాత్ బీజేపీ అధ్యక్షుడు 69 ఏళ్ల చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్‌కు అనూహ్యంగా కేంద్ర మంత్రి పదవి లభించింది. నాలుగోసారి ఎంపీగా నెగ్గారు. ఈసారి ఏకంగా 7.73 లక్షల మెజార్టీ సాధించారు. మహారాష్ట్రలో జన్మించిన పాటిల్ గుజరాత్‌లో బీజేపీకి సారథ్యం వహించడం విశేషం. కానిస్టేబుల్‌గా చేసిన ఆయన 1989లో బీజేపీలో చేరారు. 1991లో నవగుజరాత్ అనే పత్రికను స్థాపించారు. 1995 నుంచి మోదీతో సాన్నిహిత్యముంది. సామాన్యులకు నిత్యం అందుబాటులో ఉంటారు.

బిహార్ దళిత తేజం



లోక్‌జనశక్తి పార్టీ(రామ్‌విలాస్) పార్టీ చీఫ్, దళిత నాయకుడు చిరాగ్ పాశ్వాన్ తన తండ్రి, దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్ వారసుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. బిహార్‌లో ఐదుకు ఐదు ఎంపీ స్థానాలూ గెలుచుకున్నారు. 41 ఏళ్ల చిరాగ్ 2011లో ఓ హిందీ సినిమాలో నటించారు. అందులో హీరోయిన్ ఈసారి బీజేపీ తరఫున తొలిసారి ఎంపీగా గెలిచిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కావడం విశేషం. చిరాగ్‌కా రోజ్‌గార్ సంస్థ ద్వారా బిహార్ యువతకు ఉపాధి కల్పించేందుకు చిరాగ్ కృషి చేస్తున్నారు.

యాక్షన్ హీరో మాస్ ఎంట్రీ

ప్రముఖ మలయాళ యాక్షన్ హీరో 65 ఏళ్ల సురేశ్ గోపి తన సొంత రాష్ట్ర కేరళలో బీజేపీ తరఫున గెలిచిన తొలి ఎంపీగా చరిత్ర సృష్టించారు. అలా మాస్ ఎంట్రీ ఇచ్చి, అదే ఊపులో కేంద్ర మంత్రి అయ్యారు! ఆయన వామపక్షాలు, కాంగ్రెస్‌కు పట్టున్న త్రిసూర్ లోక్‌సభ స్థానంలో 2019 లోక్‌సభ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా పట్టు విడవకుండా ఈసారి గెలవడం విశేషం. బీజేపీతో ఆయనకు చాలా ఏళ్లుగా అనుబంధం ఉంది. మోదీ, అమిత్ షాలకు సన్నిహితుడు. 2016లో రాజ్యసభకు నామినేటయ్యారు. 'మోదీ ఆదేశిస్తారు, నేను పాటిస్తా' అంటారు సురేశ్ గోపి.

బిహార్ ఈబీసీ నేత



ప్రముఖ సోషలిస్టు నాయకుడు, భారతరత్న కర్పూరి ఠాకూర్ కుమారుడైన రామ్‌నాథ్ ఠాకూర్ మోదీ మంత్రివర్గంలో చేరారు. జేడీ(యూ) అధినేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కు ఆయన సన్నిహితుడు. ప్రముఖ ఈబీసీ నాయకుడిగా ఎదిగారు. 74 ఏళ్ల రామ్‌నాథ్ 2014 ఏప్రిల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన తండ్రి కర్పూరి ఠాకూర్ రెండు సార్లు బిహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

ప్రతాప్ జాదవ్

64 ఏళ్ల జాదవ్‌కు శివసేన కోటాలో చోటు దక్కింది. నాలుగుసార్లు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎంపీగా లోక్‌సభలో పలు చర్చల్లో చురుగ్గా పాలుపంచుకున్నారు.

ఒకప్పటి చురుకైన విద్యార్థి నేత..

సంజయ్ సేథ్ (64) జార్ఖండ్‌కు చెందిన వ్యాపారవేత్త. 1976లో ఏబీవీపీ నేతగా ప్రస్థానం ప్రారంభించి అనేక సమస్యలపై జైలుకూ వెళ్లారు. ఈయనను 2016లో జార్ఖండ్ ప్రభుత్వం ఖాదీ గ్రామోద్యోగ్ బోర్డు చైర్మన్‌గా నియమించడం వివాదానికి దారితీసింది. 2019లో తొలిసారి రాంచీ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నేత సుబోధ్ కాంత్ సహాయ్‌ను, తాజా ఎన్నికల్లో ఆయన కుమార్తె యశస్వినిని ఓడించారు!

గిరిజన నేత ఉయికె

మధ్యప్రదేశ్‌కు చెందిన గిరిజన నేత దుర్గా దాస్ ఉయికె(58). తాజా ఎన్నికల్లో బెతుల్(ఎస్‌టీ) నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున వరుసగా రెండోసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే స్కూల్‌లో ఈయన టీచర్‌గా పనిచేసేవారు. 2019లో బీజేపీలో చేరి మొదటిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన రాము టేకంపై 3.79 లక్షల మెజారిటీతో విజయం సాధించారు. కుల సమీకరణాల ఆధారంగానే తాజాగా కేంద్రంలో సహాయ మంత్రి పదవి ఈయన్ను వరించిందని భావిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

జిల్లా పంచాయతీ సభ్యురాలి నుంచి కేంద్రమంత్రిగా



ఇటీవలి ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని ధార్ లోక్‌సభ నియోజకవర్గం (ఎస్‌టీ)నుంచి సావిత్రీ ఠాకూర్(46) ఎన్నికయ్యారు. 2003లో మొదటిసారిగా జిల్లా పంచాయతీ సభ్యురాలిగా ఈమె రాజకీయ ప్రస్థానం మొదలైంది. పార్టీలో వివిధ పదవులను రాష్ట్రం, జాతీయ స్థాయిలో నిర్వహించిన సావిత్రీ ఠాకూర్ మధ్యప్రదేశ్‌లో ప్రముఖ గిరిజన మహిళా నేతగా ఎదిగారు. 2014లో మొదటిసారిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2019లో బీజేపీ ఆమెకు టిక్కెటివ్వలేదు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రాధేశ్యామ్ ముువెల్‌పై 2.18లక్షల ఓట్ల తేడాతో విజయం సాధించారు.

రెండుసార్లు భావ్‌నగర్ మేయర్..



తాజా లోక్‌సభకు గుజరాత్ నుంచి ఎన్నికైన ముగ్గురు మహిళల్లో నిముబెన్ బంభానియా(57) ఒకరు. భావ్‌నగర్ నుంచి ఆప్ అభ్యర్థి ఉమేశ్ మక్వానాపై 4.55 లక్షల భారీ మెజారిటీతో ఈమె విజయం సాధించారు. 2009-10, 2015-18 సంవత్సరాల్లో భావ్‌నగర్ మేయర్‌గా రెండు సార్లు పనిచేశారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలిగా 2013 నుంచి 2021 వరకు బాధ్యతల్లో ఉన్నారు. కోలీ వర్గానికి చెందిన మాజీ ఉపాధ్యాయిని అయిన నిముబెన్ 2004లో బీజేపీ కండువా కప్పుకున్నారు. అదే ఏడాదిలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది రాజకీయ జీవితం ప్రారంభించారు.

సినీ నిర్మాత.. రాజకీయ నేత




రెండు సాంస్కృతిక మేగజీన్‌లకు ఎడిటర్‌గా ఉన్న పబిత్రా మర్గెరిటా(49)..అస్సామీస్ ఫీచర్, షార్ట్ ఫిల్మ్‌లను నిర్మించారు. జున్‌బాయ్ సిరీస్‌తో తీసిన తక్కువ నిడివి కలిగిన చిత్రాలకు ఎంతో పేరు వచ్చింది. ఈయన నటించిన ఫీచర్ ఫిల్మ్ 'మొన్ జాయ్' పలువురి ప్రశంసలు అందుకుంది. ప్రముఖ అస్సామీ నటి గాయత్రి మహంతాను పెళ్లి చేసుకున్నారు. 2014లో బీజేపీలో చేరి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2022 మార్చిలో రాజ్యసభకు ఎన్నికయ్యారు.

వీరేంద్ర కుమార్

మధ్యప్రదేశ్‌లో షెడ్యూల్డ్ కులానికి చెందిన బీజేపీ సీనియర్ నేత వీరేంద్ర కుమార్(70). ఎనిమిదిసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. చిన్నతనంలో తండ్రి నడిపే సైకిల్ షాపులో పంక్చర్లు వేశారు. అంచెలంచెలుగా ఎదిగి బాల కార్మికుల వెతలే అంశంగా పీహెచ్‌డీ చేయడం విశేషం. 2017లో మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి అయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో 16 నెలలపాటు జైలు శిక్ష అనుభవించారు. ఇప్పటికీ సొంతూళ్లో స్కూటర్‌పై తిరుగుతూ సైకిల్ రిపేర్ దుకాణదారులతో ముచ్చటిస్తుంటారు.

మాంఝీకి దక్కిన ఫలితం



బిహార్ రాజకీయాల్లో సుపరిచితుడు జితన్ రాం మాంఝీ(80). మాజీ సీఎం. హిందుస్తానీ అవామ్ మోర్చా(సెక్యులర్) వ్యవస్థాపకుడు. 2014 నితీశ్ కుమార్ వైదొలగడంతో సీఎం అయినా ఆయనతో విభేదాలతో కొద్దినెలలకే తప్పుకుని సొంత పార్టీ పెట్టారు. కాంగ్రెస్‌తో మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం జనతాదళ్, ఆర్జేడీ, జేడీయూల్లో సాగింది.

రెండుసార్లు సీఎం.. నేడు కేంద్ర మంత్రి




మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ కుమారుడు కుమారస్వామి (64). ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బీజేపీ, కాంగ్రెస్‌లతో వేర్వేరుగా జట్టుకట్టి రెండుసార్లు కర్నాటక సీఎంగా చేశారు. జేడీఎస్ అధ్యక్షుడు. కర్ణాటకలోని పలుకుబడి గత వొక్కలిగ వర్గానికి చెందిన నేత. సినిమాలంటే తెగపిచ్చి. అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చానని చెబుతుంటారు!

టంటా.. ఉత్తరాఖండ్ సీనియర్ నేత

ఉత్తరాఖండ్‌కు చెందిన సీనియర్ బీజేపీ ఎంపీ అజయ్ టంటా(51). అల్మోరా నుంచి వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు. అంతకుపూర్వం, 2009లో తన చిరకాల ప్రత్యర్థి కాంగ్రెస్ నేత ప్రదీప్ టంటా చేతిలో ఓటమి చవిచూశారు. ఆ తర్వాత 2014, 2019, 2024 ఎన్నికల్లో ప్రదీప్‌పై వరుస విజయాలు సాధించడం గమనార్హం. 2014లో టెక్స్‌టైల్స్ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2007, 2012 ఎన్నికల్లో రెండుసార్లు రాష్ట్ర శాసనసభకు సైతం ఎన్నికయ్యారు. 2007లో రాష్ట్రమంత్రిగా ఉన్నారు. 23 ఏళ్లకే రాజకీయాల్లోకి ప్రవేశించి పంచాయతీ స్థాయిలో చురుగ్గా అనేక ఏళ్లపాటు పనిచేశారు. వివాదరహితుడిగా, స్వచ్ఛమైన నేతగా పేరుంది.

ఖట్టర్.. ప్రచారక్ నుంచి కేంద్ర మంత్రి




1977లో ఆర్‌ఎస్‌ఎస్ శాశ్వత సభ్యుడిగా మారిన మనోహర్ లాల్ ఖట్టర్(70)కు ఆ సంస్థతో దాదాపు 40 ఏళ్ల అనుబంధం ఉంది. బ్రహ్మచారి. మోదీకి సన్నిహితునిగా పేరుంది. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన 2014లో హరియాణా సీఎం అయ్యారు. పదేళ్ల అనంతరం గత మార్చిలో నాయబ్ సింగ్ సైనీకి బాధ్యతలు అప్పగించారు. దేశ విభజన సమయంలో పాకిస్తాన్ నుంచి ఈయన కుటుంబం వలస వచ్చి 1954లో హరియాణాలోని రోహతక్ జిల్లా నిందానలో స్థిరపడింది.

ఓరం.. ఒడిశా గిరిజన నేత

63 ఏళ్ల జువల్ ఓరమ్‌ఒడిశాలో గిరిజన నేతగా ఎంతో పేరుంది. వాజ్‌పేయీ కేబినెట్‌లో గిరిజన సంక్షేమ శాఖకు తొలి మంత్రిగా చరిత్ర నెలకొల్పారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. మూడుసార్లు ఒడిశా బీజేపీ చీఫ్‌గా చేశారు.

రాజీవ్ రతన్ సింగ్ 'లలన్'



లలన్ సింగ్‌గా సుపరిచితుడు. 69 ఏళ్ల ఈ నేత బిహార్‌లో పలుకుబడి కలిగిన భూమిహార్ వర్గానికి చెందిన నేత. నితీశ్ కుమార్‌కు అత్యంత సన్నిహితుడు. 2009, 2019, 2024 ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైనప్పటికీ రాజ్యసభకు నితీశ్ కుమార్ ఈయన్ను జేడీయూ తరఫున నామినేట్ చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సహాయ మంత్రి మాకొద్దు: ఎన్సీపీ

న్యూఢిల్లీ: కొత్తగా ఏర్పాటైన ఎన్డీఏ ప్రభుత్వంలో బీజేపీ ఇవ్వజూపిన సహాయమంత్రి (స్వతంత్ర హోదా) పదవిని భాగస్వామ్య పార్టీ ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ తిరస్కరించారు. కేంద్రంలో ఇప్పటికే ఒకసారి కేబినెట్ మంత్రిగా పనిచేసిన తాను సహాయమంత్రి పదవిని తీసుకోవడం అంటే స్థాయిని తగ్గించుకోవడమేనని ప్రఫుల్ పటేల్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని బీజేపీ అగ్ర నాయకత్వానికి తెలపగా మరో ప్రత్యామ్నాయం దొరికే వరకు వేచి ఉండాలని తనను కోరారని వివరించారు. భవిష్యత్తులో జరిగే విస్తరణలో ఎన్సీపీకి కేబినెట్ హోదా పదవి లభిస్తుందని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ చెప్పారు. పార్లమెంట్‌లో ఎన్సీపీకి ఇద్దరు సభ్యులున్నారు. ప్రఫుల్ పటేల్ రాజ్యసభలో, సునీల్ తత్కారే లోక్‌సభలో సభ్యులుగా ఉన్నారు.

బీజేపీకి కొత్త సారథి ఎవరో?

న్యూఢిల్లీ: అధికార బీజేపీ తదుపరి అధ్యక్షుడెవరనేది హాట్ టాపిక్‌గా మారింది. ఆదివారం ప్రమాణం చేసిన ప్రధాని మోదీ సారథ్యంలోని కేబినెట్‌లో ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా ఉండటం తెల్సిందే. నడ్డాతోపాటు బీజేపీ సీనియర్ నేతలు భూపేందర్ యాదవ్, శివరాజ్ సింగ్ చౌహాన్, ధర్మేంద్ర ప్రధాన్ కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. దీంతో, తాజా ఎన్నికల్లో నెగ్గిన మాజీ మంత్రులు కొందరిని పార్టీ పదవుల్లోకి తీసుకోవచ్చనే చర్చ జరుగుతోంది. వీరిలో అధ్యక్ష పదవి ఎవరిని వరించనుందనే విషయం చర్చనీయాంశమైంది. బీజేపీ చీఫ్‌గా నడ్డా పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈయన 2020లో అమిత్ షా నుంచి పార్టీ పగ్గాలు చేపట్టారు. అంతకు ముందు పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన మంత్రుల్లో నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ ఉన్నారు.

మోదీ ప్రమాణ స్వీకారానికి ట్రాన్స్‌జెండర్లు, పారిశుధ్య కార్మికులు, కూలీలు

న్యూఢిల్లీ: మోదీ ప్రమాణ స్వీకారానికి భిన్న వర్గాల ప్రజలు హాజరయ్యారు. ట్రాన్స్‌జెండర్లు, పారిశుధ్య కార్మికులతోపాటు నూతన పార్లమెంట్ భవన నిర్మాణంలో పాలుపంచుకున్న కూలీలు సైతం హాజరుకావడం విశేషం. ప్రమాణ స్వీకారం కంటే ముందు ట్రాన్స్‌జెండర్లను కేంద్ర మాజీ మంత్రి వీరేంద్ర కుమార్, పారిశుధ్య కార్మికులను బీజేపీ ఎంపీ గజేంద్రసింగ్ షెకావత్ ఘనంగా సత్కరించారు. 'సబ్‌కా సాత్ సబ్‌కా విశ్వాస్ సబ్‌కా ప్రయాస్' అంటూ ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును అందిపుచ్చుకుంటూ ట్రాన్స్‌జెండర్లను సత్కరించినట్లు వీరేంద్ర కుమార్ తెలిపారు.

ఒడిశా సీఎంగా సురేశ్ పూజారి?

ఢిల్లీకి రావాలంటూ అధిష్టానం పిలుపు

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో దాదాపు 24 ఏళ్లకు బీజేపీ గెలుపు సొంతం చేసుకోవడం తెల్సిందే. ముఖ్యమంత్రి కుర్చీని అధిరోహించేదెవరన్న విషయంలో మాత్రం సందిగ్ధం కొనసాగుతోంది. అయితే, సీనియర్ నేత, తాజాగా ఎమ్మెల్యే సురేశ్ పూజారిని పార్టీ హైకమాండ్ ఢిల్లీకి రావాలంటూ కబురు పంపించింది. దీంతో, సీఎం పదవి ఆయనకే దక్కవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. శాసనసభా పక్ష నేత ఎవరనేది అధిష్టానమే చూసుకుంటుందని రాష్ట్ర వర్గాలు అంటున్నాయి. ఇలా ఉండగా, ప్రధానమంత్రి బిజీ షెడ్యూల్ దృష్ట్యా కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ఈ నెల 10కి బదులుగా 12న చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

క్రియాశీల రాజకీయాలకు గుడ్ బై: వీకే పాండ్యన్

ఒడిశా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేడీ ఘోర ఓటమి చవిచూడటంతో క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు మాజీ అధికారి, ఆ పార్టీ నేత వీకే పాండ్యన్ ప్రకటించారు. బీజేడీ చీఫ్ నవీన్ పట్నాయక్‌కు సాయంగా ఉండేందుకు మాత్రమే రాజకీయాల్లోకి వచ్చినట్లు ఆయన ఆదివారం విడుదల చేసిన ఒక వీడియోలో పేర్కొన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదని చెప్పారు.

ఒకే రన్‌వేపైకి రెండు విమానాలు

ముంబై: ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఇండిగో విమానం ల్యాండైన రన్‌వేపైనే కేవలం నిమిషంలోపే ఎయిరిండియా విమానం టేకాఫ్ తీసుకుంది. శనివారం జరిగిన ఈ ఘటనను డీజీసీఏ సీరియస్‌గా పరిగణించింది.ఘటన సమయంలో బాధ్యతల్లో ఉన్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్(ఏటీసీ)ను విధుల నుంచి తొలగించింది. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టినట్లు డీజీసీఏ ఆదివారం తెలిపింది. ఒక విమానం ల్యాండవటం, మరో విమానం అదే రన్‌వే నుంచి టేకాఫ్ తీసుకుంటున్నట్లుగా ఉన్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో డీజీసీఏ షేర్ చేసింది. కాగా, ఏటీసీ సూచనల మేరకే తమ పైలట్ విమానాన్ని ల్యాండ్ చేసినట్లు ఇండిగో విమానయాన సంస్థ తెలిపింది.

పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా

నీట్ లీకేజీపై బాధిత విద్యార్థులకు రాహుల్ భరోసా

న్యూఢిల్లీ: నీట్ -యూజీ మెడికల్ ప్రవేశ పరీక్షలో అవకతవకల వ్యవహారం దేశంలోని 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో పడేసిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో బాధిత విద్యార్థుల గొంతుకనవుతానన్నారు. లీకేజీ ఆరోపణలతో ప్రశ్నార్థకంగా మారిన విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానన్నారు. ఆదివారం 'ఎక్స్'లో రాహుల్ గాంధీ...'నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం కూడా చేయకమునుపే నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థులు, వారి కుటుంబాల ఆశలు గల్లంతయ్యాయి. ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులు గరిష్ట మార్కులు సాధించి, టాప్ ర్యాంకు సాధించారు. ఇలాంటిది సాంకేతికంగా అసాధ్యం. కానీ, పేపర్ లీక్ కాలేదంటూ ప్రభుత్వం పదేపదే అంటోంది. దీని వెనుక మాఫియా, ప్రభుత్వ యంత్రాంగం కుట్ర ఉంది. ఇలాంటి వాటి గుట్టురట్టు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వద్ద పక్కా ప్రణాళిక ఉంది. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు మా పార్టీ ప్రత్యేకంగా చట్టం తీసుకువస్తుంది. మీ భవితకు సంబంధించిన అన్ని అంశాలపై పార్లమెంట్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తా. మీ గొంతుకనై ప్రశ్నిస్తా'అని విద్యార్థులకు రాహుల్ హామీ ఇచ్చారు.

తీర్థయాత్రికుల బస్సుపై కాల్పులు.. 9 మంది మృతి..33 మందికి గాయాలు

కశ్మీర్‌లో ఉగ్రమూకల దుశ్చర్య

జమ్మూ: తీర్థయాత్రికులతో వెళ్తున్న బస్సుపైకి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. డ్రైవర్ గాయపడటంతో అదుపు తప్పి బస్సు లోయలో పడిపోయింది. ఘటనలో 9 మంది తీర్థయాత్రికులు చనిపోగా మరో 33 మంది తీవ్రంగా గాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లాలో ఆదివారం సాయంత్రం 6.15 గంటల సమయంలో చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 53 మంది యాత్రికుల బస్సు శివ్ ఖోరి నుంచి కాట్రాలోని మాతా వైష్ణోదేవి ఆలయం వైపు వెళుతోంది. పోని ఏరియాలో టెర్యాత్ గ్రామం వద్ద బస్సుపైకి ఉగ్రవాదులు హఠాత్తుగా కాల్పులకు దిగారు. కాల్పుల్లో డ్రైవర్ గాయపడటంతో బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
10-6-2024



12 భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన 12వ దేశంగా అమెరికా గుర్తింపు పొందింది. 1952లో భారత్‌లో తొలిసారి పాక్ జట్టు ఆడగా... 1955లో పాకిస్తాన్‌లో భారత జట్టు ఆడింది. ఆ తర్వాత ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్‌లకు యూఏఈ (1984లో), ఆస్ట్రేలియా (1985లో), బంగ్లాదేశ్ (1988లో), సింగపూర్ (1996లో), కెనడా (1996లో), శ్రీలంక (1997లో), ఇంగ్లండ్ (1999లో), దక్షిణాఫ్రికా (2003లో), నెదర్లాండ్స్ (2004లో), అమెరికా (2024లో) ఆతిథ్యమిచ్చాయి.

1 విరాట్ కోహ్లి అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేశాక భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన టి20 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో టాప్ స్కోరర్‌గా నిలవకపోవడం ఇదే తొలిసారి. గతంలో భారత్, పాక్ జట్ల మధ్య జరిగిన టి20 ప్రపంచ కప్ మ్యాచ్‌ల్లో కోహ్లి (2012లో: 78 నాటౌట్), (2014లో 36 నాటౌట్), (2016లో 55 నాటౌట్), (2021లో 57), (2022లో 82 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.



1 టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లో భారత ఇన్నింగ్స్‌లో ఇద్దరు ప్లేయర్లు 'గోల్డెన్ డక్' (ఆడిన తొలి బంతికే అవుటవ్వడం) కావడం ఇదే తొలిసారి.

1 టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగాక ఆలౌట్ కావడం భారత జట్టుకిదే తొలిసారి.

విజేత సుమిత్

పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారు!



హేల్‌బ్రోన్ (జర్మనీ): భారత టెన్నిస్ నంబర్ వన్ సుమిత్ నగాల్ కెరీర్‌లో ఆరో ఏటీపీ చాలెంజర్ సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన నెకర్ కప్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీలో సుమిత్ చాంపియన్‌గా అవతరించాడు. 2 గంటల 41 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో ప్రపంచ 95వ ర్యాంకర్ సుమిత్ 6–1, 6–7 (5/7), 6–3తో ప్రపంచ 184వ ర్యాంకర్ అలెగ్జాండర్ రిషార్డ్ (స్విట్జర్లాండ్)పై విజయం సాధించాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయిన భారత స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. ఈ విజయంతో సుమిత్‌కు 16,550 యూరోల (రూ. 14 లక్షల 96 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. తాజా టైటిల్‌తో సుమిత్ 77వ ర్యాంక్‌కు చేరుకునే అవకాశముంది. అంతేకాకుండా వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు కూడా అతనికి బెర్త్ దాదాపు ఖరారు కానుంది.

భారత ఫుట్‌బాల్ జట్టు కొత్త కెప్టెన్‌గా గుర్‌ప్రీత్

రేపు ఖతర్ జట్టుతో కీలక మ్యాచ్



దోహా: అంతర్జాతీయ కెరీర్‌కు రెగ్యులర్ కెప్టెన్ సునీల్ ఛెత్రి వీడ్కోలు పలకడంతో భారత ఫుట్‌బాల్ జట్టు పగ్గాలను గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూకు అప్పగించారు. ప్రపంచకప్–2026 ఆసియా జోన్ రెండో రౌండ్ క్వాలిఫయర్స్‌లో భాగంగా మంగళవారం దోహాలో ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో భారత్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గుర్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇప్పటికే దోహా చేరుకున్న భారత జట్టు ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా క్వాలిఫయర్స్ మూడో రౌండ్‌కు అర్హత పొందాలంటే ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాలి. పంజాబ్‌కు చెందిన గుర్‌ప్రీత్ 2011లో తొలిసారి భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటి వరకు అతను 72 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్ తరఫున బరిలోకి దిగాడు.

న్యూయార్క్‌లో నమో భారత్

పాకిస్తాన్‌పై టీమిండియా మరో విజయం

6 పరుగులతో నెగ్గిన రోహిత్ సేన • రాణించిన పంత్, బుమ్రా

పాకిస్తాన్‌తో ప్రపంచకప్ పోరు... భారత్ చేసింది 119 పరుగులే... బ్యాటింగ్‌కు అనుకూలించని పిచ్ అయినా సరే ఈ మాత్రం స్కోరును కాపాడుకోవడం కష్టంగానే అనిపించింది... లక్ష్యం ఎదురుగా కనిపిస్తుండగా... పాక్ నెమ్మదిగా అడుగులు వేసింది. 12 ఓవర్లు ముగిసేసరికి బంతికో పరుగు చొప్పున 72 పరుగులు వచ్చేశాయి. మిగిలిన 48 బంతుల్లో చేయాల్సింది 48 పరుగులే... చేతిలో 8 వికెట్లున్నాయి. కానీ అప్పుడు ఒక్కసారిగా మ్యాచ్ మలుపు తిరిగింది. పాండ్యా, బుమ్రా బౌలింగ్ దెబ్బకు పాక్ పరుగు తీయడమే గగనంగా మారిపోయింది. ఒక్కో పరుగు కోసం శ్రమించి ఆ జట్టు వరుసగా వికెట్లూ కోల్పోయింది. అద్భుతమైన ఆటతో ఒత్తిడి పెంచిన భారత్ చివరి వరకు దానిని కొనసాగించింది. ఫలితంగా వరల్డ్ కప్‌లో మరో విజయం మన ఖాతాలో చేరింది. పాక్‌పై మనదే పైచేయి అని నిరూపితమైంది. బ్యాటింగ్‌లో కఠిన పరిస్థితుల్లో కీలక పరుగులు చేసిన పంత్, కీపింగ్‌లో చక్కటి క్యాచ్‌లతో గెలిపించాడు. మ్యాచ్ ఏకపక్షంగా సాగకపోయినా... ఉత్కంఠకు లోటు లేకపోయింది. వరల్డ్ కప్ మెల్‌బోర్న్ నుంచి న్యూయార్క్‌కు చేరినా... అక్కడా మన గెలుపు పిలుపు వినిపించింది.



బుమ్రా సంబరం

న్యూయార్క్: టి20 ప్రపంచకప్‌లో ఆసక్తి రేపిన మ్యాచ్‌లో భారత్ 6 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌటైంది. రిషభ్ పంత్ (31 బంతుల్లో 42; 6 ఫోర్లు) కీలక పరుగులు సాధించాడు. అనంతరం పాక్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 113 పరుగులే చేయగలిగింది. రిజ్వాన్ (44 బంతుల్లో 31; 1 ఫోర్, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బుమ్రా (3/14), హార్దిక్ పాండ్యా (2/24) ప్రత్యర్థిని పడగొట్టారు.

పంత్ మినహా...

అనూహ్యంగా దూసుకొస్తున్న బంతులు, బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలంగా లేని పిచ్, నెమ్మదైన అవుట్‌ఫీల్డ్... అన్నీ వెరసి భారత ఆటగాళ్లు ప్రతీ పరుగు కోసం ఇబ్బంది పడ్డారు. పాక్ బౌలర్లంతా కట్టుదిట్టమైన బంతులతో బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. ఓపెనర్లు కోహ్లి (4), రోహిత్ శర్మ (13) ఏడు పరుగుల వ్యవధిలో వెనుదిరగ్గా... నాలుగో స్థానంలో వచ్చిన అక్షర్ (18 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఈ దశలో పంత్ బాధ్యత తీసుకున్నాడు. సాధారణ షాట్లకు పరుగులు రాలేని స్థితిలో తనదైన శైలిలో భిన్నమైన షాట్లతో స్కోరును నడిపించాడు. ఈ క్రమంలో అతనికి అదృష్టం కూడా కలిసొచ్చింది. తన తొలి 14 బంతుల్లో 4 సార్లు పంత్ అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. పాక్ వదిలిన క్యాచ్‌లు సుయాయాసమైనవి కాకపోయినా అసాధ్యమైనవి కూడా కాదు! రవూఫ్ ఓవర్లో అతను వరుసగా 3 ఫోర్లతో ధాటిని ప్రదర్శించగా, 89/3 వద్ద భారత్ కాస్త మెరుగైన స్థితిలో కనిపించింది. అయితే ఇక్కడి నుంచి జట్టు ఒక్కసారిగా కుప్పకూలింది. సూర్యకుమార్ (7) ప్రభావం చూపలేకపోగా, దూబే (3) విఫలమయ్యాడు. పంత్, జడేజా (0) వరుస బంతుల్లో వెనుదిరగ్గా... పాండ్యా (7), బుమ్రా (0) కూడా వరుస బంతుల్లో అవుటయ్యారు. అర్‌‌ష్దీప్ (9) రనౌట్‌తో మరో ఓవర్ మిగిలి ఉండగానే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది.

టపటపా...

స్వల్ప లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ కూడా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయలేకపోయింది. తడబడుతూనే ఆడిన బాబర్ ఆజమ్ (13) ఆరంభంలోనే వెనుదిరగ్గా... ఉస్మాన్ ఖాన్ (13), ఫఖర్ జమాన్ (13) కూడా విఫలమయ్యారు. కొన్ని చక్కటి షాట్లు ఆడిన రిజ్వాన్‌ను కీలక సమయంలో బుమ్రా బౌల్డ్ చేయడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. షాదాబ్ (4), ఇఫ్తికార్ (5) ప్రభావం చూపలేకపోగా, ఇమాద్ వసీమ్ (23 బంతుల్లో 15; 1 ఫోర్) బంతులు వృథా చేసి జట్టు ఓటమిని ఆహ్వానించాడు.



పంత్



హార్దిక్, రోహిత్

వర్షంతో అంతరాయం

మ్యాచ్‌కు అనూహ్యంగా వర్షం దెబ్బ పడింది. చిరుజల్లులు కురవడంతో టాస్ ఆలస్యం కాగా, నిర్ణీత సమయంకంటే 50 నిమిషాలు ఆలస్యంగా మ్యాచ్ మొదలైంది. అయితే భారత్ ఇన్నింగ్స్‌లో ఒక్క ఓవర్ పూర్తి కాగానే మళ్లీ వాన రావడంతో ఆటను నిలిపివేశారు. మరో 35 నిమిషాల తర్వాత ఇన్నింగ్స్ కొనసాగింది. విరామం తర్వాత నసీమ్ వేసిన తొలి ఓవర్లోనే కోహ్లి వెనుదిరగడంతో భారత్‌కు నిరాశాజనక ఆరంభం లభించింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రవూఫ్ (బి) అఫ్రిది 13; కోహ్లి (సి) ఉస్మాన్ (బి) నసీమ్ 4; పంత్ (సి) బాబర్ (బి) ఆమిర్ 42; అక్షర్ (బి) నసీమ్ 20; సూర్యకుమార్ (సి) ఆమిర్ (బి) రవూఫ్ 7; దూబే (సి అండ్ బి) నసీమ్ 3; పాండ్యా (సి) ఇఫ్తికార్ (బి) రవూఫ్ 7; జడేజా (సి) ఇమాద్ (బి) ఆమిర్ 0; అర్‌‌ష్దీప్ (రనౌట్) 9; బుమ్రా (సి) ఇమాద్ (బి) రవూఫ్ 0; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19 ఓవర్లలో ఆలౌట్) 119. వికెట్ల పతనం**: 1–12, 2–19, 3–58, 4–89, 5–95, 6–96, 7–96, 8–112, 9–112, 10–119. **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 4–0–29–1, నసీమ్ షా 4–0–21–3, ఆమిర్ 4–0–23–2, ఇఫ్తికార్ 1–0–7–0, ఇమాద్ 3–0–17–0, రవూఫ్ 3–0–21–3.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: రిజ్వాన్ (బి) బుమ్రా 31; బాబర్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 13; ఉస్మాన్ (ఎల్బీ) (బి) అక్షర్ 13; ఫఖర్ (సి) పంత్ (బి) పాండ్యా 13; ఇమాద్ (సి) పంత్ (బి) అర్‌‌ష్దీప్ 15; షాదాబ్ (సి) పంత్ (బి) పాండ్యా 4; ఇఫ్తికార్ (సి) అర్‌‌ష్దీప్ (బి) బుమ్రా 5; అఫ్రిది (నాటౌట్) 0; నసీమ్ షా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 113. వికెట్ల పతనం:** 1–26, 2–57, 3–73, 4–80, 5–88, 6–102, 7–102. **బౌలింగ్:** అర్‌‌ష్దీప్ 4–0–31–1, సిరాజ్ 4–0–19–0, బుమ్రా 4–0–14–3, పాండ్యా 4–0–24–2 జడేజా 2–0–10–0, అక్షర్ పటేల్ 2–0–11–1.

విండీస్‌కు భారీ విజయం

అకీల్ హోసేన్ స్పిన్‌కు ఉగాండా 39 ఆలౌట్ • 134 పరుగుల తేడాతో జయభేరి



అకీల్ హోసేన్

గయానా: టి20 ప్రపంచకప్‌లో క్రికెట్ కూన ఉగాండాపై మాజీ చాంపియన్, ఆతిథ్య వెస్టిండీస్ భారీ విజయాన్ని నమోదు చేసింది. ఎడంచేతి వాటం స్పిన్నర్ అకీల్ హోసేన్ (4–0–11–5) స్పెల్‌కు ఉగాండా బ్యాటర్లు కకావికలమయ్యారు. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేపట్టిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. ఓపెనర్లలో బ్రాండన్ కింగ్ (13) విఫలమైనా... జాన్సన్ చార్లెస్ (42 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కుదురుగా ఆడాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పూరన్ (17 బంతుల్లో 22; 3 సిక్స్‌లు), కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (18 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్), రూథర్‌ఫర్డ్ (16 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్) ఇరవై పైచిలుకు స్కోరే చేశారు. ఆఖర్లో రసెల్ (17 బంతుల్లో 30 నాటౌట్; 6 ఫోర్లు) బౌండరీలతో కరీబియన్ జట్టు చెప్పుకోదగ్గ స్కోరు చేయగలిగింది. బ్రియాన్ మసబా 2 వికెట్లు తీయగా, రమ్‌జని, క్యెవుటా, దినేశ్ నక్రాని తలా ఒక వికెట్ తీశారు. అనంతరం ఉగాండా 12 ఓవర్లలో 39 పరుగులకే కుప్పకూలింది. ఎనిమిదో వరుస బ్యాటర్ వరకు ఎవరు కూడా కనీసం 6 పరుగులకు మించి చేయలేకపోయారు. తొమ్మిదో వరుస బ్యాటర్ జుమా మియాగి (13) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచే అకీల్ హోసేన్ స్పిన్ ఉచ్చు బిగించాడు. తన మాయాజాలాన్ని స్పెల్ ఆసాంతం కొనసాగించడంతో ఉగాండా అత్యల్ప స్కోరుకే ఆలౌటైంది. అల్జారి జోసెఫ్‌కు 2 వికెట్లు దక్కాయి. అకీల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది. ఉగాండా చేసిన ఈ అత్యల్ప స్కోరు (39)తో నెదర్లాండ్స్ జట్టు సరసన నిలిచింది. టి20 ప్రపంచకప్‌ల చరిత్రలో ఇది ఉమ్మడి అత్యల్ప స్కోరు! 2014లో శ్రీలంక కూడా నెదర్లాండ్స్‌ను 39 పరుగులకే కూల్చేసింది.

ఆసీస్ ఆల్‌రౌండ్ గెలుపు

రాణించిన డేవిడ్ వార్నర్, జంపా



వార్నర్

బ్రిడ్జ్‌టౌన్: ఆస్ట్రేలియా బ్యాటర్లలో ఏ ఒక్కరు కూడా 40 పరుగులు చేయలేదు. బౌలర్లలో 2 వికెట్లకు మించి తీయలేదు! అయినా సరే డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఓడించింది. గ్రూప్ 'బి'లో శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన పోరులో ఆసీస్ 36 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ నెగ్గిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగులు చేసింది. వార్నర్ (16 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (25 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), హెడ్ (18 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్టొయినిస్ (17 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. జోర్డాన్ 2 వికెట్లు తీశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 165 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ బట్లర్ (28 బంతుల్లో 42; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), సాల్ట్ (23 బంతుల్లో 37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఓపెనింగ్ వికెట్‌కు 7.1 ఓవర్లలో 73 పరుగులు జోడించి మెరుపు ఆరంభమిచ్చినా... తర్వాత వచ్చిన జాక్స్ (10), బెయిర్‌స్టో (7), లివింగ్‌స్టోన్ (15)ల వైఫల్యం జట్టును ఓడించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆడమ్ జంపా, కమిన్స్ చెరో 2 వికెట్లు తీశారు. ఈ తాజా ఫలితం ఇంగ్లండ్‌కు 'సూపర్–8'ను క్లిష్టం చేసింది. స్కాట్లాండ్‌తో మ్యాచ్ రద్దవడం, ఈ మ్యాచ్‌లో ఓడటంతో గ్రూప్‌లో ఇంగ్లండ్ ఒక పాయింట్‌తో నాలుగో స్థానంలో ఉంది. ఆసీస్ (4), స్కాట్లాండ్ (3) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఇంగ్లండ్ ఒకవేళ నమీబియా, ఒమన్‌లపై గెలిచినా ముందుకెళ్లాలంటే ఇతర జట్ల సమీకరణాలపై ఆధారపడాల్సి ఉంటుంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X బంగ్లాదేశ్

వేదిక: న్యూయార్క్ ; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

'ఫ్రెంచ్ కింగ్' అల్‌కరాజ్

ఫైనల్ చేరిన తొలిసారే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన స్పెయిన్ స్టార్

- ఐదు సెట్‌ల తుది సమరంలో జ్వెరెవ్‌పై అద్భుత విజయం
- కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కైవసం
- రూ. 21 కోట్ల 71 లక్షల ప్రైజ్‌మనీ సొంతం




మట్టి కోర్టులపై కొత్త యువరాజు వచ్చాడు. ఇప్పటికే పచ్చిక కోర్టులపై, హార్డ్ కోర్టులపై గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన స్పెయిన్ యువతార కార్లోస్ అల్‌కరాజ్ మట్టి కోర్టులపై కూడా తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన తొలిసారే అల్‌కరాజ్ చాంపియన్‌గా అవతరించాడు. ఈ క్రమంలో పలు రికార్డులు నెలకొల్పాడు. మరోవైపు కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలని ఆశించిన జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు రెండోసారీ నిరాశే ఎదురైంది. 2020 యూఎస్ ఓపెన్ ఫైనల్లో ఐదు సెట్‌లలో డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) చేతిలో ఓడిపోయిన జ్వెరెవ్ ఈసారి ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్ చేతిలో ఐదు సెట్‌ల సమరంలో పరాజయం చవిచూశాడు.

ఫైనల్ గణాంకాలు

అల్‌కరాజ్		జ్వెరెవ్
3	ఏస్‌లు	8
6	డబుల్ ఫాల్ట్‌లు	6
9	బ్రేక్ పాయింట్లు	6
52	విన్నర్స్	38
56	అనవసర తప్పిదాలు	41
25	నెట్ పాయింట్లు	30
20	డ్రాప్ షాట్‌లు	10
153	మొత్తం పాయింట్లు	139

పారిస్: అంచనాలకు అనుగుణంగా ఆద్యంతం పట్టుదల కోల్పోకుండా ఆడిన స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఆదివారం ముగిసిన టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 21 ఏళ్ల అల్‌కరాజ్ చాంపియన్‌గా అవతరించాడు. 4 గంటల 19 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ 6–3, 2–6, 5–7, 6–1, 6–2తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై విజయం సాధించాడు. విజేతగా నిలిచిన అల్‌కరాజ్‌కు 24 లక్షల యూరోలు (రూ. 21 కోట్ల 71 లక్షలు), రన్నరప్ జ్వెరెవ్‌కు 12 లక్షల యూరోలు (రూ. 10 కోట్ల 84 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన ఇద్దరు స్టార్ ఆటగాళ్ల మధ్య జరిగిన సమరం హోరాహోరీగా సాగింది. తొలి సెట్‌లో అల్‌కరాజ్ పైచేయి సాధించగా... రెండో సెట్‌లో జ్వెరెవ్ పుంజుకున్నాడు. మూడో సెట్‌లో ఒకదశలో జ్వెరెవ్ 2–5తో వెనుకబడ్డాడు. అయితే జ్వెరెవ్ సంయమనం కోల్పోకుండా ఆడి వరుసగా ఐదు గేమ్‌లు గెలిచి సెట్‌ను 7–5తో సొంతం చేసుకొని టైటిల్ దిశగా అడుగు వేశాడు. కానీ నాలుగో సెట్‌లో అల్‌కరాజ్ మళ్లీ చెలరేగాడు. జ్వెరెవ్‌కు కేవలం ఒక గేమ్ కోల్పోయి సెట్‌ను గెలిచి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక ఐదో సెట్‌లోనూ అల్‌కరాజ్ తన జోరు కొనసాగించాడు. రెండుసార్లు జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి తన సర్వీస్‌లను నిలబెట్టుకొని ఈ స్పెయిన్ స్టార్ విజయకేతనం ఎగురవేశాడు.



విన్నర్స్ ట్రోఫీతో అల్‌కరాజ్

- ఓపెన్ శకంలో (1968 తర్వాత) మూడు ఉపరితలాలపై గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన పిన్న వయస్కుడిగా అల్‌కరాజ్ (21 ఏళ్లు) గుర్తింపు పొందాడు. గతంలో ఈ రికార్డు రాఫెల్ నాదల్ (23 ఏళ్లు) పేరిట ఉంది. హార్డ్ కోర్టులపై 2022 యూఎస్ ఓపెన్ నెగ్గిన అల్‌కరాజ్, 2023లో పచ్చిక కోర్టులపై వింబుల్డన్ టైటిల్ నెగ్గాడు.
- టెన్నిస్‌లోని మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీల (ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) టైటిల్స్ సాధించిన ఏడో ప్లేయర్‌గా అల్‌కరాజ్ ఘనత వహించాడు. రాఫెల్ నాదల్ (స్పెయిన్), మాట్స్ విలాండర్ (స్వీడన్), జిమ్మీ కానర్స్ (అమెరికా), రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), జొకోవిచ్ (సెర్బియా), ఆంద్రీ అగస్సీ (అమెరికా) గతంలో ఈ ఘనత సాధించారు.



రన్నరప్ ట్రోఫీతో జ్వెరెవ్

- కెరీర్‌లో ఫైనల్ చేరిన మొదటి మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన ఏడో ప్లేయర్‌గా అల్‌కరాజ్ నిలిచాడు. గతంలో గుస్తావో కుయెర్టెన్ (బ్రెజిల్), స్టీఫెన్ ఎడ్బర్గ్ (స్వీడన్), జాన్ బోర్గ్ (స్వీడన్), ఫెడరర్, జిమ్మీ కానర్స్, వావ్రింకా (స్విట్జర్లాండ్) ఈ ఘనత సాధించారు.
- నాదల్, సాంటానా, గిమెనో, సెర్గీ బ్రుగుయెరా, కార్లోస్ మోయా, అల్బెర్ట్ కోస్టా, కార్లోస్ ఫెరీరో తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన ఎనిమిదో స్పెయిన్ ప్లేయర్‌గా అల్‌కరాజ్ నిలిచాడు.

రసెల్‌కు 'పోల్ పొజిషన్'



మాంట్రియల్: మెర్సిడెస్ జట్టు డ్రైవర్ జార్జి రసెల్ తన కెరీర్‌లో రెండోసారి 'పోల్ పొజిషన్' సాధించాడు. ఫార్ములావన్ సీజన్‌లో భాగంగా తొమ్మిదో రేసు కెనడా గ్రాండ్‌ప్రిని రసెల్ తొలి స్థానం నుంచి ప్రారంభిస్తాడు. క్వాలిఫయింగ్ సెషన్‌లో రసెల్, రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక నిమిషం 12 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేశారు. అయితే వెర్‌స్టాపెన్‌కంటే ముందుగా రసెల్ ఈ సమయాన్ని నమోదు చేయడంతో అతనికి పోల్ పొజిషన్ కేటాయించారు. మూడు క్వాలిఫయింగ్ సెషన్‌లు కలిపి రసెల్ 26 ల్యాప్‌లు... వెర్‌స్టాపెన్ 27 ల్యాప్‌లు పూర్తి చేశారు. 2022లో హంగేరి గ్రాండ్‌ప్రిలో తొలిసారి రసెల్ 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించాడు. ఆ తర్వాత రసెల్‌కు మళ్లీ పోల్ పొజిషన్ దక్కలేదు. లాండో నోరిస్ (మెక్‌లారెన్) మూడో స్థానం నుంచి... ఆస్కార్ పియాస్ట్రి (మెక్‌లారెన్) నాలుగో స్థానం నుంచి... డానియల్ రికార్డో (హోండా) ఐదో స్థానం నుంచి రేసును మొదలుపెడతారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఎనిమిది రేసులు జరగ్గా... తొలి ఏడు రేసుల్లో వెర్‌స్టాపెన్, ఎనిమిదో రేసులో చార్లెస్ లెక్లెర్క్ పోల్ పొజిషన్‌లు సాధించారు.

పూజా తోమర్ ఘనత

యూఎఫ్‌సీలో విజయం సాధించిన తొలి భారతీయ ఫైటర్‌గా రికార్డు



పూజ

కెంటకీ: భారత్‌కు చెందిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారిణి పూజా తోమర్ చరిత్ర లిఖించింది. అల్టిమేట్ ఫైటింగ్ చాంపియన్‌షిప్ (యూఎఫ్‌సీ)లో విజయం అందుకున్న తొలి భారతీయ ఫైటర్‌గా రికార్డు నెలకొల్పింది. లూయిస్‌విల్‌లో జరిగిన ఈ పోటీల్లో పూజ 52 కేజీల స్ట్రా–వెయిట్ కేటగిరీలో 30–27, 27–30, 29–28తో బ్రెజిల్‌కు చెందిన రేయాన్నెపై గెలిచింది. గట్టి పోటీ ఉండే యూఎఫ్‌సీలో ఇప్పటివరకు మన మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులెవరూ కనీసం ఒకసారి కూడా నెగ్గలేకపోయారు. కానీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన 30 ఏళ్ల పూజ గతేడాది యూఎఫ్‌సీతో కాంట్రాక్టు కుదుర్చుకోవడంతోనే అతిపెద్ద మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఈవెంట్‌లో పోటీ పడే అవకాశం పొందిన తొలి భారత మహిళగా ఘనత వహించింది. గతంలో పురుషుల విభాగంలో భారత్‌కు చెందిన అన్షుల్ జూబ్లీ, భరత్ ప్రపంచ స్థాయి యూఎఫ్‌సీలో పోటీ పడ్డారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



SCALING NEW HEIGHTS in JEE ADVANCED 2024

50 YEARS OF BRILLIANCE



ALL INDIA RANK **8**
G.NAVEEN
R.No. 246161014 (R)



ALL INDIA RANK **36**
P.RAKESH KUMAR
R.No. 246025153 (R)



ALL INDIA RANK **39**
K.VINOD
R.No. 246146088 (R)



ALL INDIA RANK **123**
J.SNEHITH SANDESH
R.No. 246192185 (R)




ALL INDIA RANK **125**
V.RAMBABU
R.No. 246174019 (R)

All India Rank	Name	R.No.
127	V.VEDAVACHAN REDDY	246029007 (R)
133	J.SHRETHAN REDDY	246195007 (R)
135	S.ARUN SINGH	246150386 (R)
157	B.DINESH	246177009 (R)
185	M.VENKATESHWARLU	246194092 (R)
299	D.KARTHIK	246018009 (R)
323	T.AKHIL NAIK	246175113 (R)
324	K.SREERAM REDDY	246195226 (R)
397	B.ESHWARI	246197150 (R)
450	N.NITHIN	246195114 (R)
598	D.PRAGNA TEJA	246197108 (R)
621	W.VERONIKA HASINI	246192298 (R)
654	P.NIHAL SRIVATSAV	246196001 (R)
689	T.TEJASWI	246200036 (R)
708	B.RAJESH	246146013 (R)
737	D.NIHARIKA	246160036 (R)
737	B.ANAND SAI	246163068 (R)
751	V.KRANTHI KIRAN	246138023 (R)
901	V.HARILAL	246118153 (R)
966	R.DEEPANSH REDDY	246197175
1003	A.BHAGAWANDAS	246157224 (R)
1043	P.NITHIN NAIK	246199082 (R)
1097	B.ABHILASH RAJU	246171283 (R)
1100	R.AADHI	246157623 (R)
1170	D.VARSHITH	246019048 (R)
1186	M.MALLU NAIK	246029567 (R)
1201	M.SAI SIDDHARDHA	246011037 (R)
1214	A.SAI CHARAN	246150195 (R)
1270	G.APARNAJINI	246197189 (R)
1276	D.MANISH	246197114

LONG TERM JEE (ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2024-25

HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | **WARANGAL:** 9642117378 | **VIJAYAWADA:** 8142111302 | **VIZAG:** 9052222274, 9154854707 | **GUNTUR:** 9154854694 | **TIRUPATI:** 9154854699 | **NELLORE:** 9154854696 | **ANANTHAPURM:** 9154854691 | **KURNOOL:** 9154854695 | **NIZAMABAD:** 9642117110, 096421 15777 | **SRIKAKULAM:** 9154854697 | **BHIMAVARAM:** 9642223762, 7331122579 | **RAJAHMUNDRY:** 9154854693 | **KARIMNAGAR:** 9642117335 | **NALGONDA:** 9573927070 | **ONGOLE:** 8712609156 | **KHAMMAM:** 9121155002 | **ADILABAD:** 9154854690 | **KOTHAGUDEM:** 9154854692 | **NIRMAL:** 9642117835 | **HOSAPETE:** 9154854713.

SR Educational Academy
TELANGANA ● ANDHRA PRADESH ● KARNATAKA


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 79

సోమవారం 10-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


తెలుగు రాష్ట్రాలు గర్వించేలా... తెలుగు విద్యార్థి గర్వపడేలా...
Infinity Learn
IIT JEE ADVANCED ఫలితాల్లో శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థుల విశ్వరూపం
(మాదాపూర్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్‌లు)
ALL-INDIA ALL CATEGORY BELOW 10 RANKS
1 RANK BIBASWAN BISWAS* (SC)
3 RANK SALLURI VIVEK (SC)
4 RANK VASANTA SRIRAJ (ST)
5 RANK HIMANSHU THALOR* (OBC)
6 RANK RAJDEEP MISHRA*
8 RANK P V S D SAI MOHITH (EWS)
9 RANK M E VENKATA PARTHIV (EWS)
10 RANK A S S D B SIDHVIK SUHAS
ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీచైతన్య సాధించిన టాప్ 1000లోపు 203 ర్యాంకులు
106 112 120 122 123 124 125 135 142 145 149
150 152 154 156 160 164 165 167 169 172 175
178 180 181 183 185 192 204 206 207 210 213
214 215 219 223 224 227 228 233 235 238 242
244 248 249 252 253 259 260 264 274 275 283
297 299 304 308 311 318 326 333 334 339 353
355 369 379 384 393 395 399 401 402 405 406
410 420 421 431 435 436 440 454 465 467 470
481 484 494 495 508 509 519 522 525 544 551
556 573 579 591 599 600 604 617 620 645 647
658 662 670 671 685 690 693 694 696 704 708
712 713 714 716 720 724 725 729 740 764 767
772 779 780 784 787 792 795 802 803 804 807
808 809 813 836 838 839 844 845 846 852 873
874 879 880 891 898 899 909 926 928 929 935
944 945 973 976 997 998 999 1000
Congratulations
*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback | *DLP / AITS
IIT-JEE MAIN & ADVANCED
LONGTERM 2025
క్లాసులు 15 జూన్ 2024 నుండి ప్రారంభం
ADMISSIONS OPEN
HYDERABAD
BOYS RESIDENTIAL - 91000 65899 / 91774 22235 87126 00768 / 87126 00769
GIRLS RESIDENTIAL - 91770 46533 / 91000 91871 89779 05063 / 89779 05064
DAY SCHOLARS - 99486 76603 / 98661 08338
ALL INDIA / STATE RANKS | JEE MAIN-2024 | JEE ADV-2024 | AP EAPCET | TS EAPCET
<=2500 | 100% | 100% | 80% | 80%
<=5000 | 100% | 100% | 60% | 60%
<=10000 | 75% | 75% | 30% | 30%
<=20000 | 50% | 50% | 20% | 20%
SC/ST/PW BEST RANKERS | 60% | 60%
*Best of one is taken into Consideration
Scan QR code for WEBSITE
ADMISSIONS OPEN
Knowledge Hub
NEET | IIT JEE | FOUNDATION
COACHING CENTRES
www.srichaitanyaknowledgehub.com
KUKATPALLY : 91774 44352
AMEERPET : 95151 11054
KONDAPUR : 95151 11428
VISAKHAPATNAM : 91774 44307
DILSUKHNAGAR : 91774 44326
HIMAYATNAGAR : 91774 44341
TRIMULGHERRY : 91774 44837
www.srichaitanya.net

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 10 । జూన్ । 2024

ఆరంభం అదిరింది..



మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం వర్ధమాన కళాకారులు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి సందర్శకులను మంత్ర ముగ్ధులను చేశారు.

-2లో



నార్సింగిలో వ్యాపారి కిడ్నాప్

వ్యాపార లావాదేవీల్లో తేడాలు రావటం.. ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవటంతో ఓ వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఇద్దరు వ్యక్తులను నార్సింగి పోలీసులు కటకటాల పాల్జేశారు.

-2లో

ముగిసిన 'ఇండియా ఆర్ట్ ఫెస్టివల్'

నగరం వేదికగా తొలిసారి నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ ఆదివారం ఘనంగా ముగిసింది. తెలుగు రాష్ట్రాల కళాభిమానులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

-2లో









గ్రూప్-1 పరీక్షకు క్యూ కట్టారు!

గ్రేటర్ పరిధిలో గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 275 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. కొందరు అభ్యర్థులు పరీక్ష కేంద్రాల అడ్రస్ తెలియక ఇబ్బందులకు గురయ్యారు. హైదరాబాద్ జిల్లాలో 61.75 శాతం అభ్యర్థులు పరీక్షకు హాజయ్యారు. మొత్తం 40,569 మంది అభ్యర్థులకు గాను 25,051 హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లాలో 75.01 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 55,692 మంది అభ్యర్థులకు గాను 41,774 మంది పరీక్ష రాశారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 69,727 మంది అభ్యర్థులకు 48,962 మంది పరీక్షకు హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని పరీక్ష నిర్వాహకులు తెలిపారు. – సాక్షి, సిటీబ్యూరో

సేవా గుణాన్ని చాటిన ఆర్టీసీ డీఎం

కాచిగూడ: ఆర్టీసీ ఉద్యోగులు మరోసారి సేవా తత్పరతని చాటారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఆదివారం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. అందులో భాగంగా అబిడ్స్‌లో విధులు నిర్వహిస్తున్న కాచిగూడ డిపో మేనేజర్ రఘు, సిబ్బంది ఉదయం 9:45 గంటలకు నిషిత అనే విద్యార్థిని జీడిమెట్ల నుంచి గ్రూప్-1 పరీక్ష రాయడానికి అబిడ్స్ వద్ద బస్సు దిగింది. తాను రాయాల్సిన పరీక్ష కేంద్రం ప్రగతి మహా విద్యాలయం సుల్తాన్‌బజార్ అడ్రస్‌లో ఉంది. ఆ విద్యార్థిని బస్సు కోసం వేచి చూస్తూ ఆందోళన చెందుతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న కాచిగూడ డిపో మేనేజర్ రఘు విషయం తెలుసుకొని పరీక్ష కేంద్రానికి అనుమతించే సమయం తక్కువగా ఉండడంతో నిషితను తన కారులో పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. ప్రత్యేక చొరవ చూపి తనను పరీక్ష కేంద్రానికి సమయానికి తీసుకువచ్చిన డిపో మేనేజర్ రఘుకు, వారి సిబ్బందికి విద్యార్థిని నిషిత కృతజ్ఞతలు తెలిపింది.



విద్యార్థినిని పరీక్ష కేంద్రానికి చేర్చిన ఆర్టీసీ కాచిగూడ డిపో మేనేజర్

గంగాపురం కిషన్‌రెడ్డి అనే నేను..

- కేంద్ర కేబినెట్‌లో లభించిన బెర్త్
- నగరం నుంచి ముగ్గురు ఎంపీల పోటీ
- కిషన్‌రెడ్డికి రెండోసారి దక్కిన అవకాశం
- లష్కర్‌లో వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు

సికింద్రాబాద్: మోదీ నేతృత్వంలో ఆదివారం కొలువుదీరిన కేంద్ర ప్రభుత్వంలో గ్రేటర్‌కు మరోసారి ప్రాధాన్యం దక్కింది. ఇక్కడి నుంచి మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు ఎంపీలు మోదీ కేబినెట్‌లో బెర్తు కోసం పోటీ పడగా.. సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డిని మరోదఫా కేంద్ర మంత్రి పదవి వరించింది. కేంద్రంలో వరుసగా మూడుసార్లు ఏర్పడిన మోదీ సర్కారులో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి ప్రాధాన్యం లభించడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక 2014లో సికింద్రాబాద్ ఎంపీగా గెలిచిన ప్రస్తుత హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు కేంద్ర సహాయమంత్రి పదవి దక్కింది. అప్పట్లో ఆయన మూడేళ్లపాటు కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత కిషన్‌రెడ్డి రెండుమార్లు ఎంపీగా వరుస విజయాలు సాధించారు. 2019లో మొదటిసారి ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి మోదీ ప్రభుత్వంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. రెండేళ్ల అనంతరం జరిగిన కేంద్ర మంత్రివర్గ విస్తరణలో సాంస్కృతిక, పర్యాటక శాఖ కేబినెట్ మంత్రిగా పదోన్నతి పొందారు. ఎంపీగా రెండో విజయాన్ని నమోదు చేసుకున్న ఆయన తాజాగా మరోసారి నరేంద్ర మోదీ కేబినెట్‌లో కొలువుదీరారు.

మోదీ సర్కారులో మరోసారి

ఇద్దరితో పోటీపడి..

బీజేపీలో సహజంగా జోడు పదవులు ఉండవని చెబుతుంటారు. రెండేళ్లుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి జోడు పదవులను నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. ఒకసారి కేంద్ర మంత్రిగా పని చేసి.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో మోదీ కొత్త మంత్రివర్గంలో కిషన్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు ఎంపీలు పోటీపడ్డారు. మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాల నుంచి ఎంపీలుగా గెలిచిన ఈటల రాజేందర్, విశ్వేశ్వర్‌రెడ్డిలు కేంద్ర మంత్రి పదవిని ఆశించారు. అయినప్పటికీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డికి మోదీ కేబినెట్‌లో స్థానం లభించింది. తెలంగాణ రాష్ట్రం నుంచి మరో బీసీ ఎంపీకి సీనియారిటీ ప్రాతిపదికన కేంద్ర మంత్రి పదవి ఇస్తున్న క్రమంలో త్వరలో బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని కిషన్‌రెడ్డి నుంచి తప్పించనున్నట్టు సమాచారం. కేంద్ర మంత్రి పదవి ఆశించి భంగపడ్డ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని అధిష్టానం అప్పగించనున్నట్టు తెలుస్తోంది.

కేంద్ర మంత్రులు అవుతారని..

మూడుసార్లు వరుసగా ఏర్పాటైన నరేంద్ర మోదీ ప్రభుత్వాల్లో సికింద్రాబాద్ ఎంపీలకు మంత్రి పదవులు లభించాయి. ఈ పరిణామం పట్ల సికింద్రాబాద్ ప్రాంత ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్ఎస్ఎస్ భావజాలంతో బీజేపీలో దశాబ్దాలుగా అంకితభావంతో పని చేసి నేతలుగా బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డిలు పేరుప్రఖ్యాతులు సంపాదించారు. అద్వానీతో కలిసి దత్తాత్రేయ, మోదీతో కలిసి కిషన్‌రెడ్డి పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో పని చేసిన అనుభవం ఉంది. ఈ నేపథ్యంలోనే వీరిని ఎంపీలుగా గెలిపించుకుంటే కేంద్ర మంత్రులు అవుతారన్న ప్రచారాలను ఇక్కడి బీజేపీ నేతలు బలంగా చేస్తూ వస్తున్నారు. ఈ ప్రచారం కూడా ఇక్కడ బీజేపీ అభ్యర్థుల విజయానికి దోహదం చేస్తున్నాయి.



ఈటలకు తప్పని నిరాశ



మేడ్చల్: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని ఆయన అనుచరులు, రాజకీయ విశ్లేషకులు భావించారు. కానీ.. ఆయనకు నిరాశే ఎదురైంది. సికింద్రాబాద్, కరీంనగర్ ఎంపీలుగా గెలిచిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర మంత్రులుగా చోటు దక్కడంతో కొంత నిరాశకు గురయ్యారు. తెలంగాణ ఉద్యమ కారుడిగా, మంత్రిగా రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేకమైన ముద్ర వేసి కీలక నేతగా ఆయన ఎదిగారు. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలతో ఈటల బీజేపీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ ప్రకటించడంతో ఈటల రాజేందర్ పేరు తెరపైకి వచ్చింది. కాగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పగ్గాలు చేపట్టింది. ఈటల రాజేందర్ గజ్వేల్, హుజురాబాద్ స్థానాల నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటి..

అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి చెందడం, బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రాకపోవడంతో ఈటల మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. కేంద్ర మంత్రి కావాలని ఆశించారు. ఈటల ఎంపీగా గెలవగానే ఆయనకు ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రధాన నాయకులందరూ మరుసటి రోజే ఢిల్లీకి తరలివెళ్లారు. తమ నాయకుడు మంత్రి అవుతున్నారని జోరుగా ప్రచారం చేశారు. మీడియాలో సైతం ఈటల రాజేందర్ కేంద్ర మంత్రి పదవి రేసులో ఉన్నారని కథనాలు ప్రసారమయ్యాయి. కాగా.. ఆదివారం ప్రధాని మోదీ కేబినెట్‌లో సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌లకు కేంద్ర మంత్రులుగా ప్రకటనలు రావడంతో ఈటల రాజేందర్ ఆశలు అడియాసలే అయ్యాయి. కాగా.. ఈటలకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించే అవకాశముంది.

'హెచ్‌జీటీఏ' అధ్యక్షుడిగా అజయ్ శర్మ



నూతన కార్యవర్గ సభ్యులతో అధ్యక్షుడు అజయ్ శర్మ

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (హెచ్‌జీటీఏ) 2024–2026కు గాను నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. సంఘం నూతన అధ్యక్షుడిగా ఎఫీషియెంట్ రోడ్ లైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ శర్మ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా వినీల్ పర్వతనేని, ప్రధాన కార్యదర్శిగా వివేక్ గుప్తా, జాయింట్ సెక్రటరీగా కె. రాఘవేంద్ర, కోశాధికారిగా అశోక్ గోయల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అజయ్ శర్మ మాట్లాడుతూ.. వస్తు రవాణా అనేది ఆర్థికాభివృద్ధికి జీవనాధారం, సరుకు రవాణా లేకుంటే ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోతాయన్నారు. నూతన అధ్యక్షుడిగా సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో నూతన మేనేజింగ్ కమిటీ సభ్యులు రాజేష్ సింగ్, అజిత్ భండారీ, సత్యుగ్ కేజ్రీవాల్, అజీముద్దీన్, రవి గోయెల్, ప్రతీక్ కుమార్ గార్గ్, రాహుల్ గార్గ్, ప్రవీణ్ కుమార్ శర్మ, అజయ్ పిలానియా, ప్రవీణ్ గోయల్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన పరుగు



ఖైరతాబాద్: అవయవదానంపై అవగాహన కల్పిస్తూ ఆదివారం నెక్లెస్ రోడ్డులో 5కే రన్ నిర్వహించారు. 5కే, 10కే రన్‌ను మోహన్ ఫౌండేషన్ ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ భానుచంద్ర, బ్రిల్స్ సీఈఓ రామ్ నరేష్‌లు జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో రెండో ఎడిషన్‌గా నిర్వహించిన అవయదాన అవగాహన రన్‌లో రన్నర్లు, వైద్యులు, యువతీ యువకులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న వారికి అవయవదానం దివ్య ఔషధంగా పని చేస్తుందని, ప్రతి ఒక్కరూ అవయవ దానం చేసేందుకు ముందుకు రావాలని మోహన్ ఫౌండేషన్ సీనియర్ ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ భానుచంద్ర సూచించారు. మనిషి చనిపోయాక తనతోపాటే శరీరంలోని అవయవాలన్నీ మట్టిలో కలిసిపోతాయని, అదే అవయదానం చేస్తే మరణించినా మరొకరికి జీవితాన్ని ఇచ్చి ఎనిమిది మంది బతుకుల్లో వెలుగులు నింపవచ్చన్నారు. ప్రజల్లో అవయవదానంపై అవగాహన పెంచడంతో పాటు కొంతమందిలో నెలకొన్న అనుమానాలను పోగొట్టేందుకే అవగాహన రన్ నిర్వహించినట్లు తెలిపారు.



మోడిఫైడ్ సైలెన్సర్లతో తిరుగుతున్న స్పోర్ట్స్ బైక్‌లను సీజ్ చేసిన పోలీసులు

రయ్.. రయ్.. గూబ గుయ్!

- మోడిఫైడ్ సైలెన్సర్ వాహనాలు
- చెవులు దద్దరిల్లే శబ్దాలు
- నియంత్రించాలంటున్న స్థానికులు

బంజారాహిల్స్: రాత్రీ పగలూ తేడా లేకుండా మోడిఫైడ్ సైలెన్సర్‌తో భీకర శబ్దాలతో దూసుకెళ్తున్న స్పోర్ట్స్ బైక్‌లు, కార్లపై అటు ట్రాఫిక్ పోలీసులు, ఇటు లా అండ్ ఆర్డర్ పోలీసులు దృష్టిపెట్టారు. గడిచిన నెల రోజుల కాలంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు మితిమీరిన వేగంతో చెవులు దద్దరిల్లే శబ్దంతో దూసుకెళ్తున్న వాహనాలను సీజ్ చేయడంతో పాటు సదరు వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఇంత చేస్తున్నా ఇంకా కొంతమంది యువకులు స్పోర్ట్స్ బైక్‌లు, కార్లలో రయ్ రయ్‌మంటూ దూసుకెళ్తూనే ఉన్నారు. రాత్రి 10 గంటల తర్వాతనే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, నెక్లెస్‌రోడ్డు, మాసబ్‌ట్యాంక్, మాదాపూర్, దుర్గం చెరువు ప్రాంతాల వైపు యువకులు రేసింగ్‌లకు పాల్పడుతూ బైక్‌లపై దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఉదయం 11 నుంచి గంట పాటు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు రెండు గంటలు మాత్రమే వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. తమ దృష్టికి వస్తే మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు. రాత్రి 7 తర్వాత తెల్లవారుజామున 6 గంటల వరకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రహదారులపై బైక్‌లు, కార్లు మోత మోగిస్తూ దూసుకెళ్తుండగా వాహనదారులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. చెవులు దద్దరిల్లే సౌండ్‌లతో నివాసితులు సైతం తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రాత్రి 8 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు కనీసం వారానికి రెండు సార్లైనా ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు వేర్వేరుగా వాహన తనిఖీలు చేపడితే పెద్ద ఎత్తున మోడిఫైడ్ సైలెన్సర్ల వాహనాలను పట్టుకోవచ్చని స్థానికులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాట 'సారీ'

ప్రమాద బాధితుల్లో రెండోస్థానం వీరిదే

- 2023 సిటీ గణాంకాల ప్రకారం 43 శాతం
- రాజధాని రహదారులపై 121 మంది బలి
- అమలుకు నోచుకోని కీలక ప్రతిపాదనలు
- మూణ్నాళ్ల ముచ్చటగానే పెలికాన్ సిగ్నళ్లు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీలో పాదచారులకు మాత్రం పిటీనే. ఇక్కడ జరుగుతున్న ప్రమాదాలు, కనిపించని మౌలిక వసతులే దీన్ని స్పష్టం చేస్తున్నాయి. నగరంలో ప్రతి ఏడాదీ రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారిలో పాదచారులది రెండో స్థానం. గత ఏడాది నగర పరిధిలో జరిగిన మొత్తం ప్రమాద మృతుల్లో పెడస్ట్రియన్స్ 43 శాతం ఉన్నారు. ఈ పరిస్థితి తలెత్తడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ ప్రాథమిక అంశాలైన ఫుట్‌పాత్‌లు మాయం కావడం, అవసరమైన అన్ని ప్రాంతాల్లోనూ పెలికాన్ సిగ్నళ్లతో పాటు జీబ్రా క్రాసింగ్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు లేకపోవడం.. ఉన్నవాటిని పాదచారులు, వాహన చోదకులు పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి దాపురించింది.

రెండో స్థానంలో పాదచారులు..

- 2023కి సంబంధించి హైదరాబాద్ పోలీసులు రూపొందించిన రికార్డుల ప్రకారం సిటీలో చోటు చేసుకున్న ప్రమాదాలు రెండు వేలకు పైనే ఉన్నాయి. వీటిలో అనేక మంది మృత్యువాతపడుతున్నారు. ఇలా రోడ్డు ప్రమాదాల్లో బాధితులుగా మారుతున్న వారిలో ద్విచక్ర వాహన చోదకులు తొలిస్థానంలో ఉండగా... రెండో స్థానం పాదచారులదే. ఇప్పుడే కాదు... గత కొన్నేళ్లుగా నమోదైన గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాద బాధితుల్లో పాదచారులే ఎక్కువగా ఉన్నారు.

వీటికి మోక్షమెప్పుడో?

రాజధానిలో ఉన్న రహదారులపై పాదచారులు భద్రంగా తిరిగేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు. పురాతన నగరమైన పాతబస్తీలోనే కాదు.. ఇటీవలే రూపుదిద్దుకుని, నానాటికీ అభివృద్ధి చెందుతున్న హైటెక్ సిటీ పరిసరాల్లోనూ ఇవి మచ్చుకైనా కనిపించవు. ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థలోనూ పాదచారులకు అవసరమైన స్థాయిలో ప్రాధ్యానం లభించట్లేదు. ప్రణాళికా లోపం కారణంగా నగరంలో ఉన్న ఫుట్‌పాత్‌ల్లో సగం ఆక్రమణకు గురికాగా.. మిగిలిన చోట్ల అనేక అడ్డంకులు వస్తున్నాయి. జంక్షన్లు వద్ద పెడస్ట్రియన్స్ క్రాసింగ్ కోసం ప్రత్యేకమైన చర్యలు, అందుకు అనుగుణంలో 'ఆల్ రెడ్స్' అనే సాంకేతిక అంశం ఏర్పాటు ఆమడదూరంలో ఉన్నాయి. వీటికి పరిష్కారంగా ట్రాఫిక్ విభాగం అధికారులు తయారు చేసి పంపిన ప్రతిపాదనలకు 'గ్రేటర్'లో మోక్షం లభించట్లేదు. నగరంలో కీలక ప్రాంతాల్లో కనీసం రెండడుగుల వెడల్పుతో ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలని, దీనికి బారికేడింగ్, అవసరమైన ప్రాంతాల్లో క్రాస్ చేసేందుకు ఓపెనింగ్స్ తదితరాలతో కూడిన ప్రతిపాదనలకు బల్దియా ఫైళ్లల్లో కొన్ని ఏళ్లగా ఆగిపోయి ఉన్నాయి.

పూర్తిస్థాయిలో లేని 'పెలికాన్స్'..

పాదచారుల భద్రత కోసం సిటీలో అనునిత్యం బిజీగా ఉండే 60 ప్రాంతాల్లో పెలికాన్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలని కొన్నేళ్ల క్రితమే ట్రాఫిక్ అధికారులు నిర్ణయించారు. ట్రాఫిక్‌కు సంబంధించిన మౌలిక వసతుల కల్పన జీహెచ్ఎంసీ ఆధీనంలో



ఉంటుంది. ఈ నేపథ్యంలోనే వీటి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి 2010 మార్చిలోనే జీహెచ్ఎంసీకి పంపారు. ఒక్కో సిగ్నల్ ఏర్పాటుకు దాదాపు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతాయని అంచనా వేసిన 'గ్రేటర్' అధికారులు కేవలం 30 ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వీటిని దశల వారీగా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రాథమికంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద నాలుగింటిని అమలులోకి తెచ్చారు. ఏడాదిలోనే ఇవి మూలనపడ్డా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏడాదిన్నర క్రితం మరికొన్ని చోట్ల ఏర్పాటు చేసి, వలంటీర్లను నియమించారు. ఇవన్నీ ప్రస్తుతం నామ్‌కే వాస్తేగా మిగిలిపోయాయి.

ఎఫ్ఓబీలు, భూగర్భ మార్గాలు కనుమరుగు..

నగరంలోని రద్దీ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు ఎక్కువగా ఉన్న చోట్ల గతంలో భూగర్భ క్రాసింగ్ మార్గాలు నిర్మించారు. ఆపై దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, బేగంపేట, మెహిదీపట్నం సహా అనేక ప్రాంతాల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులోకి తీసుకువచ్చారు. సరైన నిర్వహణ, భద్రతా ప్రమాణాలు లేకపోవడంతో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, కోఠిల్లో ఏర్పాటు చేసిన భూగర్భ క్రాసింగ్ మార్గాలు ఆదరణకు నోచుకోలేదు. దీంతో ఒకటి పూర్తిగా కనుమరుగు కాగా.. మరోటి స్వరూపం మార్చుకుని పాదచారులకు పనికి రాకుండా పోయింది. ఇక ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు కట్టిన జీహెచ్ఎంసీ అధికారులు వాటికి ఎలివేటర్ వంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో నగరవాసులకు ఉపయోగపడలేదు. ఇవి పూర్తిగా ఓ స్వరూపాన్ని సంతరించుకోకముందే 'మెట్రో' గండం ముంచుకువచ్చింది. మెట్రోరైల్ నిర్మాణాల కోసం సిటీలోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల్ని తొలగించారు. ఆ తర్వాత కొన్ని నిర్మితమవుతున్నా.. అవసరాలకు తగ్గట్టు మాత్రం లేవు. ఉప్పల్ సహా మరికొన్ని చోట్ల అందుబాటులోకి వచ్చినా.. 100 శాతం పాదచారులు వినియోగించట్లేదు.

రహదారుల పరిస్థితి ఇలా...

- బల్దియా అధీనంలోని రోడ్లు: 6,200 కి.మీ
- ఆర్అండ్‌బీ పరిధిలోనివి: 189.49 కి.మీ
- జాతీయ రహదారుల సంస్థ అధీనంలోవి: 98.7 కి.మీ
- మొత్తం రోడ్ల పొడవు : 6,488 కి.మీ
- ఫుట్‌పాత్‌ల పొడవు: 2 వేల కి.మీ లోపే
- వీటిలోనూ సరాసరిన కనిష్ఠంగా ఐదు కి.మీ అడ్డంకులు లేకుండా ఉన్న ఫుట్‌పాత్‌లు లేవు

ప్రమాద గణాంకాలు ఇలా..

ఏడాది	మొత్తం	మృతులు	క్షతగాత్రులు	మృతుల్లో	పాదచారులు
2021	2,575	323	2,252	121	(37.46 శాతం)
2022	2,106	275	1,831	110	(40 శాతం)
2023	2,370	280	2,090	121	(43.21 శాతం)

స్నాచర్ల జిగ్ జాగ్ రూట్

- తప్పించుకునేందుకు విఫల యత్నాలు
- రూట్ పాయింట్లతో మ్యాపింగ్
- 24 గంటల్లో అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: చైన్ స్నాచింగ్ చేసి.. పోలీసులకు చిక్కకుండా ముఖానికి, వాహనం నంబర్ ప్లేట్ కనిపించకుండా మాస్క్ ధరించి పారిపోయేందుకు స్నాచర్లు విఫల యత్నం చేశారు. రూట్‌ను పోలీసులు కనుక్కోకుండా జిగ్‌జాగ్ ఎస్కేప్ ప్లాన్ చేశారు. అయినా సరే సీసీ టీవీ కెమెరాల సహాయంతో స్నాచర్ల ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. ఏం జరిగిందంటే.. ఈ నెల 1న నాగోలు పోలీసు స్టేషన్ పరిధిలోని మరిపల్లి గ్రామంలో ఉదయం 7 గంటల సమయంలో ఇళ్లు అద్దెకు దొరుకుతాయా అని మాటలు కలిపి వృద్ధురాలి మెడలోంచి 5 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా దుండగులు ముఖానికి ముసుగు, వాహనానికి మాస్క్ వేసుకుని వారిని గుర్తు పట్టకుండా పోలీసులను గందరగోళానికి గురి చేయాలని చూశారు. అలా 10 కిలో మీటర్ల పాటు గల్లీలు తిరుగుతూ స్నాచర్లు చేసిన జిగ్ జాగ్ ట్రావెలింగ్ సీన్ సీసీ కెమెరాల్లో రికార్డయింది. 10 కిలో మీటర్లు ప్రయాణించిన తర్వాత స్నాచర్లు ఓ చోట ఆగి ఇక తమను ఎవరూ పట్టుకోలేరని, తప్పించుకున్నామని ధీమాతో ముఖానికి ముసుగు, వాహనం నెంబరు ప్లేటుకు ఉన్న మాస్క్‌ను తీసేసి తిరిగి రోడ్డుపైకి వచ్చేశారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలు పట్టేశాయి. అంతే ఈ క్లూతో పోలీసులు ముగ్గురు స్నాచర్లను 24 గంటల్లో పట్టేశారు. ఈ కేసులో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో 10 కిలో మీటర్ల దూరం వరకు 20 సీసీ కెమెరాలను ఫాలో అవ్వడంతో స్నాచర్ల గుట్టు తెలిసిపోయింది. నిందితులు మునగాల శివ రెడ్డి, సుంకిరెడ్డి శశిధర్ రెడ్డి, దేవులపల్లి శివకుమార్ రెడ్డిలను అరెస్టు చేశారు.

జేఈఈలో ఆకాష్ విద్యార్థులకు టాప్ ర్యాంకులు..



సాక్షి, సిటీబ్యూరో: జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 పరీక్షలో నగరానికి చెందిన తమ విద్యార్థులు టాప్ స్కోరర్లుగా నిలిచారని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్‌ఎల్) బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా తెలిపారు. ఐఐటీ మద్రాస్ ఆదివారం విడుదల చేసిన ఫలితాల నేపథ్యంలో హిమాయత్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు రిషి శేఖర్ శుక్లా ఆల్ ఇండియా ర్యాంకుల్లో 25 వ ర్యాంక్ సాధించాడన్నారు. ఉజ్వల్ సింగ్ 95వ ర్యాంక్, సాయి దివ్య తేజా రెడ్డి 174 వ ర్యాంక్, సూర్య ప్రకాష్ పింగళి 245 ర్యాంక్, విశ్వనాథ్ కేఎస్ 247, రిత్విక్ పెరుమాళ్ల 434, మన్నెం నాగ సంజయ్ 741, కోతా ప్రతీక్ రెడ్డి 819, ఆర్యన్ భోజ్వానీ 951వ స్థానాలతో టాప్ ర్యాంకర్లుగా నిలిచారన్నారు. అత్యంత కఠినమైన ప్రవేశ పరీక్షలలో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన పేదింటి బిడ్డలు

జేఈఈలో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థుల హవా


వినయ్ (1041)


నితిన్ (1038)


విజయ్ (7841)


నిఖిల్ (7415)


అరుణ్ చంద్ర (883)


రేవంత్ (767)


సాయిరామ్ (1586)

- 82 మందిలో 62 మందికి ఐఐటీ సీట్లు
- ఓపెన్ కేటగిరిలో ముగ్గురి ప్రతిభ
- 39 మందికి కమ్యూనిటీ ర్యాంకులు

రాయదుర్గం: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు 82 మంది విద్యార్థులు హాజరుకాగా 62 మంది విద్యార్థులకు ఐఐటీకి క్వాలిఫై అయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డి గణేష్ ఆదివారం వివరాలు వెల్లడించారు. ఓపెన్ కేటగిరిలో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరచగా, కమ్యూనిటీ ర్యాంకులో 39 మంది విద్యార్థులు సత్తా చాటారన్నారు. 23 మంది ప్రిపరేటరీ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.

ర్యాంకు లిస్ట్..

రేవంత్ 767 వర్యాంకు, సీహెచ్ అరుణ్ చంద్ర 883, డి నితిన్ 1038, వి వినయ్ 1041, వైసాయిరామ్ 1,586, సీహెచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి 3,360 ర్యాంకులు సాధించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కార్యదర్శి సీతాలక్ష్మి, అదనపు కార్యదర్శి సక్రునాయక్, ఆర్‌సీఓ డాక్టర్ శారదవెంకటేష్ ప్రోత్సాహంతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. కళాశాల అధ్యాపకబృందం, తల్లిదండ్రులు, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

బాలికల కళాశాలలోనూ అదే జోరు..

- డైరెక్ట్‌గా 17 మందికి ఐఐటీ సీట్లు
- మరో 17 మందికి ప్రిపరేటరీ ఐఐటీ సీట్లు


భార్గవి (870 ర్యాంకు)


సింధూజ (1307)


అనూష (1361)


కీర్తి (2935)


శుభశ్రావ్య (3186)


ధరణి (3546)

రాయదుర్గం: సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలోనూ అదే హవా కొనసాగింది. ఆదివారం వెల్లడైన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. 59 మంది పరీక్షకు హాజరుకాగా 17 మందికి నేరుగా ఐఐటీ సీట్లు, మరో 17 మంది ప్రిపరేటరీ ఐఐటీ సీట్లు సాధించారు. ప్రిన్సిపాల్ శారద ఆదివారం వివరాలు వెల్లడించారు. పేదింటికి చెందిన విద్యార్థినులు ఐఐటీ సీట్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు. గురుకులాల సొసైటీ కార్యదర్శి, ఆర్‌సీఓ, ఇతర ఉన్నతాధికారుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందన్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మలక్‌పేట: అక్రమంగా ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని మలక్‌పేట పోలీసులు పట్టుకున్నారు. శనివారం మలక్‌పేట పోలీసులు తీగలగూడలో వాహనాల తనిఖీలు చేస్తుండగా వాహేద్ నగర్ నుంచి మూసారంబాగ్ వైపు వెళుతున్న లారీని ఆపి సోదా చేయగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. లారీ స్వాధీనం చేసుకుని డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన లారీలో దాదాపు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బియ్యాన్ని మలక్‌పేట పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించిన పోలీసులు వారిచ్చిన నివేదిక అధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

అసత్య ప్రచారానికి అడ్డుకట్ట వేయండి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ కో ఆర్డినేటర్ నరాల సాయికిరణ్ ముదిరాజ్ ఆదివారం నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వ అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహ మార్పు, రాష్ట్ర గీతంలో మార్పులకుగాను ప్రభుత్వం రూ.వేల కోట్లే ఖర్చు చేసిందని నకిలీ పత్రాలను సృష్టించి సోషల్ మీడియా, పలు యూట్యూబ్ చానళ్లలో అసత్య ప్రచారం చేస్తున్నారని సాయికిరణ్ సైబర్ క్రైమ్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. తద్వారా ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడంతో పాటు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరువుకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా పలు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు చేస్తున్నారని తెలిపారు. అసత్య ప్రచారాన్ని అరికట్టడమేగాక, నకిలీ కంటెంట్‌ను తొలగించాలని ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్సు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఆర్టీసీ డ్రైవర్ మృతి


రాజశేఖర్ రెడ్డి మృతదేహం

కేపీహెచ్‌బీకాలనీ: ప్రమాదవశాత్తు బస్సు ఎక్కుతూ కాలు జారి కిందపడటంతో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ రాజశేఖర్ రెడ్డి (50) ఆదివారం మధ్యాహ్నం రామచంద్రాపురం, శ్రీనివాస్ నగర్, అడ్డగుట్ట మధ్య నడుస్తున్న బస్సు ఎక్కబోయి కాలు జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లి నుంచి బొల్లారం వెళ్లే రోడ్డులోని బొల్లారం రోడ్డు వెన్స్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించేందుకు యత్నించారు. కాగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉందన్నారు. మృతుడి వయస్సు (30–40) ఏళ్ల మధ్య ఉండవచ్చునని తెలిపారు. దుస్తులపై జెమ్మిగడ్డ విరాట్‌నగర్ లేబుల్‌ను గుర్తించామన్నారు. హత్య చేసి ఇక్కడ పారవేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శరీరం కుళ్లిపోవడంతో నాలుగు రోజుల క్రితం హత్య జరిగి ఉంటుందని భావిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్ట్‌లో పూర్తి వివరాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నార్సింగిలో వ్యాపారి కిడ్నాప్

గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణగౌడ్

మణికొండ: కలిసి వ్యాపారాలు చేసి లావాదేవీలలో తేడాలు రావటం.. ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవటంతో ఓ వ్యాపారిని కిడ్నాప్ చేసి వసూలు చేయాలనుకున్న ఇద్దరు వ్యక్తులను నార్సింగి పోలీసులు కటకటాల పాలు చేశారు. నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన శేషువర్ధన్‌రెడ్డి, ఏసీలు, బంగారం వ్యాపారం చేస్తూ హైదర్‌షాకోట్‌లోని ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. అతను తక్కువ ధరకు వాటిని విక్రయిస్తుండటంతో అతనితో కలిసి అదే నందికొట్కూరుకు చెందిన ఎ. క్రాంతి కుమార్, కె.సందీప్‌లు వాటిని కొనుగోలు చేసి విక్రయించి మంచి లాభాలు పొందారు. చివరగా 2కిలోల 600 గ్రాముల బంగారం కావాలని వారు శేషువర్ధన్‌రెడ్డికి రూ. 2కోట్ల వరకు ఇచ్చారు. ఎంతకూ బంగారం కాని, డబ్బు కాని తిరిగి ఇవ్వకపోవటంతో వారి మధ్య వివాదం కొనసాగుతోంది. అతని నుంచి ఎలాగైనా డబ్బు వసూలు చేయాలనే ఉద్దేశంతో శనివారం రాత్రి 9 గంటల సమయంలో నార్సింగిలోని ఎన్‌సీసీ అర్బన్ వద్దకు అతడిని పిలిపించి దాడి చేశారు. కారులో కిడ్నాప్ చేసి కర్నూలు వైపు తీసుకెళ్లారు.

ఫోన్ కాల్‌తో అప్రమత్తం..

ఓ కారులో ఉన్న వ్యక్తిని కొట్టి మరో కారులో అతన్ని ఇద్దరు వ్యక్తులు తీసుకుని వెళ్లారని ఓ వ్యక్తి కంట్రోల్‌రూం 100కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు నార్సింగి పోలీసులను అప్రమత్తం చేశారు. వెంటనే నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి, ఏసీపీ జీవీ రమణగౌడ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుని కారును పరిశీలించారు. అందులో రక్తం మరకలు ఉండటం, అతని ఫోన్, చెప్పులు కారులోనే ఉండటాన్ని గమనించారు. అంతలోనే అతని భార్య అరుణ ఫోన్ చేయటంతో జరిగిన విషయాన్ని తెలిపారు. ఆమె సంఘటనా స్థలానికి వచ్చి నందికొట్కూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులతో డబ్బు ఇచ్చే విషయంలో గొడవలు జరుగుతున్నాయని, వారే కిడ్నాప్ చేసి ఉంటారని ఫిర్యాదు చేసింది. దాంతో వెంటనే నార్సింగి పోలీసులు చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్‌లతో పాటు మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల పోలీసులను అలర్ట్ చేశారు.

అడ్డాకల్ వద్ద చిక్కారు...

నార్సింగిలో శేషువర్ధన్‌రెడ్డిని కిడ్నాప్ చేసి వారి కారులో కర్నూల్ వైపు పారిపోతున్న వారిని మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు అడ్డాకల్ టోల్ గేట్ వద్ద గుర్తించారు. అంతలోనే నార్సింగి పోలీసు టీం అక్కడకు చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని నార్సింగికి తీసుకుని వచ్చారు. వారిని విచారించగా తమకు రావాల్సిన రూ. 2 కోట్లు వసూలు చేసుకునే క్రమంలోనే అతన్ని కిడ్నాప్ చేశామని అంగీకరించారని ఏసీపీ తెలిపారు. సమావేశంలో నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి, ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరంభం అదిరింది

శిల్పకళావేదికలో త్రిఖ, మిస్క కూచిపూడి అరంగేట్రం



మాదాపూర్: వర్ధమాన కళాకారులు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి సందర్శకులను మంత్రముగ్ధులను చేశారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం కూచిపూడి అరంగేట్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతికళాక్షేత్రం గురువు జ్యోతిరెడ్డి వద్ద ఆరేళ్లుగా శిక్షణ పొందుతున్న త్రిఖ, మిస్క అరంగేట్రం చేశారు. దశరస గణపతిం, దశావతారం, కృష్ణశబ్దం, సరస్వతి స్తుతి, తరంగం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రావెంకటేశం, డ్యాన్స్ క్రిటిక్ అన్నారావు, సినీనటుడు సుమన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కే.వీ రమణాచారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



ప్రజల కష్టాలు తెలుసుకోవాలి


నమూనా పరీక్ష ప్రశ్నా పత్రాన్ని విడుదల చేస్తున్న జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజల కష్టాలు తెలిసిన వారు అత్యున్నతమైన ప్రమాణాలతో న్యాయాన్ని అందించగలుగుతూ మంచి న్యాయమూర్తులుగా రాణిస్తారని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్ అన్నారు. ఆదివారం అయిలు ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో జరిగిన జూనియర్ సివిల్ జడ్జీ నమూనా రాత పరీక్షల ప్రశ్నా పత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎం.ఎస్.కె. జైశ్వాల్ మాట్లాడుతూ సాధారణంగా న్యాయమూర్తి వద్ద ఉండే న్యాయదేవత కళ్లకు నల్ల బట్టతో అడ్డుపెడతారని అయితే దాని అర్థం న్యాయ దేవతకు కళ్లు కనపడవని కాదని తన ముందుకు వచ్చే వారితో సంబంధం లేకుండా నిజమైన న్యాయాన్ని అందించడమేనన్నారు. న్యాయ విద్యార్థులు ప్రజల సమస్యల పైన అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో న్యాయమూర్తుల పాత్ర కీలకమైందని చెప్పారు. కింది కోర్టుల్లో న్యాయమూర్తులు ఇచ్చే తీర్పుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వారు తీసుకునే నిర్ణయాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తాయన్నారు. అంబేద్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన మాట్లాడుతూ న్యాయమూర్తులు అత్యంత జాగ్రత్తగా న్యాయం అందించేందుకు కృషి చేయాలని కోరారు. మారిన కాలానికి అనుగుణంగా విద్యార్థులు కష్టపడి విజయాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో అయిలు జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, వెంకటేష్, సహాయ కార్యదర్శి మాధవరెడ్డి, హైకోర్టు న్యాయవాదులు సుదర్శన్, సురేందర్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన 'ఇండియా ఆర్ట్ ఫెస్టివల్'





సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ వేదికగా తొలిసారి నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ అద్భుత కళా ప్రదర్శనలో 50 మంది మాస్టర్ ఆర్టిస్టులు, 200 మందికి పైగా మిడ్-కెరీర్, ఎమర్జింగ్ ఆర్టిస్టులు పాల్గొని దాదాపు 3,500 కళాఖండాలు ప్రదర్శించారు. 30 ఆర్ట్ గ్యాలరీలతో భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో నగరంతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళా అభిమానులు, ఔత్సాహికులు అధిక సంఖ్యలో పాల్గొని హైదరాబాద్ కళలకు–కళాకారులకు ప్రధాన కేంద్రమని నిరూపించారు. ఈ మూడు రోజుల ప్రదర్శనలో విలువైన ఆర్ట్ వర్క్‌లను కళా ప్రేమికులు కొనుగోలు చేశారని వివిధ రాష్ట్రాలకు చెందిన ఆర్టిస్టులు తెలిపారు. ముంబై, ఢిల్లీ, బెంగుళూరు వేదికలుగా 25 ఎడిషన్‌లను నిర్వహించామని ఆ తర్వాతే నగరంలో కూడా ఈ ప్రదర్శన చేపట్టామని ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపకుడు రాజేంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళా ప్రదర్శనలో భాగంగా చివరి రోజు కార్యక్రమాలైన వంశీధర్, బిజయ్ సంగీత స్వరాలు, ఆర్టిస్టు మోషే డయాన్ లైవ్ పెయింటింగ్ సందర్శకులను అలరించాయి.

నగరం వేదికగా 'హిందుస్థానీ క్లాసికల్ రిసైటల్'..

22న ప్రముఖ సంగీత విద్వాంసురాలు రోంకిణి గుప్తా ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: సూర్మండల్, తెలంగాణ టూరిజం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22న ప్రముఖ హిందుస్థానీ క్లాసికల్ విద్వాంసురాలు రోంకిణి గుప్తా సంగీత ప్రదర్శన నిర్వహించనున్నారు. నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వేదికగా సాయంత్రం 6.30 గంటలకు జరగనున్న ఈ ప్రదర్శనలో రోంకిణి గుప్తా సుస్వరాలను అందించనున్నారు. ఇటీవల స్వర్ కోకిల లతా మంగేష్కర్ అవార్డు అందుకున్న రోంకిణి గుప్తా దేశవ్యాప్తంగా పలు సంగీత ప్రదర్శనలిచ్చారు. 25 సంవత్సరాలకు పైగా సంగీత శిక్షణతో ప్రసిద్ధి చెందిన రోంకిణి గుప్తా మ్యూజిక్ మాస్ట్రో ఏఆర్ రెహమాన్‌కు అభిమాన శాస్త్రీయ సంగీత విద్వాంసురాలిగా ప్రఖ్యాతి చెందారు. ఈ ప్రదర్శనకు సంబంధించిన టిక్కెట్లు ఆన్‌లైన్‌లో www.bookmyshow.comలో అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

అటవీ శాఖ జూనియర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ జూనియర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని అరణ్య భవన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా హైదరాబాద్ డివిజన్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.నాగేందర్‌బాబు, ఉపాధ్యక్షుడిగా మహబూబాబాద్ డివిజన్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి బి.సాంబు, రాష్ట్ర కార్యదర్శిగా ఆదిలాబాద్ డివిజన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భూపాలపల్లి డివిజన్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మహబూబ్‌నగర్ డివిజన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుకన్య, కోశాధికారిగా యల్లందు డివిజన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కోటేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఫారెస్ట్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

నగరం రియల్ రంగంలో దూసుకుపోతోంది..

నార్కెడ్కో మాజీ చైర్మన్ సునీల్ చంద్రారెడ్డి



బంజారాహిల్స్: హైదరాబాద్ నగరం రియల్ ఎస్టేట్ రంగంలో దూసుకుపోతున్నదని, దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ ఎంతో వృద్ధి చెందిందని నార్కెడ్కో మాజీ చైర్మన్ సునీల్ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రియల్ ఎస్టేట్ ప్రీమియర్ అసోసియేట్స్ నెట్‌వర్క్(రెపా) సంస్థను ఆవిష్కరించారు. ఈ సంస్థకు చైర్మన్‌గా టీఎస్‌వీ ప్రసాద్, వైస్ చైర్మన్‌గా రాజేష్ డొంకేశ్వర్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. రెపా వేదిక రియల్ ఎస్టేట్ రంగంలో రాణించాలనుకునే ఔత్సాహికులకు ఎంతో తోడ్పాటుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఈహెచ్‌బీయూ డీజీఎం ఆర్.బాలానంద్, వర్టెక్స్ గ్రూప్ జాయింట్ ఎండీ మురళీమోహన్, సుధాకర్ గండె పాల్గొన్నారు.

జేఈఈ 2024 ఫలితాల్లో సత్తా చాటిన ఫిట్జీ విద్యార్థులు

లక్డీకాపూల్ : జేఈఈ అడ్వాన్స్‌డ్– 2024 ఫలితాల్లో ఫిట్జీ నగర విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం అడోబ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జేఈఈ ర్యాంకర్లతో సంస్థ ప్రతినిధులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఫిట్జీ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్ రామన్ మాట్లాడుతూ తమ విద్యార్థులు జాతీయస్థాయిలో వందలోపు నాలుగు ర్యాంకులు సాధించారన్నారు. గంగా శ్రేయస్ 13వ ర్యాంకు, ప్రణీత్ సింగ్ భాటియా 32వ ర్యాంకు, హర్షిణి 72వ ర్యాంకు, మోహన్ కల్లూరి 92వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అదే విధంగా జాతీయ స్థాయిలో ఏడుగురు విద్యార్థులు 200 లోపు ర్యాంకులు సాధించారన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.



పరీక్ష కేంద్రాలను సందర్శించిన పోలీసులు



కూకట్‌పల్లిలో జరిగిన గ్రూప్‌-1 పరీక్షా కేంద్రాలను బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఈసీపీ శ్రీనివాస్‌రావు, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. - కూకట్‌పల్లి

రోడ్లపైనే చెట్ల కొమ్మలు

- నెలలుగా పేరుకుపోయిన చెట్ల కొమ్మలు • వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు
- ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెట్ల కొమ్మల మధ్య దుర్గంధం • తరలించాలని విన్నవిస్తున్నా పట్టించుకోని సంబంధిత అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని తొలగించిన చెట్ల కొమ్మలను నెలలు గడుస్తున్నా తొలగించడం లేదు. దీంతో కేపీహెచ్‌బీ కాలనీలోని పలు ప్రాంతాల్లో కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. పార్కుల్లో కూడా ఎత్తుగా పెరిగాయని తొలగించిన చెట్ల కొమ్మలను పార్కులోనే కుప్పలుగా పడవేశారు. దీంతో ఆ పడేసిన కొమ్మల స్థానంలో మొక్కలు కూడా చనిపోయి చెత్త కుప్పగా తయారైంది. ఆహ్లాదం కోసం వచ్చే స్థానికులకు పార్కులోని పడివున్న చెట్ల కొమ్మలను చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఇటీవల కురిసిన వర్షానికి చెట్ల కొమ్మల నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా మూగజీవాలకు ఆవాసంగా మారి, పాములు, తేళ్ల వంటి విష సర్పాలు ఈ ప్రాంతంలో ఎక్కువగా సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

◆ చిన్నారులు నిత్యం ఆడుకునే ప్రాంతంలో విష సర్పాలు కనిపించటంతో వారి తల్లిదండ్రులు పార్కుకు తీసుకురావాలంటే ఆందోళన చెందుతున్నారు. కేపీహెచ్‌బీకాలనీలోని బతుకమ్మ కుంట పార్కులో చెట్లను నరికి కొమ్మలను అడ్డంగా వేయటంతో ఈ ప్రాంత ప్రజలకు పార్కుకు వెళ్లటానికి ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. కేపీహెచ్‌బీకాలనీలోని రమ్యా సెంటర్, రోడ్డు నంబర్‌-3, విద్యుత్ కార్యాలయం ప్రాంతంలో చెట్ల కొమ్మలను నరికి అడ్డంగా పడేయడంతో వాహనదారులకు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని స్థానికులు బాధ పడుతున్నారు.



కొమ్మలను తొలగించాలి..



కేపీహెచ్‌బీ కాలనీలో పార్కుల్లో, పలు రోడ్లపై జీహెచ్ఎంసీ సిబ్బంది రానున్న వర్షాకాలన్ని పురస్కరించుకొని చెట్ల కొమ్మలను తొలగించారు. తొలగించిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తరలిస్తే బాగుండేది. కానీ ఎక్కడ నరికిన చెట్ల కొమ్మలను అక్కడే రోజుల తరబడి పడవేయటంతో మాకు ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు చెట్ల కొమ్మలను త్వరగా తొలగించాలి. - మురళీధర్‌రెడ్డి, కేపీహెచ్‌బీకాలనీ



బతుకమ్మ కుంట ప్రాంతంలోని పార్కులో చెట్ల కొమ్మలు నరికి అక్కడే పడవేసిన దృశ్యం

నేడు ప్రజావాణి

కూకట్‌పల్లి: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి జోనల్ పరిధిలో ఎవరికైనా సమస్య ఉంటే ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని కోరారు.

జనగామకు సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెట్టాలి

లిబర్టీ: సామ్రాజ్యవాదులను గడగడలాడించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరును ఒక జిల్లాకు పెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆత్మగౌరవ పతాక భువనగిరి కోటగా సుభిక్షంగా పరిపాలన సాగించిన సర్దార్ పాపన్నగౌడ్ చరిత్రలో తన పేజీని నిలుపుకొన్నారని ఆయన గుర్తు చేశారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ జిల్లాకు సర్దార్ పాపన్నగౌడ్ జిల్లాగా పేరు నామకరణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు త్వరలో జరిగే రాష్ట్ర కేబినేట్‌లో సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెడుతూ తీర్మానం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. జనగామ సమీపంలోని ఖిలా షాపూర్‌లో జన్మించిన సర్దార్ పాపన్నగౌడ్ భువనగిరి కోట కేంద్రంగా పరిపాలన సాగించి చరిత్రలో మిగిలిపోయారని అన్నారు.

కిషన్‌రెడ్డి మరోసారి కేంద్ర మంత్రి కావడం గర్వకారణం

హిమాయత్‌నగర్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి మరోసారి కేంద్ర మంత్రి పదవి వరించడం గర్వకారణమని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. ప్రజల కోసం కిషన్‌రెడ్డి పని చేసినందుకే మరొకసారి సికింద్రాబాద్ ఎంపీగా గెలిచారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ ఎదుగుదలకు కిషన్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. గడచిన ఐదేళ్లలో కిషన్‌రెడ్డి నేతృత్వంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిచిందన్నారు. అలాగే ఎంపీ బండి సంజయ్ కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయి వరకు ఎదిగారని ఆయన గుర్తు చేశారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల సహకారంతో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడం ఖాయమని కేశబోయిన శ్రీధర్ స్పష్టం చేశారు.

విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్ పంపిణీ

ఖైరతాబాద్: పేద విద్యార్థులకు విద్యాపరంగా ప్రోత్సహించేందుకు వాసవి సేవా కేంద్రం ఆదివారం విద్యా సహాయ నిధి కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషన్ కిట్స్ అందజేశారు. ఆదివారం వాసవి సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 400 మంది చిన్నారులకు స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాలు, లంచ్ బాక్స్, వాటర్ బాటిళ్లతో కూడిన ఎడ్యుకేషన్ కిట్స్‌ను అందజేశారు. జీఎస్టీ అడిషినల్ కమిషనర్ నల్లా సాయికిషోర్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ విద్యార్థులకు కిట్స్ అందజేశారు. వాసవి సేవాకేంద్రం ప్రతి సంవత్సరం విద్యా నిధి పేరుతో పేద విద్యార్థులకు చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారు కొనియాడారు. వాసవి సేవాకేంద్రం అధ్యక్షుడు కొల్పూరు రమేష్, ప్రధాన కార్యదర్శి నాచం ప్రభాకర్, కోశాధికారి ఇల్లూరి నరేంద్ర కుమార్, పూర్వ అధ్యక్షుడు ఆలంపల్లి రవికుమార్, జీవితకాల ముఖ్య సలహాదారులు కొండ్లె మల్లికార్జున్, చీకట్ మర్ల అశోక్‌కుమార్, విద్యా సహాయ నిధి కమిటీ చైర్మన్ గందె హనుమంతరావు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ తల్లి కల్యాణం



పూజలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

మోతీనగర్: గ్రామ దేవతలను పూజిస్తే ఎటువంటి దుష్టశక్తులు దరి చేరవనేది ప్రజల ప్రగాఢ విశ్వాసమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం కబీర్‌నగర్‌లోని శ్రీపోచమ్మ తల్లి కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం అన్నదానం, సాయంత్రం పట్నాలు, అగ్నిగుండం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ సీఎస్ సత్యనారాయణ, తన్నీరు తిరుపతిరావు, ఉదయ్‌కుమార్, కమలాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం



శివాజీ పట్టాభిషేకం కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు

మోతీనగర్: ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం కార్యక్రమం వివేకానందనగర్ విగ్రహం వద్ద హిందూవాహిని కూకట్‌పల్లి బాగ్ కన్వీనర్ సీహెచ్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీహెచ్. వెంకట్రాంరెడ్డి, డి.రాంగోపాలసింగ్, జి.రాజు, పులిగోళ్ల శ్రీనివాస్‌యాదవ్, జి.సుదర్శన్, లాల్‌సింగ్, గంగాధర్, రాకేష్ యాదవ్, జీతు, సందీప్‌నాయక్, నవీన్, వెంకటరెడ్డి, మురళీమోహన్, అంకిత్‌సింగ్, రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ బాలాజీ స్వర్ణపురికాలనీకి చెందిన కొయ్యడ రాజకుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో గాయమై చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా... తాను పదవిలో ఉన్నా లేకున్నా తన కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని తెలిపారు. కష్టం వచ్చినప్పుడు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ అధిష్టానం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చక్రపాణి తదితరులు ఉన్నారు.



చికిత్స పొందుతున్న రాజకుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 31, వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జిమిర్చి 70, కాకరకాయ 38, బీరకాయ 40, క్యాబేజి 21, బీన్స్ 95, క్యారెట్ 40, గోబిపువ్వు 23, దొండకాయ 18, చిక్కుడుకాయ 50, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలుగడ్డ 34, కీరా 25, దోసకాయ 28, సొరకాయ11, పొట్లకాయ 18, కంద 45, ఉల్లిపారక 85, ఉల్లిగడ్డ 32, మామిడికాయ 10 నుంచి 15, అరటి కాయ 8 నుంచి 9, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 35, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 50 నుంచి 60, మునగకాయలు 5 నుంచి 6, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 60, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా. హేమంత్ తెలిపారు. ఈనెల 10న ఉదయం 10గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని అన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని అన్నారు.

లయన్ అన్నెం కోటిరెడ్డికి ఎక్స్‌లెన్స్ అవార్డు

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసినందుకే ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకోవటం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ కమిటీ సమావేశంలో వేమూరి లక్ష్మి320 డి-గవర్నర్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, నగేష్, అమర్‌నాథ్ రావు, విజయలక్ష్మి బాలేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకున్న లయన్ అన్నెం కోటిరెడ్డి

ఫేజ్‌-5లో వంద పడకల ఆస్పత్రి నిర్మించండి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలోని 5వ ఫేజులో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని సీపీఐ సలహాదారుడు, కోప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శివప్రసాద్, సీపీఎం నాయకులు కృష్ణనాయక్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి అప్పటి మంత్రి తన్నీరు హరీష్‌రావుతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారన్నారు. ఏడాది అవుతున్నా ఇంత వరకు ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. ఇప్రస్తుతం ఈ స్థలమంతా రాళ్లు, రప్పలతో, పిచ్చి మొక్కలతో నిండిపోయిందన్నారు.

◆ గతంలో అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేసిన సంగతి అందరికీ తెలుసున్నారు. నేటి వరకు ఆస్పత్రి నిర్మాణం జరగకపోవటం అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అయినా ఇంత వరకు ఆస్పత్రి నిర్మాణం గురించి మాట మాత్రం మాట్లాడలేదని అన్నారు. ఆస్పత్రిని త్వరగా నిర్మించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 పడకల ఆస్పత్రి నిర్మిస్తారని ఆశిస్తున్నామని అన్నారు.

'దళితుల అభ్యున్నతిని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించింది'

లిబర్టీ: దళితుల ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన నిధులను ఆయా రంగాలకు ఖర్చు చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. సబ్‌ప్లాన్ కింద నిధులు కేటాయించడం తప్ప నిధులు విడుదల చేయలేదని చేసిన నిధులు కూడా సక్రమంగా ఖర్చు చేయలేదని అన్నారు. ఆదివారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2014 నుంచి 2024 వరకు ఒక లక్ష 41 వేల కోట్ల రూపాయలు ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ కింద కేటాయించారని.. ఖర్చు చేసింది మాత్రం రూ. 78 వేల కోట్లు మాత్రమే అని ఆయన తెలిపారు.

◆ 63 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయలేదని అసలు కేటాయింపులు జరగలేదని ఆయన ఆరోపించారు. పదేళ్ల కాలంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద ఎస్సీ అభివృద్ధి శాఖకు నిధులు కేటాయించడం తప్ప విడుదల చేయకపోవడం మరో వంక ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఇతర పథకాల కోసం దారి మళ్లించడం తప్ప ఎస్సీల ఆర్థిక అభివృద్ధికి జీవనస్థితిగతుల మార్పు కోసం మెరుగైన జీవన ప్రమాణాల కోసం గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం డబ్బులు ఖర్చు చేయలేదని అన్నారు. ఎస్సీలకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు ఎలా దారి మళ్లిస్తారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను ఖర్చు చేయకుండా అన్యాయం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

'నీట్' అక్రమాలపై విచారణ జరిపించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ అక్రమాలపై విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షను నిర్వహించి ఫలితాల పది రోజులు ముందుగా ప్రకటించడం దారుణమన్నారు. పరీక్ష నిర్వహణ, ఫలితాల విడుదలపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

జర్నలిస్ట్ రత్నాకర్‌శర్మ సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి: జర్నలిస్ట్ రత్నాకర్‌శర్మ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సచ్చిదానంద కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జర్నలిస్ట్ రత్నాకర్‌శర్మ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎం.కే.రాము మాట్లాడుతూ.. రత్నాకర్‌శర్మ సచ్చిదానంద కళాపీఠం స్థాపించి ఎందరో బాలబాలబాలికలను సంగీత నృత్య కళాకారులుగా సమాజానికి అందించారన్నారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు వెంకటేష్, ప్రసాద్, సంగీత, హరిని, జర్నలిస్టులు కనకాచారి, సతీష్, కృష్ణ, అఖిలేష్, రామిరెడ్డి, శ్రీనివాస్, రుద్రోజు వేణుగోపాలాచారి సీసీ తదితరులున్నారు.

వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర పేరిక కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పేరిక కుల వధూవరుల వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. సుమారు 55 జంటలకు అక్కడికక్కడే వివాహం కుదిరినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ సుంకరి ఆనంద్ మాట్లాడుతూ.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పేరిక కుల వేదికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి వేదికలను కులస్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరుగుపందెంలో రమేష్ బాబుకు బంగారు పతకం

ఉస్మానియా యూనివర్సిటీ: పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన రమేష్ బాబును శాలిబండ సైక్లింగ్ క్లబ్, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓయూ సైక్లింగ్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. గత నెల గచ్చిబౌలి స్టేడియంలో పాన్ ఇండియా నిర్వహించిన క్రీడా పోటీలలో 65 సంవత్సరాల కేటగిరిలో 70 ఏళ్ల రమేష్ బాబు బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. 14 రాష్ట్రాల నుంచి 400 మంది పరుగుపందెంలో పోటీ పడగా తాను మొదటి స్థానం నిలిచి బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. గతంలో 17 పతకాలను సాధించినట్లు వివరించారు.

పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి రచించిన చేత(తు)ల్లో ఆరోగ్యం పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలియజేసే ప్రయత్నమే ఈ పుస్తకం అన్నారు. ఆరోగ్య సలహాలు మొదలుకొని జ్వరం, తలనొప్పి, గుండెపోటు, అగ్నిప్రమాదాలు, బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెజబ్బుల వంటి దీర్ఘకాలిక అనారోగ్యాల గురించి చికిత్స అందించడంలో వైద్యులు ఎదుర్కొనే సమస్యలు కూడా ఈ పుస్తకంలో పొందుపరిచామన్నారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టండి

- తులసీనగర్‌లో రెండు నెలలుగా ఇదే సమస్య
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- నిర్లక్ష్యంగా కిందిస్థాయి అధికారులు, సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యం వల్ల డయేరియా ప్రబలుతోందని కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ తులసీనగర్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సుమారు రెండు నెలలుగా మురుగు నీటి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో స్థానికులు అనారోగ్యానికి గురై సతమతమవుతున్నారని తెలుపుతున్నారు. రెండు నెలలుగా కాలనీలో నీటి సమస్య ఏర్పడటంతో బోర్ నీరు, త్రాగడానికి మంచినీటి టిన్నులను కొని అవసరాలకు ఉపయోగించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

◆ వయోవృద్ధులు, చిన్నారులు కలుషిత నీటి సరఫరాతో వాంతులు, విరేచనాలు, జ్వరం, దగ్గు, జలుబు వంటి వాటితో ఆస్పత్రులు పాలైన సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు మొర పెట్టుకుంటున్నారు. తాగు నీటి సమస్యను పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ అధికారులకు పలుమార్లు ఫోన్ ద్వారా, నేరుగా కలిసి కూడా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల్లో చలనం లేకుండా పోయిందని స్థానికులు మండి పడుతున్నారు.

◆ వాటర్‌వర్క్స్ అధికారుల నిర్లక్ష్యంతో పేద, మధ్య తరగతి ప్రజలు తాగు నీటిని కొనుక్కోలేక, బోరు నీటినే ఉపయోగించుకోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. అనారోగ్యానికి గురైతే ఆసుపత్రులకు డబ్బులు చెల్లించలేక అవస్థలు పడుతున్నామని స్థానికులు అంటున్నారు.

◆ కలుషిత జలాలు సరఫరా కాకుండా అందించాలని ఉన్నతాధికారులు సమావేశం ద్వారా స్థానిక అధికారులకు ఆదేశించినప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఉన్నతాధికారుల మాటలకు కూడా విలువ లేకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీలో పర్యటించి కలుషిత తాగునీటిసమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆల్విన్‌కాలనీ తులసీనగర్‌లో కలుషిత జలాలను చూపిస్తున్న స్థానిక మహిళలు

ముగిసిన ఉచిత ధారణా శిక్షణ శిబిరం

నల్లకుంట: సువర్ణ భారతి మహోత్సవాల్లో భాగంగా చిన్నారుల్లో జ్ఞాపక శక్తి, మేధాశక్తిని పెంపొందించేందుకు బాల గోకులం ఆధ్వర్యంలో నల్లకుంట శంకర మఠంలో గత నెల 26న ప్రారంభమైన 'ఉచిత ధారణా (జ్ఞాపక శక్తి) శిక్షణ శిబిరం' ఆదివారంతో ముగిసింది. చివరిరోజున మఠం ప్రాంగణంలోని యాగశాలలో 'హయగ్రీవ హోమం' నిర్వహించారు. అనంతరం జరిగిన శిబిరం ముగింపు ఉత్సవంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ధారణా శిబిరం నిర్వాహకులను సన్మానించారు. దీనికి హాజరైన ఉమ్మడి ఏపీ పీసీసీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు జేబీ.శ్యామ్‌రావు, ఎస్.హరినాథ్‌రెడ్డితో కలిసి శిబిరం నిర్వాహకులు లంక శ్రీరామమూర్తి, రామచందర్‌రావులను శాలువాతో సన్మానించి నూతన వస్త్రాలు అందజేసి మాట్లాడారు. వేసవి సెలవుల్లో చిన్నారుల మేధోశక్తిని పెంపొందించే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు శరత్, కాంతారావు, దేవిరెడ్డి విజితారెడ్డి, సీహెచ్.మురళీకృష్ణ, మహేష్‌యాదవ్, శ్రవణ్‌కుమార్, సీహెచ్.లలిత ధారణా శిబిరం నిర్వాహకులు రామలింగేశ్వరరావు తదితరులున్నారు.



నిర్వాహకులను సన్మానిస్తున్న ముఖ్యఅతిథి శ్యామ్‌రావు

క్లుప్తంగా...

ములుగు జిల్లాలో నాలుగు మందుపాతరల గుర్తింపు

- అప్పటికే పేలిపోయిన 3 ఐఈడీలు
- జంతు కళేబరాలు లభ్యం



పోలీసులు గుర్తించిన మందు పాతర

వెంకటాపురం.కె (ములుగు): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం అటవీ ప్రాంతంలో పోలీసులు నాలుగు మందు పాతర (ఐఈడీ)లను గుర్తించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శబరీష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో కొద్ది రోజులుగా పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు మావోయిస్టులు అమర్చిన మందు పాతరలను గుర్తించడానికి తనిఖీలు చేస్తుండగా ఈ నాలుగు మందుపాతరలను గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో మూడు పేలిపోయి ఉన్నాయని, సమీపంలో ముళ్లపంది, కొండెంగ, ఒక పెంపుడు కుక్క కళేబరాలను గుర్తించామని, మిగిలిన మందుపాతరను బాంబ్‌స్క్వాడ్ సహాయంతో నిర్వీర్యం చేసినట్లు తెలిపారు.

ఏటీఆర్, ఎన్‌ఎస్‌టీఆర్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు

ఏపీ,తెలంగాణ సంయుక్త సమావేశంలో వివిధ అంశాలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ (ఎన్‌ఎస్‌టీఆర్)లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినతరంగా అమలు చేస్తామని తెలంగాణ పీసీసీఎఫ్ డోబ్రియాల్, ఆంధ్రప్రదేశ్ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి తెలిపారు. ఏ సమస్య తలెత్తినా రెండు రాష్ట్రాలు సుహృద్భావ వాతావరణంలో చర్చించి నిర్ణయాలు తీసుకుని ముందుకుపోవాలని నిర్ణయించామన్నారు. ఆమ్రాబాద్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో రెండు రాష్ట్రాల అధికారులు పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుతో పాటు అడవులకు సంబంధించిన సరిహద్దు సమస్యలు, నివాస నిర్వహణ, రక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ ప్రాంతంలో తీర్థయాత్రల సందర్భంగా భక్తుల తాకిడి పెరుగుతుండటంతో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. రెండు టైగర్ రిజర్వ్‌లలో ప్రత్యేకంగా తాగు నీటి కోసం ప్రత్యామ్నాయాన్ని అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఏపీ చీఫ్ వైల్డ్ వార్డెన్ ఏకే నాయక్, ఏటీఆర్, ఎన్‌ఎస్‌టీఆర్ అధికారులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో హైటెక్స్‌లో వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హాజరుకానున్న దేశవిదేశాల వెడ్డింగ్ ప్లానర్లు, డిజైనర్లు



సనత్‌నగర్ (హైదరాబాద్): జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ టూరిజం, తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ 3వ ఎడిషన్, 3వ టీసీఈఐ ఎస్‌ఐడబ్ల్యూయుపీసీ గ్లోబల్ 2024 బియాండ్ ఇమాజినేషన్, 7వ టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2024 వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు ఆదివారం బేగంపేట పర్యాటక భవన్‌లోని ది ప్లాజా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ, భారతీయ వివాహ పరిశ్రమలోని నిపుణులను ఇది ఒకచోట చేర్చుతుందని, ఈ ఈవెంట్ ద్వారా వివాహాలకు దక్షిణాది నుంచి ముఖ్యమైన సహకారం, పరిజ్ఞానం, ప్రత్యేక వేదికను అందించడమే లక్ష్యమన్నారు. భారతీయ వివాహ వ్యవస్థలోని వివిధ అంశాలపై జ్ఞానయుక్తమైన సెషన్లు ఉంటాయని, జాతీయ, అంతర్జాతీయ వక్తలు ఈ సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. ఈ కన్వెన్షన్ కోసం దేశవిదేశాల్లో ఉన్న 20కి పైగా వెడ్డింగ్ ప్లానర్లు, వెడ్డింగ్ డిజైనర్లు, వెడ్డింగ్ స్టైలిస్టులు, డెకరేటర్లు, ఈవెంట్ మేనేజర్లు, ఈవెంట్ ఇండస్ట్రీలోని ఇతర క్రాఫ్ట్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయన్నారు. ఈవెంట్‌కు సిడ్నీ నుంచి వెండీ ఈఎల్ ఖౌరీ సహా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణులు హాజరవుతారన్నారు. టెడ్డీ ఇమాన్యుయేల్ (ఫిలిప్పీన్స్), మైఖేల్ రూయిజ్ (ఫిలిప్పీన్స్), బ్రయాన్ టాచీ-మెన్సన్ (ఘనా) తదితరులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం దేశవిదేశాల నుంచి 700 మందికి పైగా ప్రతినిధులకు స్వాగతం పలుకుతోందన్నారు. 'ఈవెంట్ బజార్'గా పిలవబడే ఎక్స్‌పోలో 60కి పైగా స్టాల్స్‌లో గ్రాండ్ డిస్‌ప్లే ఉంటుందన్నారు. ఈవెంట్ పరిశ్రమలో ఉన్న విభిన్న ఉత్పత్తులు, సేవలు, అత్యాధునిక ట్రెండ్లను ప్రదర్శిస్తుందని చెప్పారు. ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లు, ఈవెంట్ సేఫ్టీ, టెక్నాలజీ పాత్ర తదితర కీలక అంశాలపై సమాంతర సెషన్లు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ డైరెక్టర్ రమేశ్‌నాయుడు, హైటెక్స్ హెడ్ టీజీ శ్రీకాంత్, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాంబాబు, ప్రధాన కార్యదర్శి రవిబురా, కోశాధికారి ఎండీ తౌఫిక్ ఖాన్, ఎస్‌ఐడబ్ల్యూయుపీసీ గ్లోబల్ 2024 కన్వీనర్ సాయి శ్రవణ్ మాదిరాజు, టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2024 కన్వీనర్ రామ్ ముప్పన, కో-కన్వీనర్లు హరీశ్‌రెడ్డి, కుమార్‌రాజా, సుధాకర్ యారబడి, డాక్టర్ సౌరభ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

- 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అట్లాంటాలో 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో ఆదివారం ప్రసంగించారు. హైదరాబాద్ సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి వికేంద్రీకరణ కోసం కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచానికి ఏఐ రాజధానిగా హైదరాబాద్‌ను రూపొందించే లక్ష్యంతో 200 ఎకరాలను ఏఐ పరిశ్రమల కోసం కేటాయించినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు అమెరికాలో స్థిరపడ్డ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావాలని కోరారు.

'సైబర్' బాధితులకు రూ.7.9 కోట్లు అందజేత

- సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును ఇప్పించిన అధికారులు
- జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులు పరిష్కారం
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల చేతిలో డబ్బు పోగొట్టుకున్న బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు న్యాయం చేస్తున్నారు. ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఒక్క రోజులోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.7.9 కోట్లు తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించారు. బాధితులు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన సందర్భంలో వెంటనే సంబంధిత బ్యాంకు, సైబర్ సెక్యూరిటీ విభాగానికి చేసిన ఫిర్యాదుల ఆధారంగా నేరగాళ్లకు డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్ చేసి న్యాయ ప్రక్రియ ద్వారా అధికారులు బాధితులకు రీఫండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అన్ని జిల్లాల పోలీసు విభాగాలు, పోలీసు కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైనట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీసీఎస్‌బీలో మొత్తం 4,144 కేసులు నమోదు కాగా, ఇందులో జూన్ 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులలో బాధితులకు రూ.7.9 కోట్లు సొమ్మును తిరిగి ఇప్పించగలిగినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులు పరిష్కరించగలిగినట్టు తెలిపారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిఖాగోయల్ సూచించారు. అపరిచిత వ్యక్తులు, నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లలోని లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని కోరారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి కాపాడేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని శిఖాగోయల్ తెలిపారు.

విద్యుత్ స్తంభంపైనే ఆగిన ఊపిరి

- షాక్‌తో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి
- నాలుగు గంటలపాటు స్తంభంపైనే మృతదేహం



ఆదిలాబాద్ రూరల్: ఓ ఇంటికి విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో మరమ్మతులు చేసేందుకు కరెంట్ స్తంభం ఎక్కిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్.. దానిపైనే షాక్‌కు గురై మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లా రాములుగూడలో ఈ ఘటన జరిగింది. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రాములుగూడ గ్రామానికి చెందిన దడంజే మోతీరాం (35) కొన్నేళ్లుగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఓ ఇంటికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోతీరాంను పిలిచారు. ఆయన వచ్చి సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. అయితే పైనుంచి వెళ్తున్న త్రీఫేజ్ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కుగురై అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మోతీరాం మృతితో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన చేశారు. తమకు పరిహారం చెల్లించే వరకు మృతదేహాన్ని కిందకు దింపొద్దని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు అక్కడికి రావడం ఆలస్యం కావడంతో మోతీరాం మృతదేహం స్తంభంపైనే నాలుగు గంటలపాటు ఉండిపోయింది. పోలీసులు, విద్యుత్ అధికారులు బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మోతీరాం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మోతీరాం మృతికి.. తమకు ఎలాంటి సంబంధం లేదని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతిరెడ్డి తెలిపారు. విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన మోతీరాం తమ లైన్‌మన్, జూనియర్ లైన్‌మన్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

హైవేలు రక్తసిక్తం

జాతీయ రహదారులు 44, 65పై ఘోర రోడ్డు ప్రమాదాలు

ఐదుగురు దుర్మరణం.. ఆరుగురికి గాయాలు

ఆదివారం రాష్ట్రంలోని రెండు జాతీయ రహదారులు రక్తసిక్తమయ్యాయి. 44వ నంబర్ హైవేపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా, హైవే 65పై చోటుచేసుకున్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. రెండు ఘటనల్లో మొత్తం ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.

పెబ్బేరు రూరల్: వారంతా జైనమత ప్రచార బోధకులు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరిన వారిని డీసీఎం రూపంలో మృత్యువు వెంటాడింది. 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఓ సాధువుతోపాటు ఇద్దరు సహాయకులు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు స్వామీజీలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన జైనమత ప్రచార బోధకులు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్, వీరికి తోడుగా సహాయకులు భగవాన్ బాయ్, హేమల్ ప్రవీణ్ షాతో పాటు మరికొందరు ఈనెల 3న హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరారు. మార్గమధ్యలో పెబ్బేరు మండలం రంగాపురం పాఠశాలలో శనివారం రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం నడక ప్రారంభించారు. గ్రామ శివారులో స్వామీజీలు వీల్‌చైర్‌లో కూర్చోగా, సహాయకులు తోసుకుంటూ వెళ్తుండగా.. కర్నూలు వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్ బాయ్ (36), హేమల్ ప్రవీణ్ షా (40)లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్వామీజీలు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హైవే అంబులెన్స్‌లో గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్ (45) మృతిచెందారు. మరో ఇద్దరు స్వామీజీలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

లారీల మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయిన కారు..



సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): జాతీయ రహదారి 65పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ శివారులో ఆదివారం జరిగింది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా దేవరిప్పరిగి తాలూకా ఉన్నాల్ వాసి హాజీ షబాజ్ తన భార్య సమ్రీన్ (45), ఇద్దరు కుమారులు జునైద్, అబ్దుల్లాలతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి పని చూసుకొని సొంతూరుకు వెళ్తున్నారు. నందికంది శివారు నాగ్సాన్‌పల్లి చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. వారి వెనకాలే హైదరాబాద్ నుంచి సదాశివపేట వైపు అతివేగంగా వస్తున్న ట్యాంకర్ లారీ డ్రైవర్ మృత్యుంజయ దుబే(45) కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. అదే సమయంలో ఇటుగా జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు మరో లారీ వెళ్తోంది. దీంతో కారు.. రెండు లారీల మధ్య ఇరుక్కుని నుజ్జయింది. ఈ ఘటనలో కారులో ఉన్న సమ్రిన్, ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ దుబే ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో హాజీ షబాజ్‌కు, అతని ఇద్దరు కుమారులకు, లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగర వార్తలు

ఆక్టన్ వర్సిటీ సదస్సుకు తెలంగాణవాసి



సాక్షి, సిటీబ్యూరో: యూఎస్ వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక ఆక్టన్ యూనివర్సిటీ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యేందుకు రాష్ట్రానికి చెందిన రంజిత్ కుమార్ పూర్తి స్కాలర్‌షిప్‌ను పొందారు. ఆర్థిక, వ్యక్తిగత స్వేచ్ఛలతో నైతిక-మతపరమైన విలువలను పునరుద్ధరించే లక్ష్యంతో యూఎస్ గ్రాండ్ ర్యాపిడ్స్‌లో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఆక్టన్ యూనివర్సిటీ కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. నాలుగు రోజులపాటు వేదాంత శాస్త్రం, తత్వ శాస్త్రం, వ్యవస్థాపకత, అంతర్జాతీయ అభివృద్ధి, మార్కెట్ ఆధారిత ఆర్థిక శాస్త్రం మధ్య సంబంధాన్ని పరిశోధించే ప్రత్యేక సెషన్స్ నిర్వహించనున్నారు. స్వేచ్ఛా సమాజం మూలాలను అన్వేషించడానికిగాను నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉంది స్వతంత్ర సెంటర్ ఆఫ్ హ్యూమన్ ఫ్లరిషింగ్ సహా వ్యవస్థాపకులైన రంజిత్ కుమార్ అన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: అవుషాపూర్-అంకుషాపూర్ మధ్యన రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్-అంకుషాపూర్ మధ్యన రైల్వే ట్రాకుపై 221-13/15 మైలురాయి వద్ద ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందన్న రైల్వే సిబ్బంది సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిశీలించగా 25-30 మధ్య వయస్సు ఉన్న వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి ఆచూకీ మాత్రం లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమీకృత మార్కెట్లు పూర్తయ్యేనా...!

- జిల్లాలోని 13 మున్సిపాలిటీల్లో పనులు
- నిధుల లేమితో మూడున్నర ఏళ్లుగా నత్తనడక
- ప్రభుత్వం నిధులు విడుదల చేయాలంటున్న ప్రజలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనలో భాగంగా 13 పురపాలక సంఘాల్లో మూడున్నర ఏళ్ల కిందట ప్రారంభించిన సమీకృత (వెజ్, నాన్-వెజ్) మార్కెట్ల నిర్మాణ పనులు నత్తకు నడకనేర్పుతున్నాయి. 9 పురపాలికల్లో నిధుల లేమితో పనులు నెమ్మదించగా, కొంపెల్లి, బోడుప్పల్ పురపాలక సంఘాల్లో మాత్రం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు సరిపడా నిధులు విడుదల చేస్తే తప్ప.. పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

మూడున్నర ఏళ్ల కిందట ప్రారంభం

సమీకృత మార్కెట్ల నిర్మాణానికి దాదాపు మూడున్నర ఏళ్ల కిందట శ్రీకారం చుట్టారు. వీటి నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ అప్పట్లో ప్రకటించినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు. 2023 ప్రారంభంలోనే పట్టణ ప్రజల వినియోగంలోకి రావాల్సిన సమీకృత మార్కెట్ల పరిస్థితి నిధుల లేమితో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా మారింది. జవహర్ నగర్, బోడుప్పల్, కొంపెల్లి, ఘట్కేసర్ పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. గుండ్లపోచంపల్లి, తూముకుంట, మేడ్చల్, నాగారం, పోచారం, నిజాంపేట్, దుండిగల్ పురపాలక సంఘాల్లో మార్కెట్ల నిర్మాణ నెమ్మదిగా సాగుతుంటే... పీర్జాదిగూడ, దమ్మాయిగూడలో పనులు ఒక మోస్తరుగా నడుస్తున్నాయి. ఈ మార్కెట్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయితే ప్రజలకు కూరగాయలు, మాంసం, పండ్లు, ఇతర తినుబండారాలు ఒకే చోట లభించనున్నాయి.

స్థలాన్ని బట్టి నిధుల కేటాయింపు

పురపాలక పట్టణాల్లో ఎకరం నుంచి రెండు ఎకరాల స్థలం లోపు నిర్మించతలపెట్టిన సమీకృత మార్కెట్లకు రూ.2.00 కోట్లు, రెండు ఎకరాలు, ఆపైన ఉన్న స్థలంలో నిర్మించతలపెట్టిన సమీకృత మార్కెట్లకు రూ.4.50 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం అప్పట్లో ఉత్తర్వులు జారీ చేసింది. పురపాలిక యంత్రాంగం ఆయా పట్టణాల్లో సమీకృత మార్కెట్ల భవన నిర్మాణ సముదాయాల్లో భాగంగా షెడ్లు, పార్కింగ్ నిర్మాణ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేపట్టనున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సం ఘాల్లో సమీకృత మార్కెట్ల కోసం అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని అధికార యంత్రాంగం సేకరించింది. భవనాలు, పార్కింగ్, ఇతర వసతుల పనుల నిమిత్తం గత ప్రభుత్వం రూ.39.90 కోట్లు కేటాయించింది. జవహర్ నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో సమీకృత మార్కెట్ల భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణం కోసం రూ.4.5 కోట్ల చొప్పున కేటాయించింది. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ.2.00 కోట్ల చొప్పున నిధులు వెచ్చించనున్నారు.

హామీలను వెంటనే నెరవేర్చాలి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం



మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

హిమాయత్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరింది. ఈ మేరకు ఆదివారం బషీరాబాద్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలలో ఒకటైన ×ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలాన్ని×ఎఫ్‌ఐఆర్‌తో సంబంధం లేకుండా వెంటనే కేటాయించాలన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్, ఉచిత బస్‌పాస్, హెల్త్ కార్డు, వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతోపాటు సంక్షేమ పథకాలలో ప్రత్యేక కోటా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి పటోళ్ల సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కొంతం వీరస్వామి, బి.ఇంద్రకుమార్, కన్వీనర్లు గుండేటి ఐలయ్య యాదవ్, గుర్రని వెంకటేష్ గౌడ్, ఉండాటి లాలయ్య, దుగ్గని శ్యామల, వి.సదయ్య, ప్రభాకర్, కోశాధికారి జంగా సుదర్శన్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసులతో బెదిరిస్తున్నారు..

వివాదాస్పద స్థల వ్యవహారంపై బాధితుల ఆరోపణ



పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవేంకటేశ్వర కాలనీ లేఔట్ ఓపెన్ స్పేస్ వివాదం మరో మలుపు తిరిగింది. పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆదివారం యంనంపేట్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బాధితుడు పోలగోని రాజేందర్‌గౌడ్ విలేకర్ల సమావేశంలో పలు ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ యంనంపేట్‌లోని సర్వే నెంబర్ 138/1లో 2.27 ఎకరాల భూమిని 2020లో సయ్యద్ ముజఫర్ సున్నానా నుంచి తాను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని చెప్పారు. ఆ యేడాది కోవిడ్ రావడంతో భూమిని స్వాధీనం చేసుకోలేకపోయామని, అదే తరుణంలో ఆ స్థలాన్ని చెత్త డంపింగ్ చేయడానికి పోచారం పురపాలక సంఘ పాలకవర్గం వాడుకుందని పేర్కొన్నారు. తమ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. భూమిని తమకు స్వాధీనం చేయాలని కోరగా, రూ. 2 కోట్లు లేదా భూమిలో వాటా కావాలని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆలోపించారు. ఈ ఓపెన్ స్పేస్ వివాదంపై రాజీ కుదిర్చేందుకు 2వ వార్డు కౌన్సిలర్ భర్త, బీఆర్‌ఎస్ నాయకుడు నర్రి కాశయ్య రూ. 50 లక్షలు, మాజీ ఎంపీటీసీ నర్రి శ్రీశైలం 200 చదరపు గజాల స్థలం డిమాండ్ చేశారని ఆరోపించారు. అడ్డదారిలో డబ్బు సంపాదించాలనే దురాశతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ బడా నాయకుడితో చైర్మన్ కొండల్‌రెడ్డి కుమ్మక్కై బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను చెప్పినట్లు వినకపోతే పోచారం పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేయిస్తానని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. పోలీసులు నన్ను అరెస్ట్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారంటూ విచారం వ్యక్తం చేశారు. భూమికి సంబంధించిన అన్ని పత్రాలను పోలీసుస్టేషన్‌తోపాటు న్యాయస్థానంలో సమర్పించినట్లు చెప్పారు. సమస్యను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికైనా చైర్మన్ బ్లాక్ మెయిల్ రాజకీయాలను మానుకొని నిజాయితీగా పనిచేయాలని, లేదంటే పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వినయ్, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, పోలగోని శ్రీకాంత్, కొండల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'

- కోడ్ ముగియటంతో 50 రోజుల తర్వాత యంత్రాంగంలో కదలిక
- ప్రజాప్రతినిధులు కూడా అభివృద్ధి పనులపై కసరత్తు
- జిల్లాలో వేగం పుంజుకోనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో దాదాపు 50 రోజులు నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం కలెక్టరేట్‌లో సోమవారం మళ్లీ ప్రారంభంకానుంది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతోంది. ప్రజావాణికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా స్థాయిలో ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణికి కూడా అధిక ప్రాధాన్యత ఉండటనంలో అతియోశక్తి లేదు.

ప్రజావాణి అంటే...

కలెక్టరేట్‌లో ప్రజావాణి అంటే జిల్లా కలెక్టర్‌తోసహా అదనపు కలెక్టర్లు, డీఆర్వో, ఆర్డీవోలతోపాటు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారు. ప్రజల సమస్యలను దరఖాస్తుల రూపంలో స్వీకరిస్తారు. అవసరమైతే అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభానికి ముందు గతంలో వచ్చిన దరఖాస్తుల పురోగతిపై శాఖల వారీగా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించటంతోపాటు పెండింగ్ లేకుండా పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేస్తారు. అర్జీలు పెట్టుకున్న వారికి కూడా సమాచారం ఇచ్చారా... లేదానన్న విషయంపై కూడా సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆరా తీసి తగిన చర్యలు తీసుకుంటారు. వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల జరగటంతోపాటు కోడ్ నేపథ్యంలో 'ప్రజావాణి' కార్యక్రమం ఆరు నెలల వ్యవధిలో అరకొరగానే జరిగిందని చెప్పవచ్చు . అయితే...అధికార యంత్రాంగం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి..పరిష్కరించే ప్రయత్నం కూడా చేసింది.

హైదరాబాద్ తర్వాత మేడ్చల్.. పెద్ద జిల్లా..

హైదరాబాద్ జిల్లా తర్వాత జనాభాలో అతిపెద్ద జిల్లాగా మేడ్చల్-మల్కాజిగిరి ఉంది. ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివాదాలు, కోర్టు కేసులు కూడా రెవెన్యూ శాఖ పరంగా బాగానే ఉన్నాయి. హైదరాబాద్‌కు సమాంతరంగా శివారు ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. మేడ్చల్ జిల్లాలో 4 నగర పాలక సంస్థలు, 9 మున్సిపాలిటీలు, 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జీపీలు కూడా సెమీ అర్బన్ ప్రాంతాలుగా అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయి. ఇండస్ట్రీయల్ పరంగా కూడా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. పరిశ్రమలకు కేంద్రంగా మేడ్చల్ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండటంతో ప్రత్యేక కేంద్రీకరణ చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజావాణిపై జిల్లా అధికారయంత్రాంగం ముఖ్యంగా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చొరవ చూపినట్లయితే... మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పురోగతికి ఎంతో తోడ్పాటుగా ఉండగలదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో జిల్లాలో రూ.12.01 కోట్లతో 286 ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన 699 పనులు బడులు ప్రారంభమయ్యే లోపు పూర్తి చేయాల్సి ఉంది. ఆరు గ్యారంటీల్లోని అభివృద్ధి, సంక్షేమ పథకాలు వేగవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సాగాల్సి ఉంది. ప్రభుత్వ, అసైన్డ్, చెరువు శిఖం భూముల కబ్జాలను అరికట్టటంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ భవన కట్టడాలు, లే అవుట్లను నివారించాల్సి ఉందని ప్రజలు అంటున్నారు.

నేటి నుంచి ప్రజావాణి: కలెక్టర్ గౌతమ్

ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజా వాణి కార్యక్రమాన్ని ఈ నెల 10 నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్లు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉండటం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ప్రజావాణి

సాక్షి,సిటీబ్యూరో: ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు ఎలక్షన్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని, ఎన్నికల కోడ్ ముగిసినందున తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. జీహెచ్‌ఎంసీలో జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. ఈ ప్రజావాణి సందర్భంగా ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఫోన్ ఇన్ ప్రోగ్రామ్ 040-23222182 నంబర్‌కు తమ సమస్యలను విన్నవించవచ్చని తెలిపారు. ఆ తర్వాత ప్రజల నుంచి విన్నపాలను స్వీకరించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో కూడా జరుగుతుందని కమిషనర్ తెలిపారు.



గృహస్థాశ్రమ వైశిష్ట్యం

పెళ్ళి.. ఎందుకోసం?

గృహప్రవేశం చేయాలి. అప్పుడు యజుర్వేదం అంతా మనకు వచ్చా, రాదా అన్న దానితో సంబంధం లేదు. గృహప్రవేశ సందర్భంలో రాముడేం చేసాడో ఆ ఘట్టం చదువుకుంటే చాలు... ఓహ్, గృహప్రవేశం ఇలా చేయాలన్న మాట.. అన్నది తెలుస్తుంది. తండ్రిగారికి తద్దినం పెట్టాల్సి వస్తే రాముడేం చేశాడో చదువు కుంటే సరిపోతుంది. అది పెట్టవలసి వచ్చినప్పుడు ఇలా పెట్టాలని అర్థమవుతుంది. అందుకే వేదం రామాయణంగా ప్రవర్తించింది.

చంద్రవంశాన్ని అంతటినీ వ్యాసుడు రచించాడు. సూర్యవంశాన్ని అంతటినీ కూడా వాల్మీకి వర్ణించాడు. సూర్యుడు, చంద్రుడు పగలూ రాత్రి ప్రకాశిస్తారు. ఒక పగలు, ఒక రాత్రి కలిస్తే ఒక రోజు పూర్తవుతుంది. వాఙ్మయంలో రామాయణం, భారతం ఇతర పురాణాలను వాల్మీకి, వ్యాసుడు అందించారు. స్వార్థంతోనో, ప్రత్యుపకారం ఆశించో కాక దీనివల్ల ధర్మానుష్ఠాన పద్ధతులను అందరికీ అర్థమయ్యే పద్ధతిలో విడమరిచి చెప్పకపోతే జనసామాన్యానికి ఎలా తెలుస్తుందనే సదుద్దేశంతో వారు మనకు ఈ మహోపకారం చేసారు.

వివాహం ఎంత గొప్పది! వివాహం అంటేనే విశిష్టమైనది–అని. దానిని మనకు సంప్రాప్తింప చేయడానికి జరిపే సంస్కారమే వివాహం. అది ఏదో సరదాకోసం కాదురా నాయనా, వివాహం చేసుకుంటా నంటున్నావు కదా, ముందు దానిగురించి, దానిలోని ధర్మ సూక్ష్మాలను గురించి తెలుసుకో. వివాహం అంటే విశిష్టమైనదానిని పొందుట. మరి ఆ విశిష్టమైనదేది? అదే మోక్షం. దీనిని పొందడానికి యోగ్యమైనది ధర్మానుష్ఠానం. అది సక్రమంగా జరగకుండా దానికి అడ్డుపడుతున్నవి ఏవి? అర్థకామాలు రాగద్వేషాలయి పాపపుణ్యాలకు, పునర్జన్మలకు కారణమవుతాయి. అలాకాకుండా దానిని ధర్మబద్ధం చేసి పాశాలు విడిపోవడానికి సంసార ప్రవేశం జరగాలి. అటువంటి గృహస్థాశ్రమంలోకి నీవు ప్రవేశిస్తున్నావు. అలా ప్రవేశించి రాముడేం చేసాడో తెలుసా? సీతారామకళ్యాణ ఘట్టం చూడు. అక్కడ సీతమ్మ ఏం చేసింది ? అసలు పెద్దవాళ్ళనే వాళ్ళు పెళ్ళికూతురిని, పెళ్ళికొడుకుని కూర్చోబెట్టి ఏం మాట్లాడాలో పరిశీలించు. పెద్దరికం అంటే ఏమిటో కూడా తెలుస్తుంది. ఇవన్నీ తెలిస్తే సంసారంలో ఎప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి, కుటుంబ జీవితాన్ని చక్కదిద్దుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఈ ఉద్దేశంతో రుషులు దేశకాలాలతో సంబంధం లేకుండా సర్వకాలాల్లో సర్వజనులకు ఉపయోగపడే విధంగా వాటిని అందించారు. అటువంటి రుషుల రుణం మనకు జన్మతః ఉంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మీరు ఎంతో చదువుకున్నారు... సరే. మంచిదే. నేను చదువును తక్కువ చేసి చెప్పడం లేదు. కానీ చదువుతో పాటుగా నిత్యజీవితంలో మనిషి మనిషిగా ఉండడానికి కావలసిన మానవత్వాన్ని నిలబెట్టడం చాలా అవసరం. అలా అది నిలబడాలంటే... రామాయణం, భారతం తదితర గ్రంథాలను బాగా పరిశీలించాలి. అవి నిత్యపారాయణకు యోగ్యత ఉన్న గ్రంథాలు. వాటిని కనీసం రోజుకో అధ్యాయం చొప్పున అయినా చదువుకుంటూ ఉండాలి. ఇంటిపట్టున పెద్దవాళ్ళు పిల్లలతో వాటిగురించి తరచూ మాట్లాడుతూ ఉండాలి. దానివల్ల ధార్మిక జీవనం అలవడడమే గాక, మనుషుల్లో మానవత్వం మిగులుతుంది. అది లేనప్పుడు మీరు సమకూర్చుకున్న జ్ఞానం, ప్రతిభాపాటవాలు సమాజానికి ప్రమాదకరంగా మారవచ్చు.

ఆధ్యాత్మికథ

దృష్టిని బట్టి సృష్టి

ఉత్తర భారత దేశానికి చెందిన ఒక ప్రొఫెసర్ స్వామి వారి దర్శనార్థం తిరుపతి వెళ్ళాడు. తనతో పాటు సహాయకుడిగా పరిశోధక విద్యార్థిని కూడా వెంట తీసుకు వచ్చాడు. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి గుండా తిరుమలకు కాలినడకన వెళ్ళాలనేది ప్రొఫెసర్ గారి ఆలోచన. అలిపిరికి వెళ్ళి ఎత్తైన శేషాచల శిఖరాన్ని చూశారు. సముద్ర మట్టానికి 2800 అడుగుల ఎత్తులో ఉన్న ఏడుకొండల్ని చూసి భక్తి భావంతో దణ్ణం పెట్టుకున్నారు. పాదాల మండపం వద్ద శ్రీవారి లోహ పాదాలను నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణ చేస్తూ ఉండగా పరిశోధక విద్యార్థి చిన్నగా ప్రొఫెసర్‌ని ఇలా అడిగాడు. ''దేవుడు నిజంగా ఉన్నాడంటారా?'' అని.

ప్రొఫెసర్ నవ్వి ''దారిలో కనిపిస్తాడు పద!'' అని చెప్పి కాలి నడకకు పురమాయించాడు.



అలిపిరినుంచి ఆనంద నిలయుని సన్నిధికి దారి తీసే ఆ పడికట్ల దోవలో ప్రకృతి అందాలను వీక్షిస్తూ నడక ప్రారంభించారు. తలయేరు గుండు, గాలి గోపురం, ఏడవ మైలు ప్రసన్నాంజనేయ స్వామి, అక్కగార్ల గుడి, అవ్వాచారి కోన... దాటి మోకాలి మెట్టు చేరారు.

తిరుమల కొండ 'ఆదిశేషుని అంశ' అని భక్త జన విశ్వాసం. అందుకే చెప్పులు లేకుండా కొండ ఎక్కుతారు భక్తులు. ఈ కొండను పాదాలతో నడిచి అపవిత్రం చేయకూడదని శ్రీరామానుజులు, హథీరాంజీ బావాజీ మోకాళ్ళ మీద నడిచారని చెబుతారు. అప్పటినుంచి అది మోకాలి మెట్టు అయ్యిందని కూడా తెలుసుకున్నారు. అక్కడ మెట్లు నిలువుగా మోకాలి ఎత్తు ఉండటం వల్ల మోకాళ్ళు పట్టుకుపోసాగాయి పరిశోధక విద్యార్థికి.

మోకాళ్ళ నొప్పులు ఎక్కువైన ఆ విద్యార్థి గట్టిగా ''దేవుడు కనిపిస్తున్నాడు!'' అని చెప్పాడు.

చిన్న నవ్వు నవ్విన ప్రొఫెసర్, ''అనుకున్నది అనుకున్నట్లు ఎవరికీ జరగదు. అలా జరిగితే ఎవ్వరూ చెప్పిన మాట వినరు. తలచినట్లే అన్నీ జరిగితే... మనిషి దేవుడి ఉనికినే ప్రశ్నిస్తాడు. కష్టాలు, కన్నీళ్లు లేకుంటే తనంత గొప్పవాడు లేడని విర్రవీగుతాడు. అహాన్ని తలకి ఎక్కించుకున్నవాడు తనే దేవుడని చెప్పి ఊరేగుతాడు. జీవితం కష్టసుఖాల మయం కాబట్టే, మనిషి ఆ అతీత శక్తిని ఆరాధిస్తున్నాడు! అందుకే అలిపిరి వద్ద నేల మీద నడిచేటప్పుడు నీకు దేవుడి ఉనికి ప్రశ్నార్థకమయ్యింది. మోకాలిమెట్టు దగ్గరికి వచ్చేసరికి దేవుడు ఉన్నాడని అనిపించింది'' అని చెప్పి గబగబా మెట్లు ఎక్కసాగాడు.

'దృష్టిని బట్టి సృష్టి' అని తెలుసుకున్న విద్యార్థి గోవింద నామస్మరణ చేస్తూ ప్రొఫెసర్ వెనుకనే నడవసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

''పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం'' అనే జాతీయం ఉంది. అతి తక్కువ బలం ఉన్న ప్రాణి మీద అనవసరంగా అతి పెద్ద బలప్రయోగం చేయటం అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఎంత చిన్న ప్రాణి అయినా దాని అస్తిత్వం నిరుపయోగం కాదు. విశ్వంలో, ముఖ్యంగా భూగోళంలో, ప్రధానంగా అది ఉండే ప్రాంతంలో అది పోషించవలసిన పాత్ర ఒకటి ఉండనే ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, తద్వారా పర్యావరణ సమతౌల్యత ఉంటాయి. దానికి భంగం కలిగిస్తే పర్యవసానం అనుభవించ వలసి ఉంటుంది.

మంచిమాట

పిచ్చుక మీదనా బ్రహ్మాస్త్రం?



ఒక పిచ్చుక సంవత్సరంలో 6.5 కిలోల బియ్యం తింటుంది అని చైనాలో ఒకప్పుడు చేపట్టిన సర్వే తెలిపింది. మొత్తం పిచ్చుకలు లేకుండా చేయగలిగితే 60 వేల మందికి ఆహారం లభిస్తుంది అని కూడా తెలిపింది. ఇంకేముంది? అసలే అధిక జనాభా సమస్య ఉన్న చైనా, వీళ్లైనంత మందికి ఆహారం అందించటానికి ఇదొక మార్గం అనుకుని పిచ్చుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టింది. 30 లక్షల పిచ్చుకలని చంపారు.

1958 – 61 సంవత్సరాల మధ్య చైనాలో తీవ్రమైన కరవు వచ్చింది. సుమారుగా నాలుగు కోట్ల యాభై వేల మంది చని పోయారు.

కారణం ఏమై ఉంటుంది అని విచారణ చేస్తే పిచ్చుకలు లేక పోవటం వల్ల అని తేలింది. అదెట్లా? పిచ్చుకలు ధాన్యం తినటంతోపాటు పంటలని నాశనం చేసే పురుగులని కూడా తింటాయి. చీడ పురుగులని తినే పిచ్చుకలు లేక పోవటంతో పంటలకి చీడ పట్టి, తెగులు సోకి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గింది. అది రాను రాను పెరిగింది. ప్రజలు తిండి లేక చనిపోయారు.

దీనికి పరిష్కారం పంటలని నాశనం చేసే తెగుళ్లు కలిగించే పురుగులని రసాయన పదార్థాలు వాడ నవసరం లేకుండా తినేసే పిచ్చుకలు ఉండేట్టు చేయటమే అని నిర్ధారించారు. చేసేది ఏమీ లేక పిచ్చుకలని దిగుమతి చేసుకోవాలనుకున్నారు. రష్యా నుండి పిచ్చుకలని దిగుమతి చేసుకున్నారు. పరిస్థితి అదుపు లోకి వచ్చింది.

ఇటువంటి శాస్త్రీయమైన విషయాలని మన దేశంలో ఒక ఆనవాయితీగా, ఆచారంగా చేయటం అలవాటు. భారతదేశంలో, ముఖ్యంగా తెలుగువారు వరికంకులని కుచ్చుగా అల్లి ఇంటి ముందు వేలాడ దీసే వారు. పిచ్చుకలు వచ్చి ఒక్కొక్క వడ్లగింజని తీసుకు వెళ్లేవి. అది రైతు పురుగులని తిని చీడ పీడల నుండి పంటని రక్షించిన పిచ్చుక పట్ల చూపించే కతజ్ఞత. ఇంటి ముందు కొన్ని గింజలు చల్లటం అలవాటు. ఆ అవకాశం ఉన్నా, లేక పోయినా ప్రతి రోజు పక్షులకి, ప్రత్యేకంగా కాకికి తినబోయే ముందు ఒక ముద్ద పెట్టటం అలవాటు. కాకి పరిసరాల్లో ఉన్న చెత్తని, చిన్న చిన్న పురుగులని తిని శుభ్రం చేస్తుంది. దేవాలయాలలో కూడా బలిహరణం అన్న పేరుతో నాలుగు దిక్కుల అన్నం ఉంచటం సంప్రదాయం. ఇంటి చూరులో పిచ్చుక గూడు పెడితే పరమానందం. ఆ గూట్లో పెట్టిన గుడ్లను పిల్లి తినకుండా కాపలా కాయటం ఒక సరదా. అవి ఉండే ప్రదేశాలని మనం ఆక్రమించి, చెట్లని నరికి వాటికి ఆహారం లేకుండా చేసినందుకు ఈ మాత్రం చేయక పోతే కృతఘ్నులం అవుతాం. అలాగని పిల్లులని పూర్తిగా తరమం. పిల్లి తిరుగుతుంటే ఆ వాసనకి ఎలుకలు విజృంభించవు.

సృష్టిలో ప్రయోజనం లేని జీవి ఒక్కటి కూడా లేదు. గుర్తించక పోవటం మన లోపం. జాగ్రత్తగా గమనిస్తే ఇతర జీవులని, ప్రకృతిని స్వార్థానికి వాడుకుని ఎవరికీ ఉపయోగ పడని ప్రాణి మానవుడొక్కడే నేమో అనిపిస్తుంది. కనీసం పిచ్చుక పాటి అయినా చేయవద్దా?

– డా. ఎస్. అనంత లక్ష్మి

సినిమా



ఎన్టీఆర్

గోవాలో ఆటా పాటా...

మళ్లీ గోవా వెళ్లాడు దేవర. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగాన్ని ఈ ఏడాది అక్టోబరు 10న రిలీజ్ చేయనున్నట్లు గతంలో మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రంలో తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ గోవాలో ప్రారంభమైంది. ఎన్టీఆర్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో ఓ సాంగ్, కొంత టాకీ పార్ట్, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట. ఈ ఏడాది మార్చిలో 'దేవర' యూనిట్ గోవాలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించింది. ఇప్పుడు మళ్లీ గోవాలో షూటింగ్ జరుగుతోంది.



అమితాబ్

సీక్వెల్ సెట్‌లో...

గుజరాతీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు అమితాబ్ బచ్చన్. 2022లో అమితాబ్ ఓ కీలక పాత్రలో నటించిన 'ఫక్త్ మహిళా మాటే' చిత్రానికి సీక్వెల్ ఇది. యశ్ సోనీ, దీక్షా జోషి ప్రధాన పాత్రల్లో నటించిన 'ఫక్త్ మహిళా మాటే'కు మంచి ప్రేక్షకాదరణ దక్కింది. జై బోదాస్ దర్శకత్వంలో ఆనంద్ పండిట్, వైశాల్ షా ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఫక్త్ పురుషో మాటే' అనే సినిమాను ఆరంభించారు. అమితాబ్, యశ్ సోనీ, మిత్ర గాఢ్వీ, ఇషా కన్సారా, దర్శన్ జరీవాలా సీక్వెల్‌లో ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. ఈ సీక్వెల్‌ని పార్థ్ త్రివేదీతో కలిసి జై బోదాస్ దర్శకత్వం వహిస్తుండటం విశేషం. ప్రస్తుతం అమితాబ్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ''అమితాబ్ బచ్చన్‌గారితో ఓసారి పని చేసిన ఎవరైనా ఆయనతో మళ్లీ వర్క్ చేయాలనుకుంటారు. అమితాబ్‌గారి ఎనర్జీ, అంకితభావం సెట్స్‌లో ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది'' అని పేర్కొన్నారు నిర్మాత ఆనంద్ పండిట్. ఈ సంగతి ఇలా ఉంచితే... మహిళల మనసుల్లో ఏముందో తెలుసుకోగల శక్తులు ఓ కుర్రాడికి వస్తాయి. వాటితో ఆ యువకుడు ఏం చేశాడు? విడిపోతున్న ప్రేమికులను ఎలా కలిపాడు? అనే అంశాలతో 'ఫక్త్ మహిళా మాటే' చిత్రం సాగుతుంది. ఇక సీక్వెల్ మగవారి కోణంలో ఉంటుందని టైటిల్ స్పష్టం చేస్తోంది.

ఆమెతో నమ్మకం మొదలవుతుంది



దీపికా పదుకోన్

ప్రభాస్ హీరోగా నటించిన తాజా పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ ఈ సినిమా ద్వారా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. కాగా ఈ మూవీ ట్రైలర్‌ని నేడు విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, దీపికా పదుకోన్ లుక్‌ను విడుదల చేసింది. 'ది హోప్ బిగిన్స్ విత్ హర్' (ఆమెతో నమ్మకం మొదలవుతుంది) అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన దీపిక లుక్ నెట్టింట వైరల్‌గా మారింది. ''సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా 'కల్కి 2898 ఏడీ' రూపొందింది. మహాభారత పురాణ ఘటనల నుండి మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యే కథ ఇది. గతం, భవిష్యత్తుతో ముడిపడిన ఆరువేల ఏళ్ల వ్యవధిలో ఈ చిత్రకథ నడుస్తుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్.

విలన్ వచ్చేశాడు

శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ యాక్షన్ ప్యాక్డ్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలోని విలన్ పాత్రకు బాలీవుడ్ నటుడు విద్యుత్ జమాల్‌ను తీసుకున్నారు మేకర్స్. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించి, సెట్స్‌లో విద్యుత్ జమాల్ పాల్గొన్న వీడియోను కూడా షేర్ చేశారు. ''నా స్నేహితుడు విద్యుత్ జమాల్‌తో కలిసి మళ్లీ వర్క్ చేయడం సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు మురుగదాస్. విజయ్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ 'తుపాకీ'లో విద్యుత్ జమాల్ విలన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.



విద్యుత్ జమాల్

ఈ నెలలోనే లాక్‌డౌన్!



అనుపమా పరమేశ్వరన్

ఈ నెలలోనే లాక్‌డౌన్ అంటున్నారు హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. కానీ కంగారు పడవలసిన అవసరం ఏమీ లేదు. ఎందుకంటే... ఆమె చెబుతున్నది 'లాక్‌డౌన్' సినిమా గురించి. అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లాక్‌డౌన్'. ఏఆర్ జీవాను దర్శకుడిగా పరిచయం చేస్తూ లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. కాగా ఈ సినిమాలో అనిత అనే పాత్రలో అనుపమా పరమేశ్వరన్ నటించినట్లుగా తెలుస్తోంది. లాక్‌డౌన్‌లో చిక్కుకుపోయి కష్టాలు పడుతున్న ఓ యువతి నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందట. లాక్‌డౌన్ కష్టాలతోపాటు కరోనా వైరస్ గురించిన అంశాలను ఈ సినిమాలో కాస్త సీరియస్‌గానే చూపిస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. చార్లీ, నిరోషా, ప్రియా వెంకట్, లివింగ్‌స్టన్, ఇందుమతి, రాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు ఎన్ఆర్ రఘునందన్, సిద్ధార్థ్ విపిన్ సంగీతం అందించారు. ఈ సినిమాకు కెమెరా: వీజే సాబు జోసెఫ్.

టీజర్ రొమాంటిక్‌గా ఉంది

– అక్కినేని అమల

చైతన్యా రావ్, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ రొమాంటిక్ కామెడీ సినిమాను బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అక్కినేని అమల మాట్లాడుతూ– ''తెలుగు సినిమాకు దర్శకత్వం వహించాలన్న బాల రాజశేఖరుని ఆకాంక్ష ఈ సినిమాతో నెరవేరింది. మా అన్నపూర్ణ కాలేజ్ విద్యార్థులు, సిబ్బందిని కూడా ఈ మూవీలోకి తీసుకున్నందుకు హ్యాపీగా ఉంది. టీజర్ ఫన్నీగా, రొమాంటిక్‌గా ఉంది. నేటి సమాజంలోని వివాహ బంధాల గురించి ఒక బలమైన కథను ప్రేక్షకులకు చూపించబోతున్నట్లుగా టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''రొమాంటిక్ కామెడీగా 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సుచిన్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ వారు మా చిత్రాన్ని విడుదల చేస్తున్నారు'' అన్నారు బాల రాజశేఖరుని. తనికెళ్ల భరణి, సుహాసిని, అరవింద్ కృష్ణ, అలీ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: కల్యాణీ మాలిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: ఆర్పీ పట్నాయక్, కెమెరా: శిష్టా వీఎమ్‌కే.



బాల రాజశేఖరుని, అమల

భూగోళానికే నా చెలి అందం



శ్రీకమల్, తాన్వీ

''ప్రపంచానికే జాబిలి అందం.. భూగోళానికే నా చెలి అందం... ఇంతందాన్ని ఎవరైనా చూశారా..'' అంటూ సాగే పాట 'ఉషా పరిణయం' సినిమాలోనిది. 'నువ్వే కావాలి, మన్మథుడు, మల్లీశ్వరి' వంటి చిత్రాలను తెరకెక్కించిన కె. విజయభాస్కర్ స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉషా పరిణయం'. ఈ మూవీలో ఆయన తనయుడు శ్రీకమల్ హీరోగా నటించారు. తెలుగు అమ్మాయి తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఆకాశానికే జాబిలి అందం...' అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ చిత్ర సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధ్రువన్ పాడిన ఈ పాటకు అలరాజు సాహిత్యం అందించారు. ''ప్రేమకు నేనిచ్చే నిర్వచనం ఈ సినిమా. అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు కె. విజయభాస్కర్.

మూడు షెడ్యూల్స్‌లో...



అవినాష్, సిమ్రాన్

అవినాష్ తిరువీధుల, సిమ్రాన్ చౌదరి జంటగా కొత్త సినిమా షురూ అయింది. కార్తీ దర్శకత్వంలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ ఎల్ఎల్‌పీపై శాంతనూపతి, ఆలపాటి రాజా, అవినాష్ బుయాని, అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. తొలి సీన్‌కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి క్లాప్ కొట్టగా, దర్శకుడు బాబీ దర్శకత్వం వహించారు. దర్శకుడు కార్తీ మాట్లాడుతూ– ''కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది. నేడు రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, మూడు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం'' అన్నారు. ''మంచి సినిమా తీయాలనే సంకల్పంతో అమెరికా నుంచి వచ్చాం'' అన్నారు శాంతనూపతి. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు అంబికా కృష్ణ, దామోదర ప్రసాద్, టి. రామసత్యనారాయణ, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌నాయుడు, రచయిత విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎ. విశ్వనాథ్, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: రాంబాబు కుంపట్ల.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,619	469
76,693	23,290

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,133	▽	40
డోజోన్స్	38,799	▽	87
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,245	▽	40
డాక్స్	18,557	▽	95
షాంఘై	3,051	△	2
నికాయ్	38,684	▽	20

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.54	85.22
£	బ్రిటన్ పౌండ్		104.33	109.19
€	యూరో		88.64	93.11
¥	జపాన్ ఎన్ (100)		41.00	66.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.23	58.01
S$	సింగపూర్ డాలర్		59.69	64.36
SAR	సౌదీ రియాల్		21.34	22.89
UAE D	యూఏఈ దిర్హామ్		21.81	23.60
¥	చైనా యువాన్		10.39	12.46

బంగారం బంగారమే



కాలంతో పాటే దేశీ కరెన్సీ విలువ తరిగిపోతుంటుంది. కానీ, కాలంతోపాటే విలువ పెంచుకుంటూ వెళ్లే వాటిల్లో బంగారం కూడా ఒకటి. అందుకే ప్రతి ఒక్కరి పెట్టుబడుల్లో బంగారానికి (గోల్డ్) తప్పక చోటు ఇవ్వాలి. ఇటీవలి కాలంలో బంగారంలో మంచి ర్యాలీ చూస్తున్నాం. ప్రతి ఏటా పసిడి ఇదే మాదిరి పరుగు పెట్టకపోవచ్చు. కానీ, దీర్ఘకాలంలో మంచి రాబడిని ఇచ్చే విషయంలో నిజంగా 'బంగారమే' అని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందే. 2017–18 సంవత్సరం సావరీన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ)లో ఇన్వెస్ట్ చేసినవారికి గడిచిన ఐదేళ్లలో ఏటా 16.5 శాతం రాబడి వచ్చింది. సంప్రదాయ డెట్ సాధనాల కంటే రెట్టింపు రాబడి బంగారంలో రావడం అంటే మామూలు విషయం కాదు. ఈక్విటీల స్థాయిలో బంగారం రాబడి ఇవ్వడం విశేషం. అందుకే దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే వారు బంగారానికి తప్పక చోటు ఇవ్వాలి. ఏ రూపంలో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ ప్రయోజనమో తెలియజేసే కథనమే ఇది.



బంగారంపై పెట్టుబడికి మెరుగైన ఆప్షన్

- సావరీన్ గోల్డ్ బాండ్
- ఎనిమిదేళ్లు కొనసాగితే లాభంపై సున్నా పన్ను
- పెట్టుబడిపై ఏటా 2.5 శాతం వడ్డీ రాబడి
- అందుబాటులో గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్స్
- పతి ఒక్కరి పోర్ట్‌ఫోలియోలో పసిడి ఉండాల్సిందే

వివిధ సాధనాలు

బంగారంలో ఇన్వెస్ట్ చేయడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఆభరణాలను పెట్టుబడిగా చూడొద్దు. ధరించడానికి కావాల్సినంత వరకే ఆభరణాలకు పరిమితం కావాలి. పెట్టుబడి కోసం అయితే ఎలక్ట్రానిక్ రూపంలో ఎన్నో సాధనాలు ఉన్నాయి. వీటిల్లో తమకు నచ్చిన దానిని ఎంపిక చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్స్, సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీలు), డిజిటల్ గోల్డ్ అందుబాటులో ఉన్న పలు రకాల సాధనాలు. వీటన్నింటిలోకి ఎస్‌జీబీలు ఎక్కువ ప్రయోజనకరం.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

స్టాక్స్ మాదిరే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో నిత్యం ట్రేడ్ అవుతుంటాయి. ఇందులో చార్జీలు, వ్యయాలు చాలా తక్కువ. భౌతిక బంగారం ధరలకు అనుగుణంగానే గోల్డ్ ఈటీఎఫ్ ధర ఏరోజుకారోజు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో మారుతుంటుంది. నచ్చినప్పుడు కొనుగోలు చేసుకుని, అవసరమైనప్పుడు సులభంగా విక్రయించుకోవచ్చు. వీటిల్లో ఎక్స్‌పెన్స్ రేషియో రూపంలో ఏటా నిర్ణీత మొత్తాన్ని చార్జీగా తీసుకుంటారు. వీటిల్లో ఇన్వెస్ట్ చేయాలంటే డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. ఉదాహరణకు ఎల్‌ఐసీ గోల్డ్ ఈటీఎఫ్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో 0.41 శాతంగా ఉంది. ఈ ఫండ్‌లో రూ.లక్ష ఇన్వెస్ట్ చేశారనుకోండి. దీనిపై 0.41 శాతం ప్రకారం రూ.410ని ఎక్స్‌పెన్స్ రేషియో కింద ఎల్‌ఐసీ మ్యూచువల్ ఫండ్ వసూలు చేస్తుంది. ఇది కూడా సంవత్సరానికి ఒకే విడతగా కాకుండా, ఏ రోజుకారోజు ఇన్వెస్టర్ యూనిట్ల నుంచి తీసుకుంటుంది. పెట్టుబడులను ఉపసంహరించుకుంటే ఎగ్జిట్ లోడ్ ఉండదు. పెట్టుబడులపై వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి చూపించి, తాము ఏ శ్లాబు పరిధిలోకి వస్తే ఆ మేరకు పన్ను చెల్లించాలి.

గోల్డ్ ఫండ్స్

ఇన్వెస్టర్ల పెట్టుబడులను తీసుకెళ్లి గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడమే గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ చేసే పని. కనుక వీటికి బదులు నేరుగా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోనే పెట్టుబడులు పెట్టుకోవచ్చు. కానీ, కొందరికి గోల్డ్ మ్యూచువల్ ఫండ్సే అనుకూలం. ఎలా అంటే.. గోల్డ్ ఈటీఎఫ్ ఒక యూనిట్ ఒక గ్రాము బంగారం పరిమాణంలో ట్రేడవుతుంటుంది. కనుక ఎంతలేదన్నా ఒక గ్రాము బంగారం స్థాయిలో ఒకే విడత ఇన్వెస్ట్ చేసుకోవాల్సి వస్తుంది. అదే గోల్డ్ మ్యూచువల్ ఫండ్‌లో అయితే రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడికి డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. కొనుగోలు చేసిన యూనిట్లు డీమ్యాట్ ఖాతాకే జమ అవుతాయి. కానీ గోల్డ్ ఫండ్స్‌లో పెట్టుబడులకు డీమ్యాట్ ఖాతా తప్పనిసరి కాదు. కాకపోతే గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకునే వారికి కొంచెం అదనపు భారం పడుతుంది. గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడం వల్ల అక్కడ ఎక్స్‌పెన్స్ రేషియో.. తిరిగి గోల్డ్ మ్యూచువల్ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో పేరిట రెండు సార్లు చార్జీ చెల్లించాల్సి వస్తుంది. వీటిల్లో పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని రిటర్నుల్లో చూపించి, తమ శ్లాబు రేటు ప్రకారం చెల్లించాలి.



డిజిటల్ గోల్డ్

ఫోన్‌పే, పేటీఎం, పలు ఫిన్‌టెక్ సంస్థలు డిజిటల్ గోల్డ్ కొనుగోలుకు వీలు కల్పిస్తున్నాయి. రూపాయి నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎప్పుడు కావాలంటే అప్పుడు విక్రయించుకోవచ్చు. ఇన్వెస్టర్ కొనుగోలు చేసిన పరిమాణం మేర అసలైన బంగారం ఖజానాల్లో భద్రపరుస్తారు. కొంత మొత్తం సమకూరిన తర్వాత (కనీసం 10 గ్రాములు అంతకుమించి) భౌతిక రూపంలో తీసుకోవచ్చు. లేదా ఎంపిక చేసిన జ్యుయలరీ సంస్థల్లో ఆభరణాల కిందకు మార్చుకోవచ్చు. అవసరం ఏర్పడితే దీనిపై రుణం పొందొచ్చు. ఇందులో కాస్త చార్జీలు ఎక్కువ. ఒక ఇన్వెస్టర్ ఒక ప్లాట్‌ఫామ్‌లో గరిష్ఠంగా రూ.2లక్షలు మించి కొనుగోలు చేయలేరు. ఆర్‌బీఐ, సెబీ తదితర నియంత్రణ సంస్థల పర్యవేక్షణ వీటిపై ఉండదు. ఇందులో వచ్చే లాభాలు సైతం వార్షిక ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది.



బంగారం బాండ్లు

భౌతిక బంగారంపై పెట్టుబడుల ఒత్తిడిని తగ్గించేందుకు.. డిజిటల్ రూపంలో బంగారంపై పెట్టుబడులను, పారదర్శకతను ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకొచ్చిన సాధనమే సావరీన్ గోల్డ్ బాండ్స్ పథకం. ప్రతీ ఆర్థిక సంవత్సరంలోనూ ఒకటికి మించిన పర్యాయాలు ఎస్‌జీబీలను ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ విక్రయిస్తుంటుంది. ఒక గ్రాము డినామినేషన్ రూపంలో బాండ్లను కొనుగోలు చేసుకోవచ్చు. ఇష్యూ సమయంలో ఒక గ్రాము ధర ఎంతన్నది ఆర్‌బీఐ ప్రకటిస్తుంటుంది. బ్యాంక్‌లు, బ్రోకరేజీ సంస్థలు, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ కొనుగోలుకు అవకాశం కల్పిస్తుంటాయి. ఈ బాండ్ కాల వ్యవధి ఎనిమిదేళ్లు. ఇందులో పెట్టుబడిపై ఏటా 2.5 శాతం చొప్పున ఎనిమిదేళ్ల పాటు వడ్డీని ఆర్‌బీఐ ప్రతి ఆరు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తుంది. ఎనిమిదేళ్ల తర్వాత బంగారం మార్కెట్ ధర ప్రకారం ఇన్వెస్టర్‌కు ఆర్‌బీఐ చెల్లింపులు చేస్తుంది. లాభంపై పన్ను లేకపోవడం, ఏటా 2.5 శాతం రాబడి వల్ల అన్నింటిలోకి ఇది మెరుగైన సాధనం అని చెప్పుకోవాలి. ఇక ఎస్‌జీబీపై ఏటా వచ్చే 2.5 శాతం వడ్డీ రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. రిటర్నుల్లో 'ఇన్‌కమ్ ఫ్రమ్ అదర్ సోర్సెస్'లో చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎనిమిదేళ్ల పాటు పెట్టుబడి కొనసాగించినట్టయితే.. వచ్చే మూలధన లాభంపై పన్ను ఉండదు. మధ్యలోనే వైదొలిగితే లాభం పన్ను పరిధిలోకి వస్తుంది. ''ఏడాదిలోపే విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి కలిపి రిటర్నుల్లో చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది తర్వాత విక్రయించేట్టు అయితే లాభంపై 10 శాతం పన్ను చెల్లించాలి. లాభం నుంచి ద్రవ్యోల్బణాన్ని తీసేసే ఇండెక్సేషన్ ఎంపిక చేసుకుంటే కనుక 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది''అని ఆర్ఎస్ఎం ఇండియా వ్యవస్థాపకుడు సురేష్ సురానా తెలిపారు. ఈ బాండ్‌కు ప్రభుత్వ హామీ ఉంటుంది.

రాబడులు

బంగారంపై పెట్టుబడి దీర్ఘకాలంలో డెట్ కంటే మెరుగైన రాబడే ఇచ్చినట్టు చారిత్రక గణాంకాలు చెబుతున్నాయి. గడిచిన 20 ఏళ్లలో ఏటా 11 శాతం కాంపౌండెడ్ రాబడిని బంగారం ఇచ్చింది.

సంవత్సరం వారీ 10 గ్రాముల బంగారం ధరలు (రూపాయిల్లో)

సంవత్సరం	ధర
2015	26,343
2016	28,623
2017	29,667
2018	31,438
2019	35,220
2020	48,651
2021	48,720
2022	52,670
2023	65,330
2024	71,913



ఎస్‌జీబీల్లో రాబడి

ఇండియా బులియన్‌అండ్ జ్యుయలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రకటించే 999 స్వచ్ఛత బంగారం (గత మూడు పనిదినాల్లోని సగటు)ధరను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకుంటుంది. ఐబీజేఏ ధర మార్కెట్ ఆధారితమే. మొదటి విడత జారీ చేసిన ఎస్‌జీబీ 2016– సిరీస్1 బాండ్ గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 8న ముగిసింది. నాడు ఒక గ్రాము బాండ్ రూ.2,600కు విక్రయించారు. గడువు ముగిసిన రోజు ఆర్‌బీఐ నిర్ణయించిన ధర రూ.6,271. ఇందులో ఇన్వెస్ట్ చేసి చివరి వరకు కొనసాగిన వారికి ఏటా 11% రాబడి వచ్చింది. 2.5% వడ్డీ రాబడిని కలిపి చూస్తే వార్షికంగా 11.63 శాతం చొప్పున నికర రాబడి వచ్చినట్టు. ఇది బంగారం గత 20 ఏళ్ల సగటు రాబడి కంటే ఎక్కువే ఉండడం గమనార్హం. తర్వాత వచ్చిన సిరీస్‌లపై రాబడులు మరింత అధికంగా ఉంటున్నాయి.

సిరీస్-8, 9 రాబడులు

బాండ్	జారీ తేదీ	జారీ ధర (రూ.లో)	మెచ్యూరిటీ ధర (రూ.లో)	వడ్డీ రాబడి
ఎస్‌జీజీ 2017-18,సిరీస్-8	20 నవంబర్ 2017	2,961	7,217	16.50
ఎస్‌జీజీ 2017-18, సిరీస్-9	27 నవంబర్ 2017	2,964	7,217	16.44



2017 నవంబర్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 మధ్య నిఫ్టీ50 సూచీ ఇచ్చిన వార్షిక కాంపౌండెడ్ రాబడి 13.62% ఎస్‌జీజీ సిరీస్-8,9 కంటే తక్కువగా ఉండడం గమనించొచ్చు. (వడ్డీ శాతాల్లో)

ఇతర వివరాలు

ఎస్‌జీబీలపై వడ్డీని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇన్వెస్టర్ బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారు. చివరి ఆరు నెలల వడ్డీ, మెచ్యూరిటీతో కలిపి ఇస్తారు. ఒక ఇన్వెస్టర్ కనిష్ఠంగా ఒక గ్రాము, గరిష్ఠంగా ఒక ఆర్థిక సంవత్సరంలో 4 కిలోల వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఎస్‌జీబీలను ఎనిమిదేళ్ల పాటు గడువు పూర్తయ్యే వరకు కొనసాగించినప్పుడే లాభంపై ఎలాంటి పన్ను పడదు. ఒకవేళ ఈ మధ్యలోనే వైదొలిగితే లాభం వార్షిక ఆదాయానికి కలిపి చూపించి పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారికి ప్రతి గ్రాముపై రూ.50 తగ్గింపు లభిస్తుంది.

కేటాయింపులు ఎంత మేర?

ఒకరి మొత్తం పెట్టుబడుల్లో కనీసం 5% బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవాలన్నది నిపుణుల సూచన. గరిష్ఠంగా 10 వరకు కేటాయించుకోవ చ్చు. మోస్త రు రాబడులు వచ్చినా ఫర్వాలేదు, రిస్క్ వద్దనుకునే ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలో 15% వరకు కూడా బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవ చ్చు. కానీ, పెట్టుబడి కోసం భౌతిక బంగారం అంత మెరుగైన ఆప్షన్ కాబోదు. ఎందుకంటే అసలు బంగారం ధరకు తోడు, కొనుగోలు ధరపై 3% మేర జీఎస్‌టీని భరించాల్సి ఉంటుంది. అదే పెట్టుబడి కోసం అని చెప్పి ఆభరణాలు కొనుగోలు చేస్తే దానిపై తయారీ చార్జీలు, తరుగు భరించాల్సి వ స్తుంది. ఇవన్నీ నికర రాబడులను ప్రభావితం చే స్తాయి. కనుక బంగారంపై పెట్టుబడి ఎప్పుడూ కూ డా డిజిటల్‌గానే ఉంచుకోవడం మంచి ఆప్షన్ అవుతుంది. దీనివల్ల భద్రతాపరమైన రిస్క్ కూడా ఉండదు.

ముందస్తు ఉపసంహరణ ఎలా?

ఎస్‌జీబీ కాల వ్యవధి ఎనిమిదేళ్లు అయినప్పటికీ.. కోరుకుంటే ఆ లోపు కూడా విక్రయించుకోవచ్చు. కొనుగోలు చేసిన తేదీ నుంచి ఐదేళ్లు ముగిసిన తర్వాత ఆర్‌బీఐ ముందస్తు ఉపసంహరణకు వీలు కల్పిస్తోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ అవకాశం ఉంటుంది. బంగారం బాండ్‌పై ఆరు నెలలకు ఒకసారి ఆర్‌బీఐ వడ్డీ చెలిస్తుందని చెప్పుకున్నాం కదా. ఆ వడ్డీ చెల్లింపు తేదీ నుంచి 21 రోజుల ముందు వరకు ఇన్వెస్టర్ తన వద్దనున్న బాండ్‌ను ఆర్‌బీఐకి ఇచ్చేయాలి. దీనిపై ఎలాంటి చార్జీలు ఉండవు. ఇక ఇన్వెస్ట్ చేసిన తేదీ నుంచి ఐదేళ్లలోపే బాండ్‌ను విక్రయించుకోవాలంటే.. ఉన్న ఏకైక మార్గం స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ లేదా బీఎస్ఈ). కాకపోతే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో కొనుగోలుదారులు పరిమితంగా ఉంటుంటారు. లిక్విడిటీ తక్కువగా ఉంటుంది. కొనుగోలుదారు అందుబాటులో ఉంటే విక్రయించుకోవచ్చు. కాకపోతే డిమాండ్ తక్కువ కనుక మార్కెట్ రేటు కంటే తక్కువకే ఇక్కడ విక్రయాలు నమోదవుతుంటాయి. బంగారం బాండ్ భౌతిక రూపంలో ఉంటే దాన్ని డీమెటీరియలైజ్ చేసుకున్న తర్వాతే విక్రయించుకోవడం సాధ్యపడుతుంది.



టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్

మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్



ప్రైవేట్ రంగ జీవిత బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది జూన్ 15 వరకు అందుబాటులో ఉంటుంది. యూనిట్ ఎన్ఏవీ రూ.10గా ఉంటుంది. టాటా ఏఐఏ పాలసీదారులు కంపెనీకి చెందిన ఫార్చూన్ ప్రో, వెల్త్ ప్రో, ఫార్చూన్ మ్యాక్సిమా వంటి యులిప్ పథకాలు, వినూత్న పరమ్ రక్షక్ ప్లస్, ప్రో–ఫిట్ వంటి పథకాల ద్వారా ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 మూమెంటమ్ 50 ఇండెక్స్‌లో అధిక వృద్ధి అవకాశాలున్న టాప్ 50 కంపెనీల పనితీరును ఇది ట్రాక్ చేస్తుంది. దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధిని, మెరుగైన రాబడులను కోరుకుంటున్న ఇన్వెస్టర్లకు ఇది అనువైనదని సంస్థ తెలిపింది. గడిచిన 9 ఏళ్లలో మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ 11 రెట్లు పెరిగినట్లు వివరించింది. తయారీ.. సర్వీసులు వృద్ధి చెందుతుండటం, వినియోగ డిమాండ్ పెరుగుతుండటం, పొదుపు మొత్తాలు ఈక్విటీల వైపు మళ్లుతుండటం వంటి అంశాలు ఈ విభాగ సంస్థలకు సానుకూలమని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-6-2024

విశాఖ	475–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470–00
విజయవాడ	475–00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00

రాబడుల్లో స్థిరత్వం.. డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్



మార్కెట్లో అన్ని విభాగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసుకోవాలనుకునే వారు తమ పోర్ట్‌ఫోలియోలో ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌కు చోటు కల్పించుకోవచ్చు. ఈ విభాగంలో డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తున్న వాటిల్లో ఒకటిగా ఉంది.

రాబడులు

గడిచిన ఆరు నెలల కాలంలో ఈ పథకం 7.32 శాతం రాబడిని ఇచ్చింది. అదే ఏడాది కాలంలో రాబడి 27.50 శాతంగా ఉంది. మూడేళ్లలో 13.43 శాతం, ఐదేళ్లలో 16.58 శాతం, ఏడేళ్లలో 14 శాతం, పదేళ్లలో 14.30 శాతం చొప్పున ఏటా రాబడులు ఈ పథకంలో ఉన్నాయి. ఈ పథకం 1997 ఏప్రిల్ 29న ప్రారంభమైంది. నాటి నుంచి చూస్తే ఏటా 19 శాతం రాబడిని ఇచ్చింది. గతంలో ఈ పథకం మల్టీక్యాప్‌గా ఉండేది. మ్యూచువల్ ఫండ్స్ పథకాల పునర్‌వ్యవస్థీకరణ అనంతరం సెబీ ఆదేశాల మేరకు ఫ్లెక్సీక్యాప్ విభాగం కిందకు మారింది. మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో వార్షిక రాబడి కనీసం 12 శాతంపైన ఉంటే దాన్ని మెరుగైనదిగా నిపుణులు పరిగణిస్తుంటారు.

పెట్టుబడుల విధానం

లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో ఆకర్షణీయమైన పెట్టుబడుల అవకాశాలను ఈ పథకం ఎంపిక చేసుకుంటుంది. ఒక విభాగంలో వ్యాల్యుయేషన్స్ ఖరీదుగా మారిన సందర్భాల్లో పెట్టుబడులు తగ్గించుకుని, ఆకర్షణీయంగా ఉన్న ఇతర విభాగాల్లోకి అధిక పెట్టుబడులు మళ్లిస్తుంటుంది. నాణ్యమైన, సత్తా ఉన్న కంపెనీలను ఎంపిక చేసుకుని, ఎక్కువ కాలం పాటు కొనసాగడాన్ని అనుసరిస్తుంది. మార్కెట్ కరెక్షన్లలో ఎక్కువగా పెట్టుబడులు పెడుతుంటుంది. లార్జ్‌క్యాప్‌నకు ఎక్కువ కేటాయింపులు చేయడం ద్వారా 2008, 2011, 2015, 2020 మార్కెట్ పతనాల్లో నష్టాలను పరిమితం చేసింది. అదే సమయంలో మార్కెట్ ర్యాలీల్లోనూ మెరుగైన ప్రదర్శనే చేసింది. 2020 మార్చి మార్కెట్ పతనం సమయంలో ఈక్విటీల్లో పెట్టుబడులు 93 శాతంగానే ఉన్నాయి. మార్కెట్ల విలువలు గరిష్టాలకు చేరాయన్న జాగ్రత్తతో నగదు నిల్వలను 7 శాతానికి పెంచుకుంది. అదే ఏడాది దిద్దుబాటు అనంతరం క్రమంగా ఈక్విటీల్లో పెట్టుబడులను పెంచుకుంది.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ. 10,409 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 97.39 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 2.61 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. 63 శాతం పెట్టుబడులను లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. మిడ్‌క్యాప్ కంపెనీలకు 31.63 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 4.77 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. ఎక్స్‌పెన్స్ రేషియో 1.75 శాతంగా ఉంది. ఒక విధంగా ఈ పథకం ఇన్వెస్టర్ల నుంచి ఎక్కువ చార్జీ వసూలు చేస్తున్నట్టు భావించొచ్చు. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 56 స్టాక్స్ ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోని పరిశీలిస్తే.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, 33 శాతం మేర పెట్టుబడులను ఈ రంగాల కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఇండస్ట్రియల్స్‌కు 11.95 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీకి 11.22 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 10 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 8.79 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్ (అంకెలు శాతాల్లో)

కంపెనీ	పెట్టుబడులు
బజాజ్ ఫైనాన్స్	6.49
ఐసీఐసీఐ బ్యాంక్	5.96
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.25
మదర్సన్ సుమీ	4.08
యాక్సిస్ బ్యాంక్	3.47
అవెన్యూ సూపర్‌మార్ట్స్	3.21
పాలీక్యాబ్ ఇండియా	2.81
ఇన్ఫోసిస్	2.72
ఇండస్ టవర్స్	2.64
గుజరాత్ ఫ్లోరోకెమ్	2.37

స్టాక్ స్కూప్

జాగిల్ ప్రీపెయిడ్ | ఈక్విరస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 281 టార్గెట్: రూ. 400

ఎందుకంటే: జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్.. సాస్(ఎస్ఏఏఎస్) ఆధారిత వినియోగ వ్యయ(స్పెండ్స్) మేనేజ్‌మెంట్, అనలిటిక్స్ లీడింగ్ ప్లాట్‌ఫామ్. కంపెనీ ప్రత్యేక బిజినెస్ మోడల్‌ను కలిగి ఉంది. ప్రధానంగా చానల్ భాగస్వాములు, ఉద్యోగులు, వెండార్ ప్లాట్‌ఫామ్స్ కోసం ఉద్యోగుల(ఎంప్లాయీ) రీఇంబర్స్‌మెంట్స్, పన్ను లబ్ధి(ట్యాక్స్ బెనిఫిట్స్), రివార్డులు, ప్రోత్సాహకాల(ఇన్సెంటివ్స్) సంబంధ సర్వీసులు అందిస్తోంది. ప్రొడక్ట్ ద్వారా లబ్ధి పొందుతున్న కార్పొరేట్ల నుంచి ఆదాయంలో ప్రత్యక్షంగా 10 నుంచి 20 శాతమే సమకూర్చుకుంటోంది. ఇది అటు కార్పొరేట్లకు ఇటు కంపెనీకి ప్రయోజకారిగా నిలుస్తోంది. కార్డుల వినియోగం జరిగే లేదా రివార్డ్ వోచర్లు రీడీమ్ అయ్యే మర్చంట్ల నుంచి మిగిలిన ఆదాయాన్ని పొందుతోంది. కార్యకలాపాలు విస్తరించిన మూడు ప్రొడక్టుల విభాగాలలోనూ సరైన పోటీదారులు లేకపోవడం కంపెనీకి బలాన్నిస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికల్లా కంపెనీ సర్వీసులందిస్తున్న రంగం దేశీ మార్కెట్ పరిమాణం రూ. 13,900 కోట్లకు చేరుతుందని పరిశ్రమ వర్గాల అంచనా. కంపెనీ లైఫ్‌సైకిల్‌లో ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉన్నట్లు భావిస్తున్నాం. వెరసి కొత్త కస్టమర్లను పొందడం, ప్రస్తుత కస్టమర్లకూ ఇతర ప్రొడక్టులను విక్రయించగలగడం(క్రాస్ సెల్లింగ్), కొత్త ప్రొడక్టులను ప్రవేశపెట్టడం, విదేశాలలోనూ కార్యకలాపాలు విస్తరించడం తదితరాల ద్వారా కంపెనీ భారీ వృద్ధికి పలు అవకాశాలున్నాయి. ఇటీవల జోయర్ పేరుతో విడుదల చేసిన వెండార్ పేమెంట్స్ సొల్యూషన్స్ దీనికి జత కలవనుంది.



ఆస్క్ ఆటోమోటివ్ | జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుతధర:రూ. 314 టార్గెట్: రూ. 375

ఎందుకంటే: ప్రధానంగా ద్విచక్ర వాహన రంగంలో బ్రేక్ షూ, డ్రమ్ బ్రేకింగ్ సిస్టమ్స్ తయారీలో దేశీయంగా ఆస్క్ ఆటోమోటివ్ నాయకత్వ స్థాయిలో ఉంది. రెండు విభాగాలు కలిపి 50 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. టూవీలర్ బ్రేకింగ్‌లోకి ఆలస్యంగా ప్రవేశించినప్పటికీ ఈ రంగంలో వినియోగించే తేలికపరచే(లైట్ వెయిటింగ్) అల్యూమినియం విడిభాగాలు, సేఫ్టీ కంట్రోల్ కేబుళ్ల(ఎస్‌సీసీ) తయారీలో సుప్రసిద్ధ కంపెనీగా కార్యకలాపాలు విస్తరించింది. మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. ఇందుకు సొంత సాంకేతికతల అభివృద్ధి, డిజైన్, ఇంజినీరింగ్ సామర్థ్యాలు తోడ్పాటునిస్తున్నాయి. ప్రొప్రయిటరీ ఫార్ములేషన్స్ వినియోగించడం ద్వారా కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన సొల్యూషన్లను అభివృద్ధి చేసి అందిస్తోంది. అంతేకాకుండా నాణ్యత, ధర, డెలివరీలపై దృష్టి పెట్టడం ద్వారా కస్టమర్లకు చేరువగా నిలుస్తోంది. వెరసి గత కొన్నేళ్లుగా ద్విచక్ర వాహన పరిశ్రమను మించిన వృద్ధిని సాధిస్తోంది. 2013–23 కాలంలో ద్విచక్ర వాహన పరిశ్రమ సగటున 10 శాతం వార్షిక వృద్ధిని అందుకుంది. అయితే విభిన్న ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో, కొత్త కస్టమర్లను జత చేసుకోవడం, ప్రస్తుత కస్టమర్ల నుంచి వాలెట్ షేర్‌ను పెంచుకోవడం ద్వారా పరిశ్రమను మించి ప్రగతి పథంలో పరుగెడుతోంది. ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగంలో ఎలక్ట్రిక్ సాంకేతికతలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) మార్పు కారణంగా అల్యూమినియం లైట్‌వెయిటింగ్ పరికరాల విభాగంలో కిట్ విలువ బలపడుతోంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.